

ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి

ప్రభాత
వెలుగు
29.01.2019
www.v6velugu.com
మంగళవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 343 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | JAGTIAL | WARANGAL



జనరల్
తుది విడత పంచాయతీ రేపే
ఏకగ్రీవాలుపోగా 3,529 గ్రామపంచాయతీలకు బుధవారం పోలింగ్ జరుగనుంది.
03



జనరల్
మార్చి తొలివారంలో ఎన్నికల షెడ్యూల్?
సాధారణ ఎన్నికల ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు మొదలుపెట్టింది.
03



జనరల్
రాసినంక రద్దు చేసిండ్రు
సోమవారం జరిగిన ఎంబీబీఎస్ సెకండియర్ పరీక్షను కాళోజీ వర్సిటీ రద్దు చేసింది.
04



బిజినెస్
కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు
బడ్జెట్ భయంతో సెన్సెక్స్ 368 పాయింట్లు, నిఫ్టీ 100 పాయింట్లు నష్టపోయాయి.
10

కేంద్రంలో అధికారం ఎవరికి? పీఎం ఎవరు?

- హంగ్‌ను సూచిస్తున్న సర్వేలు
- బీజేపీకి తగ్గినా మోడీకి అదే ఆకర్షణ
- గేమ్ మార్చిన యూపీ మహాకూటమి
- కాంగ్రెస్ బలపడ్డా మెజారిటీకి దూరమే
- 15 సీట్లు దాటే పార్టీలే కింగ్ మేకర్లు
- కీలకంగా మారుతున్న కేసీఆర్ ఫ్రంట్



ఎవరి నసీబ్ ఎట్లుంటదో?

వెలుగు బ్యూరో:
లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడడం.. కేంద్ర ప్రభుత్వం దూకుడుగా తీసుకుంటున్న నిర్ణయాలు.. వరుసగా వస్తున్న జాతీయ స్థాయి సర్వేలు రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. జాతీయ మీడియా సంస్థలు చేసిన పలు సర్వేలు రాబోయేది హంగ్ పార్లమెంట్ అన్న అంచనాలు ఇస్తున్నాయి. అధికార ఎన్డీయేకి మెజారిటీ కష్టమేనన్న విశ్లేషణలు చేస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్‌లకు దూరంగా ఉన్న కొన్ని పార్టీలు కీలకం కావచ్చని చెబుతున్నాయి. ఇన్ని సమీకరణాల మధ్య ప్రధాని పదవి ఎవరికి దక్కే అవకాశం ఉందన్నది ఆసక్తికరంగా మారింది. కొన్ని జాతీయ మీడియా సంస్థలు, సర్వే సంస్థలు ప్రకటించిన సర్వేలు దాదాపు దగ్గరగా ఉండడం గమనార్హం. అధికార ఎన్డీయే మెజారిటీని అందుకోలేదనీ, యూపీఏ గతంలో కంటే బలపడుతుందనీ, మొత్తం మీద ఏ కూటమిలో కలవని పార్టీలే కీలకం అవుతాయన్న అంచనాలు వస్తున్నాయి. ఏదేమైనా హంగ్ తప్పదని సర్వేలు తేల్చిచెప్పాయి. వీటి ఆధారంగా ప్రధాని ఎవరవుతారన్న అభిప్రాయానికి ఇప్పుడే రావడం కష్టమంటున్నారు రాజకీయ విశ్లేషకులు. కాబోయే ప్రధానిని నిర్ణయించే కీలక అంశాలు చాలా ఉన్నాయని చెబుతున్నారు. ఎన్నికలు జరగడానికి ఇంకా మూడునెలల టైం ఉండడంతో జనాభిప్రాయం మారడానికి చాలా అవకాశాలు ఉన్నాయంటున్నారు.

మిగతా 3లో

బీసీ గురుకులాలకు 3,689 పోస్టులు

మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు
595 ఔట్ సోర్సింగ్ పోస్టులకూ అనుమతి

హైదరాబాద్, వెలుగు:
రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్న బీసీ గురుకులాల కోసం 3,689 పోస్టులు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే విద్యా సంవత్సరం ఈ గురుకులాలు ప్రారంభం కానున్నాయి. వీటితోపాటు 595 ఔట్ సోర్సింగ్ పోస్టులకూ ఆర్థికశాఖ ఓకే చెప్పింది. హైదరాబాద్‌లోని బీసీ రెసిడెన్షియల్ సొసైటీ ప్రధాన కార్యాలయంలో 28 రెగ్యులర్, పది ఔట్ సోర్సింగ్ పోస్టులకు అనుమతి లభించింది.

ఇవీ పోస్టులు
రెగ్యులర్ పోస్టుల్లో ప్రిన్సిపల్ 119, జూనియర్ లెక్చరర్ 833, పీజీటీ 833, టీజీటీ 1,071, ఫిజికల్ డైరెక్టర్ 119, పీఈటీ 119, లైబ్రేరియన్ 119, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ ఇన్‌స్ట్రక్టర్లు 119, స్టాఫ్ నర్స్ 119, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ పోస్టులు 119 ఉన్నాయి. నాలుగేళ్ల పాటు వీటి భర్తీ ప్రక్రియ ఉంటుంది. 2019-20 విద్యా సంవత్సరంలో 1,904, 2020-21లో 833, 2021-22లో 119,

మిగతా 2లో



కివీస్ కోట బద్దలు

మూడో వన్డేలో టీమిండియా గ్రాండ్ విక్టరీ

టీమిండియా మరోసారి అదరగొట్టింది. ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించిన కోహ్లీ సేన.. న్యూజిలాండ్‌లో పదేళ్ల విరామం వన్డే సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆల్‌రౌండ్ షోతో మూడో వన్డేలోనూ విజయం సాధించింది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో హోమ్‌టీమ్‌ను 243 పరుగులకే ఆలౌట్ చేసిన ఇండియా.. రోహిత్, కోహ్లీ హాఫ్ సెంచరీలతో పాటు అంబటి రాయుడు, దినేశ్ కార్తీక్ మెరుపులతో టార్గెట్‌ను సులువుగా ఛేజ్ చేసింది. కివీస్‌ను ఏడు వికెట్లతో చిత్తు చేసి.. ఐదు వన్డేల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో గెలుచుకుంది.

11

అకౌంట్ల పైసలేేస్తం

మేమొస్తే పేదలకు కనీస ఆదాయ పథకం • రాహుల్ సంచలన ప్రకటన

- ఇది చరిత్రాత్మకం.. ఇదే మా విజన్
- పేదరికంతో నవ భారత్ అసాధ్యం
- 'గరీబీ హటావో'కు కట్టుబడి ఉన్నాం
- చత్తీస్‌గఢ్ సభలో కాంగ్రెస్ చీఫ్ హామీ
- తర్వాత ట్విటర్‌లోనూ ప్రస్తావన
- కాంగ్రెస్ వందలాది హామీల్లో
- ఇదీ ఒకటని బీజేపీ పెదవి విరుపు



చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో మహిళా రైతుకు రుణమాఫీ పత్రం అందజేస్తున్న రాహుల్‌గాంధీ

రాయ్‌పూర్/న్యూఢిల్లీ:
కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సంచలన ప్రకటన చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి పేదకు కనీస ఆదాయం సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ప్రపంచంలో ఎక్కడా లేని మినిమం ఇన్‌కం గ్యారంటీ (కనీస ఆదాయ హామీ) పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఇది చరిత్రాత్మక నిర్ణయమని, దీనికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. 'ఇది మా విజన్.. ఇదే మా హామీ' అంటూ ప్రకటించారు. అర్హులైన వారందరికీ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని రాహుల్‌గాంధీ తెలిపారు. 'దేశంలోని లక్షలాది మంది అక్కా చెల్లెళ్లు, అన్నాదమ్ముళ్లు పేదరికంలో మగ్గుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే నవ భారత్ నిర్మాణం ఎలా సాధ్యమవుతుంది? నవ భారత్‌ను నిర్మించాలంటే

మిగతా 2లో

పేదల చుట్టూ 'పైసల' పాలిటిక్స్ 02



మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లిలో నీట మునిగిన ధాన్యం బస్తాలు

తగ్గని వాన.. వదలని చలి

రాష్ట్రంలో మూడోరోజూ వర్షాలు


- ఖమ్మం జిల్లా కొణిజర్లలో అత్యధికంగా 8 సెంటీమీటర్లు
- టెంపరేచర్ తగ్గిపోయి వణికిస్తున్న చలిగాలులు
- మెదక్‌లో 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి: వాతావరణ శాఖ

04

ఇట్లయితే దిగిపోత

కాంగ్రెస్‌కు కుమారస్వామి హెచ్చరికలు

సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా అభివృద్ధి కార్యక్రమాలేవీ జరగడం లేదని, సిద్ధరామయ్య సీఎం కావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే సోమశేఖర చేసిన వ్యాఖ్యలు కర్ణాటకలో కలకలానికి దారితీశాయి. ఈ మాటలపై ఆ రాష్ట్ర సీఎం కుమారస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతల తీరు మారకుంటే తాను పదవి నుంచి దిగిపోవడానికి వెనుకాడబోనని హెచ్చరించారు. తనను అగౌరవపరిస్తే వారికే నష్టమని చెప్పారు. దీంతో కాంగ్రెస్ సీనియర్లు కలగజేసుకుని పరిస్థితిని చల్లబరిచారు.



05



స్టీల్ ఉత్పత్తిలో రెండో ప్లేస్‌కు..

ఉక్కు ఉత్పత్తిలో జపాన్‌ను వెనక్కి నెట్టేసి ఇండియా ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరుకుంది. అంతకు ముందటి ఏడాదికన్నా 2018లో 106.5 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసింది. 928 మిలియన్ టన్నుల ఉత్పత్తితో చైనా టాప్‌లో కొనసాగుతోంది.


10

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
83.00	83.00	83.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
84.00	83.00	82.00

కేడర్ తేలితేనే కొలువులు

- కొత్త జోన్ల లెక్కన సర్వీస్ రూల్స్ మార్చని ప్రభుత్వ శాఖలు
- నోటిఫికేషన్ల జారీకి ఇదే అడ్డంకి
- ఆర్థికశాఖ ఓకే చెప్పినా రిక్రూట్‌మెంట్ చేపట్టలేని పరిస్థితి
- లోక్‌సభ ఎలక్షన్ షెడ్యూల్ వచ్చేలోగా తేలకుంటే ఇబ్బందే
- మరో రెండు, మూడు నెలలు జాప్యమయ్యే అవకాశం




హైదరాబాద్, వెలుగు:
రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కేడర్ల విభజన ఆటంకంగా మారుతోంది. ఖాళీల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చినా కొత్త జోనల్ విధానం మేరకు సర్వీస్ రూల్స్‌ను ఇంకా తేల్చకపోవడం ఇబ్బందికరంగా మారింది. దీంతో టీఎస్‌పీఎస్సీ సహా మిగతా రిక్రూట్‌మెంట్ బోర్డులు కొత్త నోటిఫికేషన్లు ఇవ్వలేకపోతున్నాయి. నెల రోజుల్లో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశముంది. ఆలోగా కేడర్ సిస్టం విషయంపై స్పష్టత వస్తేనే కొలువుల భర్తీ ముందుకుపడుతుంది. లేకపోతే ఎన్నికలు పూర్తయ్యే దాకా ఎదురు చూపులు తప్పని పరిస్థితి ఉండనుంది.

కొత్త కేడర్ల ఖరారు కోసం..
తెలంగాణ ఏర్పాటయ్యాక టీఆర్ఎస్ సర్కారు రాష్ట్రాన్ని 31 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించింది. ఉమ్మడి ఏపీలో తెలంగాణ ప్రాంతం 4, 5 జోన్లలో భాగంగా ఉండేది. అయితే ఈ జోన్లను కూడా పునర్వవస్థీకరిస్తూ.. కొత్త రాష్ట్రంలో స్థానికులకే ఎక్కువగా అవకాశాలు దక్కేలా కొత్త జోనల్ విధానాన్ని తీసుకువచ్చింది. దీనికి గతేడాది ఆగస్టు 30న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర వేశారు. 'తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (ఆర్గనైజేషన్ ఆఫ్ లోకల్ కేడర్స్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) ఆర్డర్-2018'గా ఈ గెజిట్‌ను పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి 124 జీవో జారీ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371(డి) ప్రకారం 1975 అక్టోబర్ 18న రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులకు లోబడి కొత్త జోనల్ విధానానికి ఆమోదముద్ర వేసినట్టు వెల్లడించారు. దీని ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగాలను జిల్లా, జోనల్, మల్టీ జోనల్, స్టేట్ కేడర్, సివిల్ సర్వీసెస్ కేడర్‌గా వర్గీకరిస్తూ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను 36 నెలల్లోగా పూర్తి చేయాలి. లేనిపక్షంలో మళ్లీ రాష్ట్రపతి ఆమోదించి గెజిట్ విడుదల చేయాల్సి ఉంటుంది. కొత్త జోనల్ వ్యవస్థకు ఆమోదం తెలిపిన మరుసటి రోజే ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల భర్తీకి పంచాయతీరాజ్ శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. సాధారణ పరిపాలన శాఖ జారీ చేసిన జీవో నం.124 ప్రకారం ఈ పోస్టులన్నీ జిల్లా కేడర్‌వేనని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మూడేళ్ల తర్వాత

మిగతా 2లో

జర్నలిస్టు కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అవార్డు

- పద్మా సచ్‌దేవ్ కవితల్ని అనువదించినందుకు పురస్కారం



న్యూఢిల్లీ, వెలుగు: సీనియర్ జర్నలిస్టు, కవి ఎ.కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ప్రముఖ డోగ్రీ కవయిత్రి పద్మా సచ్‌దేవ్ రాసిన కవితల్ని తెలుగులో అనువదించినందుకు సోమవారం ఆయనకు అవార్డు ప్రకటించింది. భారత స్త్రీ ఎదుర్కొనే సామాజిక అన్యాయం, సుఖ దుఃఖాలతోపాటు దేశ విభజనపుడు తండ్రిని పోగొట్టుకున్న కవయిత్రి మానసిక వేదనను కృష్ణారావు తన కవితల్లో అద్భుతంగా వ్యక్తీకరించారని అకాడమీ ప్రశంసించింది. మహబూబ్‌నగర్‌కు చెందిన కృష్ణారావుకు ఈ అవార్డు రావడం పట్ల సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. పాత్రికేయ, సాహిత్య రంగంలోనూ మరింత ఎదిగి రాష్ట్రానికి పేరు తేవాలని ఆకాంక్షించారు.

పోలవరంపై సుప్రీంకు..

త్వరలో ఇరిగేషన్ శాఖ పిటిషన్



హైదరాబాద్, వెలుగు : పోలవరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనుంది. పోలవరం నిర్మాణంతో తమ భూభాగం ముంపునకు గురవుతుందని ఒడిశా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌లో తెలంగాణ ఇంప్లీడ్ అయింది. పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదిత వరద సామర్థ్యం 35 లక్షల క్యూసెక్కులైతే 50 లక్షలకు పెంచారు. వరద సామర్థ్యాన్ని పెంచాక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు రాలేదు. ఒడిశాలోని అటవీ ప్రాంతం ఎక్కువగా మునిగిపోతోందంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పోలవరం తాజా డిజైన్‌తో భద్రాచలం రామాలయంతోపాటు పట్టణం, మణుగూరు భారజల కేంద్రం, సారపాక, బూర్గంపాడు తదితర ప్రాంతాలు ముంపునకు గురి కానున్నాయి. దీన్ని నివారించడానికి పటిష్టమైన కరకట్టలు నిర్మించాలని తెలంగాణ తన వాదన వినిపించింది. ఒడిశా పిటిషన్‌లో తెలంగాణ ఇంప్లీడ్ అవడం వల్ల ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరడం సాంకేతికంగా వీలు కాదని ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది. దీంతో ముంపు ప్రాంతాల రక్షణకు పిటిషన్ వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మర్రి పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, వెలుగు: పోలవరం ముంపు మండలాల ఓటర్లను ఏపీలో కలపడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నేత మర్రి శశిధర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. 7 మండలాల్లోని ఓటర్లను ఏపీలో కలుపుతూ ఈసీ ఇచ్చిన నోటిఫికేషన్‌పై దాఖలైన పిటిషన్‌ను కోర్టు సోమవారం విచారించింది. ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధంగా జరిగిందని శశిధర్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న తర్వాత కేసులో జోక్యం చేసుకోలేమని కోర్టు చెప్పింది. ఈ విషయమై శశిధర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేయగా కొట్టేసింది. దీంతో సుప్రీంను ఆశ్రయించారు.

హెచ్‌ఎండీఏ కమిషనర్ జనార్దన్‌రెడ్డి బదిలీ

అరవింద్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు



హైదరాబాద్, వెలుగు: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) కమిషనర్ బి.జనార్దన్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్‌కు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించింది. ప్రస్తుతం జనార్దన్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నారు. విదేశాల నుంచి రాగానే సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అప్పుడే లోక్‌సభ ఎన్నికల వేడి రాజుకుంది. పేదలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీలు వ్యూహాల మీద వ్యూహాలు రచిస్తున్నాయి. ఓ వైపు తిరిగి అధికారాన్ని చేపట్టేందుకు బీజేపీ.. మరోవైపు పూర్వవైభవాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లలో 10శాతం కోటా కేటాయిస్తూ ఇటీవల మోడీ సర్కార్ చట్టాన్ని తీసుకువచ్చింది. రేపోమాపో మరిన్ని హామీలు ప్రకటించనుందని కథనాలు వస్తున్నాయి. ఇంతలో రాహుల్‌గాంధీ సంచలన ప్రకటన చేశారు. అధికారంలోకి వస్తే పేదలందరికీ కనీస ఆదాయం సమకూరుస్తామని హామీ ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది.

పేదల చుట్టూ పైసల పాలిటిక్స్



రాహుల్ ప్రకటన వెనుక మర్మమేంది?

బీజేపీ ఆలోచనకు గండికొట్టారా?

- ఎన్నికల వేళ తెరపైకి సరికొత్త హామీలు
- అమలు సాధ్యమేనా?
- మోడీ సర్కార్ బడ్జెట్‌పై అందరి చూపు

సెంట్రల్ డెస్క్:

'దేశంలో పేదలు, ధనికుల మధ్య ఆర్థిక అసమానతలు అందనంత స్థాయిలో వృద్ధిచెందుతున్నాయి. 10 శాతం జనాభా వద్దే 77.4 శాతం సంపద ఉంది. ఇందులో 1 శాతం జనాభా వద్ద 51.53 శాతం సంపద ఉంది'.. ఇదీ ఇటీవల అంతర్జాతీయ హక్కుల సంస్థ 'ఆక్స్‌ఫామ్' వెల్లడించిన కఠోర వాస్తవం. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతావనిలో పేదవాడు పేదగానే.. ధనికులు ధనికులుగానే ఎదిగిపోతున్నారు. త్వరలో లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఈ అంతరాలు తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ఓటర్లను ఎలాగైనా తమవైపు తిప్పుకోవాలని అటు బీజేపీ.. ఇటు కాంగ్రెస్ దృష్టి సారించాయి. ఆర్థిక అసమానతలు రూపుమాపాలంటే పేదలు ఆర్థికంగా ఎదగాలని ఎన్నో సర్వేలు చెప్పాయి. సార్వత్రిక కనీస ఆదాయం (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం-యూబీఐ) పథకాన్ని తీసుకురావాలని 2017లో భారత ఆర్థిక సర్వే సూచన చేసింది.

రాహుల్ సంచలనం

మూడు హిందీ రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లో అధికారాన్ని కోల్పోయిన బీజేపీ.. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా గట్టెక్కాలని కొత్త కొత్త పథకాలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో మొన్ననే 10శాతం ఈడబ్ల్యూఎస్ కోటాను ప్రకటించింది. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో రైతులను, పేదలను ఆకట్టుకునేందుకు కీలక నిర్ణయాలు తీసుకోనుందని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. యూబీఐని అమలుచేసేందుకు కేంద్రం సీరియస్‌గా కసరత్తు చేస్తోందని, దాన్ని బడ్జెట్‌లో ప్రకటించవచ్చని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. రైతులకు ప్రత్యేక ప్యాకేజీని కూడా అనౌన్స్ చేయొచ్చని అంటున్నాయి. సోమవారం కేంద్ర కేబినెట్ సమావేశంలో వీటికి సంబంధించి ప్రకటన రావొచ్చని ఊహాగానాలు వినిపించినప్పటికీ.. కేబినెట్ సమావేశం జరుగలేదు. ఇంతలో కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ సంచలన ప్రకటన చేశారు. చత్తీస్‌గఢ్‌లో ఏర్పాటు చేసిన రైతుల కృతజ్ఞత సభలో ఆయన 'కనీస ఆదాయ హామీ'ని ప్రకటించారు. అధికారంలోకి వస్తే పేదల బ్యాంకు ఖాతాల్లో పైసలు జమ చేస్తామని, గరీబీ హఠావో నినాదాన్ని కొనసాగిస్తామని తెలిపారు. రాహుల్ ప్రకటనతో బీజేపీ పునరాలోచనలో పడింది. తాము ప్రకటించాలనుకున్న పథకాన్ని రాహుల్ ప్రకటించారని కొందరు బీజేపీ నేతలు అంటున్నారు. ఈ నేపథ్యంలో మోడీ సర్కార్ ప్రవేశపెట్టే బడ్జెట్‌పై అందరి దృష్టి పడింది. రాహుల్ ప్రకటనలాంటిదే బడ్జెట్‌లో ఉంటుందా? మరేమైనా కొత్త నిర్ణయాలు ఉంటాయా? అని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కాంగ్రెస్ రెండేళ్ల నుంచి యూబీఐపై కసరత్తు చేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం తెలిపారు. మొన్ననే తన సోదరి ప్రియాంకకు కాంగ్రెస్‌లో కీలక బాధ్యతలు అప్పగించిన రాహుల్.. తాజాగా ఈ సంచలన ప్రకటన చేయడం రాజకీయంగా వేడిపుట్టిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి తీరాలని ఆయన పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి.

అరవింద్ సుబ్రహ్మణ్యం ఏం చెప్పారు?

2017లో నాటి ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం ఓ ప్రతిపాదన తెచ్చారు. పేదరిక నిర్మూలనకు సార్వత్రిక కనీస ఆదాయం(యూబీఐ) అమలు చేయాలని ఆర్థిక సర్వేలో ఆయన సలహా ఇచ్చారు. యూబీఐని అమలు చేయాలంటే 2017-18 ధరల ప్రకారం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికి సగటున నెలకు రూ.1180 చొప్పున అందించాలి. ఈ లెక్కన ఏడాదికి రూ.19 లక్షల కోట్లు అవసరమవుతాయని అప్పటి అంచనా. యూబీఐ గురించి 2017 బడ్జెట్‌లో మోడీ సర్కార్ ప్రస్తావించినప్పటికీ ఇప్పటివరకు ఎటూ తేల్చలేదు.

త్వరలో సిక్కింలో యూబీఐ

అధికారంలోకి వస్తే సార్వత్రిక కనీస ఆదాయం (యూబీఐ) పథకాన్ని అమలు చేస్తామని మొన్న సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డీఎఫ్) పార్టీ తన మేనిఫెస్టోలో పేర్కొంది. అదే హామీతో గెలిచిన ఆ పార్టీ.. పథకాన్ని అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి యూబీఐ కింద కొంత మొత్తం అందించనుంది. ప్రస్తుతానికి పైలట్ ప్రాజెక్టుగా ఏదో ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసి తర్వాత పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ఆ రాష్ట్ర అధికార వర్గాలు తెలిపాయి. రాహుల్‌గాంధీ కూడా తమ పార్టీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో త్వరలో అమలు చేస్తామని, అటు తర్వాత దేశం మొత్తం విస్తరింపజేస్తామని చెప్పారు.

ఇతర దేశాల్లో ఇలా..

కొన్ని దేశాల్లో యూబీఐ పథకాన్ని ప్రవేశపెట్టినా ముందుకు సాగలేదు. యాంత్రీకరణ వల్ల నిరుద్యోగ సమస్య ఎక్కువైనపుడు ఆ దేశాలు ఇలాంటి పథకాలను అమలు చేశాయి. కెనడాలోని ఒంటారియో రాష్ట్రం 2017 ఏప్రిల్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసింది. 4 వేల మందికి నెలకు 150 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఏడాది గడవక ముందే ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఫిన్‌లాండ్, స్టాక్టన్‌లలో అమలు చేసేందుకు ప్రయత్నించినా అర్ధంతరంగానే ఆగిపోయింది.

నాన్నమ్మ బాటలో రాహుల్



నాన్నమ్మ ఇందిరాగాంధీ నినాదాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ. ఏ ఒక్కరూ ఆకలితో అలమటించొద్దని, పేదరికం నిర్మూలనకు కట్టుబడి ఉన్నామని ఆయన అన్నారు. 'గరీబీ హటావో' నినాదాన్ని కొనసాగిస్తామని తెలిపారు. 1971లో 'గరీబీ హటావో' నినాదంతో ఇందిరాగాంధీ ఎన్నికలకు వెళ్లి రెండోసారి ప్రధాని అయ్యారు. ఇప్పుడు అదే నినాదం రాహుల్‌నూ ముందుకు నడిపిస్తుందని కాంగ్రెస్ శ్రేణులు అంటున్నాయి. అచ్చం నాన్నమ్మ పోలికలున్న చెల్లి ప్రియాంకకు ఈమధ్య పార్టీలో కీలక బాధ్యతలిచ్చిన రాహుల్.. ఇప్పుడు నాన్నమ్మ నినాదాన్ని ఎత్తుకున్నారు.

యూపీఏ హయాంలో ఉపాధి హామీ

2004 నుంచి 2014 వరకు పదేళ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కార్.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజీఎన్‌ఆర్ఈజీఏ)ని ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరికి ఏడాదిలో 100రోజులు ఉపాధి కల్పించడం ఆ పథకం ఉద్దేశం. 2005లో ఈ చట్టాన్ని తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా ఈ పథకం అమలువుతోంది. ఇది తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న 1991లోనే తెరపైకి వచ్చినప్పటికీ.. 2005లో కార్యరూపం దాల్చింది. ఇప్పటికీ ఇదే పథకం కాంగ్రెస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద దిక్కుగా ఉంది. కనీస ఆదాయ హామీ పథకం కూడా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభావం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

కేడర్ తేలితేనే కొలువులు

(మొదటిపేజీ తరువాయి)

రెగ్యులర్ చేసే పోస్టులు కావడం, అన్ని జిల్లా స్థాయివే కావడంతో సంబంధిత శాఖ కేడర్ ఫిక్సేషన్ లేకుండానే భర్తీకి సిద్ధపడింది. అది మినహా ఇతర ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లు విడుదలవలేదు.

భారీగా నోటిఫికేషన్లు..

రాష్ట్రంలో 1.09 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా 1.03 లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం అనుమతినిచ్చింది. 80 వేలకుపైగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. అందులో 40 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేశారు. ఇందులో టీఎస్‌పీఎస్సీ 38 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చి 20 వేల ఉద్యోగాలు భర్తీ చేసింది. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు 9 వేలకు పైచిలుకు పోస్టులు, సింగరేణిలో 4 వేలకుపైగా భర్తీ అయ్యాయి. గురుకుల రిక్రూట్‌మెంట్ బోర్డు ఇప్పటికి 80 మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వగా 2 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేయనున్నారు. మరో 2 వేల మందికి దశల వారీగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది. పెండింగ్‌లో ఉన్న 18 వేల ఉద్యోగాల భర్తీకి తదుపరి ప్రక్రియ కొనసాగుతోంది.

పోస్టులు రెడీగా ఉన్నా..

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 సహా 20 శాఖల్లో 1,948 ఉద్యోగాల భర్తీకి సిద్ధంగా ఉంది. కానీ కేడర్ సిస్టం వల్లే నోటిఫికేషన్ల జారీని వాయిదా వేసుకుంది. గురుకుల రిక్రూట్‌మెంట్ బోర్డు 1,932 ఉద్యోగాలను వచ్చే విద్యా సంవత్సరంలో భర్తీ చేయాల్సి ఉంది. మరో పది వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. వీటి భర్తీకి కేడర్ సిస్టం తప్పని కావడంతో నోటిఫికేషన్ల జారీ ఆలస్యమవుతోంది. పబ్లిక్ సర్వీస్ కమిషన్, గురుకుల రిక్రూట్‌మెంట్ బోర్డులు సంబంధిత శాఖలకు ఇప్పటికే లేఖలు రాశాయి. కానీ జాప్యం జరుగుతోంది.

అకౌంట్ల పైసలేస్తం

(మొదటిపేజీ తరువాయి)

పేదలకు కనీసం ఆదాయం దక్కాలి. పేదరికం, ఆకలిని నిర్మూలించడమే మినిమం ఇన్‌కం గ్యారంటీ లక్ష్యం' అని తెలిపారు. సోమవారం చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన రైతు సభలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. అటు తర్వాత ట్విటర్‌లోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించారు. ఏ ఒక్కరూ ఆకలితో నిద్రపోయే రోజులు ఇక ఉండకూడదని, పేదరికంపై యుద్ధం చేయడానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. 'గరీబీ హటావో నినాదాన్ని కొనసాగిస్తాం. కనీస ఆదాయ హామీతో ప్రతి ఒక్క పేదకు కనీస ఆదాయం సమకూరుస్తాం. ఇది చరిత్రలో నిలిచిపోతుంది' అని రాహుల్ అన్నారు. మొదట ఈ పథకాన్ని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో అమలు చేయాలని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందే ఆయా రాష్ట్రాల్లో వీటిని అమలు చేసే అవకాశం ఉంది.

దేశాన్ని రెండుగా చూస్తున్న మోడీ

దేశాన్ని నరేంద్రమోడీ రెండుగా విభజించి చూస్తున్నారని రాహుల్ ఆరోపించారు. 'నరేంద్రమోడీ, బీజేపీ దేశాన్ని రెండు ఇండియాలుగా విభజించి పాలిస్తున్నాయి. ఒక ఇండియాలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన బడా పారిశ్రామిక వేత్తలు అనిల్ అంబానీ, మెహుల్ చోక్సి, నీరవ్ మోడీతో పాటు నరేంద్ర మోడీ.. మరో ఇండియాలో పేదలు, మధ్యతరగతివారు, రైతులు, యువకులు ఉండేలా చూస్తోంది. మేము ధనిక, పేద అనే రెండు దేశాలుగా ఇండియాను చూడాలనుకోవడం లేదు. ప్రతి పేదకు కనీస ఆదాయం అందిస్తే ఆ సమస్య ఉండదు' అని ఆయన అన్నారు. రైతు రుణమాఫీ గురించి అడిగిన ప్రతిసారి మోడీ సర్కార్ పైసలు లేవంటోందని విమర్శించారు. 'రైతుల రుణాలు మాఫీ చేయడానికి బీజేపీ సర్కార్ దగ్గర పైసలు ఉండవు.. కానీ, దేశంలోనే 15 మంది బడా పారిశ్రామికవేత్తల రూ. 3.5లక్షల కోట్ల రుణాలను మాఫీ చేయడానికి మాత్రం ఉంటాయి' అని దుయ్యబట్టారు. అనిల్ అంబానీకి రూ. 30వేల కోట్ల లబ్ధి చేకూర్చేందుకు రాఫెల్ డీల్‌లో మార్పులు చేసిందని ఆరోపించారు.

రెండేళ్లుగా కసరత్తు

రాహుల్‌గాంధీ చేసిన కనీస ఆదాయ హామీ ప్రకటనపై కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాడు 'గరీబీ హటావో' నినాదంతో ఇందిరాగాంధీ రెండోసారి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు అదే నినాదాన్ని కొనసాగిస్తూ రాహుల్ ఎన్నికలను ఎదుర్కొని విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాహుల్ తాజా ప్రకటన వెనుక రెండేళ్లుగా భారీ కసరత్తు జరుగుతోందని కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం తెలిపారు. పేదరిక నిర్మూలనకు కావాల్సిన వనరులను సమకూరిస్తేనే దేశం ప్రగతి పథంలో సాగుతుందని, అందుకు వనరులు పుష్కలంగా ఉన్నాయని ఆయన మీడియాతో అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తప్పకుండా అమలుచేస్తుందని స్పష్టం చేశారు. యూపీఏ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో 14కోట్ల మందిని పేదరికం నుంచి దూరం చేశామని తెలిపారు. కనీస ఆదాయ హామీ పథకం పూర్తి వివరాలను పార్టీ మేనిఫెస్టోలో వెల్లడిస్తామన్నారు.



చత్తీస్‌గఢ్ సభలో నాగలితో రాహుల్

కాంగ్రెస్ వందలాది హామీల్లో అదీ ఒకటి: బీజేపీ

రాహుల్ ప్రకటనపై కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రకటించే వందలాది హామీల్లో అదీ ఒకటని కొట్టిపారేశారు. 'కాంగ్రెస్ చరిత్ర ఏమిటో ప్రజలకు తెలుసు. ఎన్నికల దృష్ట్యానే ఈ ప్రకటన చేశారు. ఇది ఓ నాటకం. కాంగ్రెస్ ప్రకటించే వందలాది హామీల్లో ఇదీ ఒకటి' అని పేర్కొన్నారు. దేశాన్ని 58ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ వేలాది హామీలు ఇచ్చిందని, అందులో ఎన్ని అమలు చేసిందని ఆయన ప్రశ్నించారు.



గురుకుల విద్యార్థులతో కలిసి సరదాగా కరాటే చేస్తున్న బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ

మైనారిటీ గురుకులాలు అద్భుతం

బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్

హైదరాబాద్, వెలుగు: మైనారిటీ గురుకుల పాఠశాలలు అద్భుతంగా ఉన్నాయని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని మైనారిటీ గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థులను టీచింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. వారి కరాటే విన్యాసాలను తిలకించారు. 'సీఎం కేసీఆర్ విద్యకు ఇస్తున్న ప్రాధాన్యం మిగతా రాష్ట్రాలకు ఆదర్శం. మైనారిటీ గురుకుల పాఠశాలల్లో సౌకర్యాలు బాగున్నాయి. అందరి సమన్వయంతోనే ఇవి చక్కగా నడుస్తున్నాయి' అని ఫ్లెమింగ్ అన్నారు. ఒకేసారి 500 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి వేణుగోపాచారి అన్నారు. ఉమ్మడి ఏపీలో కేవలం120 గురుకులాలే ఉండేవన్నారు. కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని మైనారిటీ గురుకుల పాఠశాలల సెక్రెటరీ షాఫిల్లా అన్నారు. ఇంటర్నేషనల్ నాసా స్పేస్ డెవలప్‌మెంట్ సెమినార్‌లో కూడా తమ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలు నడుస్తున్నాయన్నారు.

స్కూళ్లలో శ్లోకాల పఠనంపై సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్

- రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతుందన్న జస్టిస్ నారిమన్

న్యూఢిల్లీ: స్కూళ్లలో సంస్కృత శ్లోకాల పఠనంపై అభ్యంతరం తెలుపుతూ దాఖలైన రిట్ పిటిషన్‌పై రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరపుతుందని సుప్రీంకోర్టు బెంచ్ నిర్ణయించింది. ఇది కీలకమైన అంశమని, రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేస్తుందని జస్టిస్ రోహింటన్ ఎఫ్ నారిమన్ నేతృత్వంలోని ఇద్దరు జడ్జీల బెంచ్ చెప్పింది. కేంద్రీయ విద్యాలయాల్లో సంస్కృత శ్లోకాలు, హిందీ పద్యాలను తప్పనిసరి చేయడాన్ని సవాలు చేస్తూ జబల్ పూర్ కు చెందిన లాయర్ వినాయక్ షా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై బెంచ్ సోమవారం విచారణ జరిపింది. విద్యార్థులను శాస్త్రీయంగా తీర్చిదిద్దవలసిన స్కూళ్లలో దేవుడిపై ఆధారపడే తత్త్వాన్ని పెంపొందిస్తున్నారని పిటిషనర్ అభ్యంతరం తెలిపారు. 'అసతోమా సద్గమయ' అనే సంస్కృత శ్లోకాన్ని స్కూళ్లలో పఠించడం మతబోధ చేస్తున్నట్లు కాదని కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. క్రిస్టియన్ స్కూళ్లలో 'ఆనెస్టీ ఈజ్ ద బెస్ట్ పాలసీ' అని చెబుతారని, అది మతపరమైనదా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు అధికారిక లోగోలో 'యతో ధర్మస్తతోజయ' (ధర్మం ఉన్న చోటే విజయం) అని ఉందన్నారు. దీనిలో మతపరమైన అంశం ఏదీ లేదన్నారు.



పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గుండెపోటుతో మృతి

హైదరాబాద్, వెలుగు: పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు గుండెపోటుతో చనిపోయారు. సోమవారం తిరుమల శ్రీవారి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉండగా ఆయనకు గుండెపోటు వచ్చింది. వెంటనే తిరుపతిలోని స్విమ్స్ కు తరలించారు. చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు తుదిశ్వాస విడిచారు. సదస్సులో పాల్గొనేందుకు ఆయన తిరుపతిలోని వెంకటేశ్వర పశువైద్య వర్సిటీకి వెళ్లారు. తర్వాత శ్రీవారి దర్శనానికి వెళ్లారు.

బీసీ గురుకులాలకు 3,689 పోస్టులు

(మొదటిపేజీ తరువాయి)

2022-23లో 833 పోస్టులకు రిక్రూట్‌మెంట్ ఉంటుంది. ఔట్ సోర్సింగ్ పోస్టుల్లో ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్ 238, ల్యాబ్ అటెండర్ 238, ఆఫీస్ సబార్డినేట్ 119 పోస్టులున్నాయి. వీటిని వచ్చే విద్యాసంవత్సరమే భర్తీ చేస్తారు.

సొసైటీ కార్యాలయానికి 38 పోస్టులు

హైదరాబాద్‌లోని సొసైటీ కార్యదర్శి కార్యాలయానికి డిప్యూటీ సెక్రటరీ పోస్టు, అసిస్టెంట్ సెక్రటరీ 2, రీజినల్ కో ఆర్డినేటర్ 10, సీనియర్ అసిస్టెంట్ 8, జూనియర్ అసిస్టెంట్ 5 పోస్టులు మంజూరు చేశారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ 2, డేటా ఎంట్రీ ఆఫీసర్ 4, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 4 మంజూరు చేశారు. గురుకులాల్లో స్వీపర్, శానిటేషన్, కుకింగ్, సెక్యూరిటీ ఉద్యోగాలను ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా నియమించుకోవడానికి అనుమతి ఇచ్చారు.

ఎవరి నసీబ్ ఎట్లుంటదో?



(మొదటి పేజీ తరువాయి)

సర్వేల ప్రకారం ఎన్డీయేకు మెజారిటీ దక్కే అవకాశం లేదు. అయితే అవే సర్వేల ప్రకారం ప్రధానమంత్రిగా మోడీ ప్రత్యర్థులకు అందనంత ఎత్తులో ఉన్నారు. వ్యక్తిగతంగా ఆయనకున్న క్రేజ్ పెద్దగా తగ్గలేదు. కొన్ని వర్గాల ఓట్లను కోల్పోయినా మోడీకి కొత్త ఓటర్లు కలిసొచ్చే అవకాశం ఉందని విశ్లేషకుల అంచనా. 2014లో మోడీ ప్రభుత్వం వచ్చాక ఓటర్లుగా నమోదైనవాళ్లు దాదాపు 13 కోట్ల 30 లక్షల మంది ఉన్నారు. వీరంతా 1996 నుంచి 2001 మధ్యకాలంలో పుట్టిన వారే. 2001లో పుట్టిన మిలీనియం జనరేషన్ కూడా ఉండడం విశేషం. వీరిలో చాలామందికి మోడీపై అభిమానం ఉందని బీజేపీ వర్గాల ధీమా. వీరంతా 2019 ఎన్నికల్లో తొలిసారి లోక్‌సభ ఎన్నికల్లో ఓటేయబోతున్నారు. వయసులో 18 నుంచి 23 ఏళ్ల వరకు ఉండే ఈ యూత్ లో మిగతావారి కంటే భిన్నమైన ఆలోచనలు ఉన్నాయని చెబుతున్నారు. నిరుద్యోగం లాంటి అంశాలపై తమకంటే పెద్ద వయసు యువతలో ఉండే వ్యతిరేకత ఈ వర్గంలో పెద్దగా ఉండదని అంచనా వేస్తున్నారు. స్వచ్ఛభారత్, స్కిల్ ఇండియా, అవినీతిపై పోరాటం లాంటి అంశాలపై ప్రభుత్వ ప్రచారాన్ని వీరిలో ఎక్కువమంది నమ్ముతున్నట్లు తెలుస్తోంది. వీటికి భిన్నంగా జరిగే కౌంటర్ ప్రచారం వీరి దృష్టికి చేరే అవకాశాలు తక్కువ. బీజేపీ నష్టపోయే ఓట్లను ఈ వర్గం భర్తీచేస్తుందని ఆ పార్టీ నమ్ముతోంది. ఇండియా టుడే సర్వే ప్రకారం బీజేపీకి వచ్చిన ఓటింగ్ 30 శాతం కాగా ఇది 2014 నాటి ఓట్ల కంటే ఒక్క శాతమే తక్కువ.

కీలక నిర్ణయాలు.. ఆకర్ష పథకాలు


రాజకీయం వేగంగా మారిపోతోంది. రకరకాల నిర్ణయాలు, పథకాలు, ప్రచారాలతో జనాన్ని ఆకర్షించడానికి అన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వ అనుకూల, వ్యతిరేక అంశాలు కూడా ఎన్నికల నాటికి మారిపోయే అవ కాశం ఉంది. ఇటీవలే పెద్ద కులాల్లో పేదలకు 10 శాతం కోటా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనిపై మూడురోజుల్లోనే రాజ్యాంగ సవరణ పూర్తిచేసి అమలుకు సిద్ధమైంది. మరోవైపు అన్ని రకాల కోటాలను ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ అమలుచేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇంకా రైతుబంధు తరహాలో సాయం పథకంపై నిర్ణయం తీసుకోబోతున్నట్లు వార్తలొచ్చాయి. రాబోయే బడ్జెట్లో మరిన్ని జనాకర్షక నిర్ణయాలుంటాయని భావిస్తున్నారు. ఏదేమైనా నోట్ల రద్దు తర్వాత నాటికి ఇప్పటికి అంచనాల్లో ఎన్డీయే బలం తగ్గుతూ వస్తోంది. పట్టును కాపాడుకునే ప్రయత్నంలోనే మోడీ, అమిత్ షా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నిర్ణయాలతో సర్వేలు చెబుతున్న ట్రెండ్ ను ఎంత వరకు మార్చగలుగుతారన్నదే కీలకం కానుంది.

ఉత్తరాదిలో పోయే సీట్లు.. వచ్చే సీట్లు

ఉత్తరప్రదేశ్ లో ఎస్పీ, బీఎస్పీలు మహాకూటమిగా చేతులు కలపడం బీజేపీకి పెద్ద ఎదురుదెబ్బ అవుతుందని సర్వేలన్నీ చెబుతున్నాయి. అయితే ఇదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో సీట్లు పెంచుకోవడంపై బీజేపీ నేతలు సీరియస్ గా దృష్టిపెట్టారు. యూపీలో కూటమి వల్ల బీజేపీ 45 నుంచి 55 సీట్ల వరకు నష్టపోవచ్చని సర్వేల అంచనా. సర్వేల ప్రకారం జాతీయ స్థాయిలో బీజేపీ మొత్తంగా నష్టపోతున్న సీట్లు కూడా దాదాపు అదే స్థాయిలో ఉన్నాయి. ఇటీవల మూడు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా బీజేపీ నష్టపోయే మొత్తం సీట్లు, యూపీలో కోల్పోయే సీట్లు సమానంగా ఉండడం ఆసక్తి కలిగిస్తోంది. దీన్ని బట్టి యూపీలోనే అసలు సవాలు ఉందనీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ లలో పట్టునిలబెట్టుకుంటామన్న ధీమా బీజేపీలో కనిపిస్తోంది. ఇదే సమయంలో యూపీ నష్టాన్ని తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో భర్తీ చేసుకునే ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా ఒడిశా, పశ్చిమబెంగాల్, అసోం లాంటి రాష్ట్రాల్లో దూకుడుగా ప్రచారం సాగిస్తోంది.

మెజారిటీకి కాంగ్రెస్ ఎంత దూరం?

కాంగ్రెస్ ఇప్పటి కంటే ఎక్కువగానే సీట్లు పెంచుకుంటున్నట్లు సర్వేలు చెబుతున్నా బీజేపీతో పోలిస్తే ఆ పార్టీ చాలా వెనుకబడింది. కాంగ్రెస్ ఎంత బలపడినా 100 సీట్లకు అటూఇటుగానే ఉంది. బీజేపీకి కీలకమైన హిందీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్ని ఎక్కువ సీట్లు గెలిచినా గరిష్టంగా 150 దాటే అవకాశం లేదు. యూపీఏగా కూడా మెజారిటీకి దూరంగానే కనిపిస్తోంది. మరిన్ని పార్టీల మద్దతు తీసుకోవాల్సిన పరిస్థితి. కాంగ్రెస్ కున్న ఒకే ఒక్క ఆశ బీజేపీ తర్వాత రెండో బలమైన పక్షంగా ఎదిగే అవకాశం మాత్రమే. అయినా రాహుల్ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. తాము వస్తే దేశమంతా రైతు రుణమాఫీ చేస్తామని రాహుల్ ముందుగానే ప్రకటించారు. ఇప్పుడు ఏకంగా పేదలందరికీ కనీస ఆదాయ పథకం తెస్తామని హామీ ఇచ్చారు. ప్రియాంకను క్రియాశీల రాజకీయాల్లోకి తేవడం ద్వారా యూపీలో పట్టుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆమె రాకతో దేశ వ్యాప్తంగా కేడర్ లో జోష్ వస్తుందని కాంగ్రెస్ నేతలు నమ్ముతున్నారు.



మాయావతి దారెటు?



అందరు నేతల్లోనూ రాజకీయంగా ఎలాంటి ప్రకటనలు చేయకుండా మౌనంగా ఉంటున్నారు బీఎస్పీ అధినేత మాయావతి. వచ్చే ఎన్నికల తర్వాత సమీకరణాల్లో కీలకంగా మారే అవకాశాలు ఆమెకు ఎక్కువగా ఉన్నాయంటున్నారు విశ్లేషకులు. యూపీలో చిరకాల ప్రత్యర్థి సమాజ్ వాదీతో చేతులు కలిపిన ఆమె బీజేపీని ఢీకొట్టడానికి సిద్ధమయ్యారు. అంచనాల ప్రకారం బీఎస్పీకి గణనీయమైన సీట్లు వచ్చే అవకాశం ఉంది. కచ్చితంగా పడే దళిత ఓటు బ్యాంకే ఆమె బలం. అందుకే కాంగ్రెస్ కు దూరంగా ఎస్పీతో కూటమి కట్టారు. దీంతో ఫలితాల తర్వాత ఆమె ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే అవకాశం ఉంది. గతంలో బీజేపీతో కలిసి పనిచేసిన ట్రాక్ రికార్డు కూడా ఆమెకు ఉంది. ఫలితాల తర్వాత పరిస్థితిని బట్టి బీజేపీ నేతలు ఆమె సాయం కోసం ప్రయత్నించే అవకాశం లేకపోలేదు. దీంతో ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

అందుకే కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్!



ఓట్లు, సీట్ల లెక్క ఎలా ఉన్నా బీజేపీ, కాంగ్రెస్ కూటముల్లో లేని పార్టీలు చాలా సీట్లు గెలుచుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. సర్వేల ప్రకారం అవన్నీ కలిపి 150 సీట్ల వరకు ఉండడం ఆసక్తి రేపుతోంది. కనీసం 15 సీట్లు అంతకుమించి సాధించే పార్టీలు ఎన్నికల తర్వాత కీలకంగా మారనున్నాయి. ఈ జాబితాలో ముందుగా వినిపిస్తున్న పేరు టీఆర్ఎస్ అధినేత కేసీఆర్. మంచి సీట్లు సాధించి కీలకంగా మారే అవకాశం ఉన్న పార్టీలను ఒకతాటిపైకి తేవడానికి ఆయన కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు దూరంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు ద్వారా ఎన్నికల తర్వాత మూడో పక్షంగా కీలకపాత్ర పోషించే అవకాశం ఉందని ఆయన అంచనా వేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆయన ఒడిశాలో బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్, పశ్చిమబెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీతో చర్చలు జరిపారు. యూపీలో బీఎస్పీ అధినేత మాయావతి, ఎస్పీ అధినేత అఖిలేశ్‌నూ కలుపుకొనే ప్రయత్నం చేస్తున్నారు. అటు ఏపీలోనూ వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డితోనూ చర్చలు జరుపుతున్నారు. హంగ్ ఫలితం వస్తే వీరంతా కీలకంగా మారనున్నారు. దీంతో ప్రధానమంత్రి కావాలని కోరుకునే నేతల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇక సమీకరణాలు ఎలా ఉన్నా రెండు కూటమిల్లో లేని లెఫ్ట్ పార్టీలు, ఎస్పీ ఎన్నికల తర్వాత ఎన్డీయేతో కలిసే అవకాశం లేదు.

రేపు తుది విడత ‘పంచాయతీ’

3,504 పంచాయతీలకు 11,664 మంది సర్పంచ్ అభ్యర్థుల పోటీ

హైదరాబాద్, వెలుగు: పంచాయతీ ఎన్నికల తుది విడత పోలింగ్ బుధవారం జరుగనున్నది. 4, 116 సర్పంచులు, 36, 729 వార్డు సభ్యుల ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చింది. వాటిలో 577 పంచాయతీలు, 8,959 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మరో 10 పంచాయతీలు, 188 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం లేదు. మిగతా 3,504 పంచాయతీల్లో సర్పంచు పదవులకు 11,664 మంది పోటీలో ఉన్నారు. ఉదయం 7 నుంచి ఒంటి గంట దాకా పోలింగ్, మధ్యాహ్నం 2 నుంచి కౌంటింగ్ ఉంటాయి.

25 పంచాయతీల్లో పోలింగ్ నిలిపివేత

భూపాలపల్లి జిల్లా మంగపేట మండలంలో పంచాయతీ ఎన్నికలపై హైకోర్టు స్టే ఇచ్చింది. మండలంలో 25 పంచాయతీలను ఎస్టీలకు రిజర్వ్ చేస్తూ పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. అయితే దీనిపై గిరిజనేతరులు కోర్టుకు వెళ్లారు. సోమవారం కేసును విచారించిన హైకోర్టు ఆ పంచాయతీల్లో ఎన్నికలు ఆపేయాలంటూ స్టే ఇచ్చింది.


తిట్టింది మోడీనే..

గడ్కరీ వ్యాఖ్యలపై కాంగ్రెస్.. కాంగ్రెస్‌నే తిట్టారన్న బీజేపీ

న్యూఢిల్లీ: ‘హామీలిచ్చి నెరవేర్చకపోతే రాజకీయ నాయకులకు ప్రజలు పబ్లిక్‌లోనే బడితెపూజ చేస్తార’న్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీలు పరస్పరం విమర్శలు గుప్పించుకుంటున్నాయి. ‘ఓవైపు చూస్తూ మరోదాన్ని లక్ష్యంగా చేసుకున్నట్టు’ ప్రధానిని చూస్తూనే గడ్కరీ మాట్లాడారని కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ అన్నారు. కేంద్ర మంత్రి ప్రకాశ్ జవడేకర్ మాత్రం.. గతంలో కాంగ్రెస్ దేశాన్ని ఎంతలా నాశనం చేసిందో, మోడీ నాయకత్వంలో దేశం ఎలా అభివృద్ధి చెందుతోందో గడ్కరీ వివరించారన్నారు.

మార్చి తొలి వారంలో ‘లోక్‌సభ’ షెడ్యూల్?

- అధికారుల బదిలీలు, పోస్టింగులపై రాష్ట్రాలకు ఈసీ లేఖ
- సీఈవో, సీఎస్, డీజీపీలతో ఢిల్లీ నుంచి వీడియోకాన్ఫరెన్స్
- రాష్ట్రంలో ఎలక్షన్ నిర్వహణకు రూ.350 కోట్లు అవసరం: రజత్



న్యూఢిల్లీ/హైదరాబాద్, వెలుగు: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మార్చి తొలి వారంలో వెలువడే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్, మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరిగే అవకాశాలున్నట్టు సమాచారం. ఈ మేరకు ఎన్నికల ఏర్పాట్లలో కేంద్ర ఎన్నికల కమిషన్ నిమగ్నమైంది. పోలింగ్ సిబ్బంది ఎంపికకు సంబంధించిన మార్గదర్శకాలతో అన్ని రాష్ట్రాలకు సోమవారం లేఖ రాసింది. రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలు, పోలింగ్ విధులు నిర్వహించే ప్రభుత్వ అధికారుల బదిలీలు, కొత్త పోలింగ్ సిబ్బంది ఎంపిక వివరాలను అందులో పేర్కొంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిబ్రవరి 28వ తేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు పూర్తిచేయాలని స్పష్టం చేసింది. సొంత జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వరాదని సూచించింది. గత నాలుగేళ్ల కాలంలో వరుసగా మూడేళ్లు ఒకే జిల్లాలో పనిచేసిన ఉద్యోగులను లోక్‌సభ ఎన్నికల విధుల బాధ్యతల్లోకి తీసుకోరాదని సూచించింది. 2019 మార్చి 31 నాటికి ఒకే జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగులకు అదే జిల్లాలో పోస్టింగ్ ఇవ్వరాదని పేర్కొంది. అలాగే 2017 మే 31వ తేదీకి ముందు సాధారణ ఎన్నికలు, ఉప ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన జిల్లా ఎన్నికల అధికారులు (డీఈవో), ఆర్వో, ఏఆర్వో, ఎస్ఐలకు మళ్లీ పోస్టింగ్‌లు ఇవ్వరాదని సూచించింది. గతంలో మాదిరిగా లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఒకేసారి ఈసీ ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. 2014లో కూడా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ మార్చి 5నే ప్రకటించింది.

5న మళ్లీ సమావేశం

సోమవారం ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి సునీల్ అరోరా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రం నుంచి సీఈవో రజత్‌కుమార్, సీఎస్ ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఓటరు నమోదుకు వస్తున్న స్పందనను రజత్ వివరించారు. అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించినట్లుగానే లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా జరిపేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని సీఎస్ తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లకు మెరుగైన వసతులు కల్పిస్తామని, దివ్యాంగులకు వసతులపై ఈసీ ప్రశంసించిన అంశాన్ని గుర్తుచేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు జరుపుతామన్నారు. కాగా, ఎన్నికల భద్రత అంశంపై ఫిబ్రవరి 5వ తేదీన సరిహద్దు రాష్ట్రాల సీఎస్, డీజీపీలతో ఈసీ సమావేశం కానుంది.

ప్రశాంతంగా నిర్వహించేందుకు సిద్ధం: డీజీపీ

ఎన్నికల భద్రత అంశాలపై ఈసీకి డీజీపీ మహేందర్‌రెడ్డి నివేదికలు అందజేశారు. అసెంబ్లీ ఎన్నికలు ఎలాంటి హింసాత్మక సంఘటనలకు ఆస్కారం లేకుండా జరిగాయని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే రెండు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాయని, మూడో, తుది విడత ఎన్నికలు 30న జరుగుతాయని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నామని వివరించారు. భద్రత బలగాలను కేటాయించాలని కోరారు. ముఖ్య కార్యదర్శులు సోమేశ్ కుమార్, రాజీవ్ త్రివేది, అడిషనల్ డీజీ జితేందర్, ఎన్నికల కమిషన్ అధికారులు ఆమ్రపాలి, సత్యవాణిలతోపాటు ఆదాయపన్ను శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో 2.5 లక్షల మంది

రాష్ట్రంలో దాదాపు 2.5 లక్షల మంది ఉద్యోగులు లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లు పూర్తి కావొచ్చాయి. లోక్‌సభ ఎన్నికల నిర్వహణ ఖర్చు మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ప్రాథమికంగా రాష్ట్రంలో రూ.350 కోట్లు అవుతాయన్న అంచనాలను ఈసీకి నివేదించాం. శాంతి భద్రతల అంశాలపై ఈసీకి కొన్ని సూచనలు చేశాం.

- సీఈవో రజత్‌కుమార్

కాంగ్రెస్ ‘ఆపరేషన్ సౌత్’

దక్షిణ తెలంగాణలో ఐదు సీట్లపై గురి ■ కసరత్తు చేస్తున్న పీసీసీ



- ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, భువనగిరితోపాటు మహబూబాబాద్ సీట్లు నెగ్గేందుకు వ్యూహం
- టికెట్లు ఆశిస్తున్న సీనియర్ నేతలు

హైదరాబాద్, వెలుగు: లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్ర కాంగ్రెస్ సమాయత్తమవుతోంది. ఉత్తర తెలంగాణలో కన్నా దక్షిణ తెలంగాణపైనే ఎక్కువ ఫోకస్ పెడుతోంది. ఈ ప్రాంతంలో కనీసం 5 ఎంపీ సీట్లను సాధించేందుకు ఇప్పట్నుంచే ‘ఆపరేషన్ సౌత్’ పేరుతో కసరత్తు చేస్తోంది. ఖమ్మం, మహబూబ్ నగర్, నల్లగొండ, భువనగిరితోపాటు దక్షిణ తెలంగాణను ఆనుకొని ఉన్న మహబూబాబాద్ సీటును గెలుచుకునేందుకు వ్యూహం రచిస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్ బలంగా నిలబడింది. ఆయా చోట్ల ఎమ్మెల్యేల స్థానాలను గెల్చుకున్నందున లోక్‌సభ పోటీలో కొంత అనుకూలత ఉంటుందని హస్తం పార్టీ భావిస్తోంది. రాష్ట్రం మొత్తమ్మీద ఈ ఐదు సీట్లకే కాంగ్రెస్ నేతల నుంచి పోటీ ఎక్కువగా ఉండనుంది.

ఖమ్మంలో ఏంటి పరిస్థితి?

ఖమ్మం జిల్లా నుంచి కాంగ్రెస్‌కు ఆరుగురు ఎమ్మెల్యేలున్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కది కూడా ఇదే జిల్లా కావడంతో ఈ సీటు కాంగ్రెస్ కు ప్రతిష్టాత్మకంగా మారనుంది. ఖమ్మం నుంచి మళ్లీ పోటీ చేసేందుకు కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి సిద్ధమవుతున్నారు. అయితే ఆమె అభ్యర్థిత్వాన్ని ఆ పార్లమెంట్ స్థానం పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తుండడంతో అక్కడి రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఇక్కడ్నుంచి పోటీకి చాలా మంది రెడీగా ఉన్నా ఇప్పుడే బయటపడేందుకు ఇష్టపడడం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

భువనగిరిపై ఎందరికో ఆశలు

భువనగిరి ఎంపీ టికెట్ పై గూడూరు నారాయణ రెడ్డి ఆశలు పెట్టుకున్నారు. పీసీసీ మాజీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య కూడా ఇక్కడ్నుంచి పోటీకి ప్రయత్నాలు ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన జనగామ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. వీరిద్దరితోపాటు ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీ మధుయాష్కీ కూడా ఇక్కడ్నుంచి పోటీకి రెడీ అవుతున్నారు. సొంత జిల్లా కావడంతో నల్లగొండ, భువనగిరి స్థానాల్లో గెలుపు పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కు సవాల్‌గా మారనున్నాయి.

నల్లగొండలో పోటాపోటీ

అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన సీనియర్ నేతలు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ ఎంపీ సీటు కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఒకవేళ తనకు టికెట్ ఇవ్వకుంటే తన కుమారుడు రఘువీర్‌కు ఇవ్వాలని జానారెడ్డి హైకమాండ్‌ను కోరనున్నట్లు సమాచారం. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల సమయంలో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేష్ రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. దీంతో ఇప్పుడు ఆయన టికెట్ తనకే వస్తుందన్న ధీమాతో ఉన్నారు.

మహబూబ్‌నగర్‌లో నువ్వా నేనా?

మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్ సీనియర్లు నువ్వా.. నేనా అన్నట్టుగా పోటీ పడుతున్నారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డితోపాటు ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ నేతలు డీకే అరుణ, రేవంత్ రెడ్డి టికెట్ రేసులో ఉన్నారు. ఇక ఈసారి బీసీలకే ఈ టికెట్ ఇవ్వాలని పీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ చిత్తరంజన్ దాస్ పార్టీ నేతల ముందు తన వాదనను గట్టిగానే వినిపిస్తున్నారు.

మహబూబాబాద్‌లో గట్టి పోటీ

ఎస్టీ నియోజకవర్గమైన మహబూబాబాద్ నుంచి కూడా పోటీ ఎక్కువగానే ఉంది. కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, మాజీ మంత్రి రవీంద్ర నాయక్, ఇటీవలే టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన రాములు నాయక్ ఇక్కడ్నుంచి ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. ఈ ముగ్గురిలో ఎవరికి టికెట్ దక్కుతుందోనన్న చర్చ పార్టీలో జోరుగా సాగుతోంది.

నేడు ఉపాధి శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

హైదరాబాద్, వెలుగు: మైనార్టీ యువతకు ఉపాధి శిక్షణ కోసం మంగళవారం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ ఎండీ ఎంఏ వాహెద్ చెప్పారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ శిక్షణకు డిగ్రీ, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు సైన్స్ గ్రాడ్యుయేట్, సెక్యూరిటీ గార్డ్, హౌస్ కీపింగ్ అటెండెంట్‌కు 8వ తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. శిక్షణ తర్వాత ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఆసక్తిగల వారు నాంపల్లిలోని హజ్ హౌస్‌లో నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌కు మంగళవారం ఉదయం 11గంటలకు హాజరు కావాలన్నారు. ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, విద్యార్హత సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర ప్రభుత్వం అందించే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ స్కీంలో భాగంగా క్రిస్టియన్, ముస్లిం, ఇతర మైనార్టీ విద్యార్థులు ఫిబ్రవరి 20లోగా దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ శాఖ ఎండీ ఎంఏ వాహెద్ చెప్పారు. విదేశాల్లో పీజీ, డాక్టొరల్ కోర్సులకు ఎంపికైన వారు అర్హులని తెలిపారు. గత ఆగస్టు, డిసెంబర్‌లో విదేశీ వర్సిటీల్లో అడ్మిషన్ పొందిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌ద్వారా అప్లై చేసుకోవాలని సూచించారు.

వీఆర్‌ఓ అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్

హైదరాబాద్, వెలుగు: విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (వీఆర్‌ఓ) అభ్యర్థులకు వెబ్ ఆప్షన్స్ ఎడిట్ చేసుకునే అవకాశాన్ని టీఎస్‌పీఎస్సీ మరోసారి కల్పించింది. ఈనెల 29 నుంచి 31 వరకు వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు తప్పుగా నమోదుచేసుకున్న వెబ్ ఆప్షన్స్ ను సవరించుకోవచ్చని తెలిపింది. ఇప్పటివరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వని వారికి కూడా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. గతంలో తప్పుల్లేకుండా ఆప్షన్స్ పెట్టుకున్న అభ్యర్థులు మరోసారి ఎడిట్ చేయవద్దని ఈ మేరకు సూచించింది.

రామ మందిరానికి ఆర్డినెన్స్ తెచ్చే ప్రసక్తే లేదు

కేంద్ర మంత్రి పాశ్వాన్

బెంగళూరు : రామ మందిరం నిర్మాణంపై ఎట్టి పరిస్థితుల్లో ఆర్డినెన్స్ తెచ్చే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ స్పష్టం చేశారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు వచ్చే వరకు కేంద్ర ప్రభుత్వం వేచి ఉంటుందని బెంగళూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో చెప్పారు. "అయోధ్యలో మందిరం నిర్మాణం గురించి ప్రధాని తీసుకున్న నిర్ణయాన్ని నేను స్వాగతిస్తున్నాను. దానికి చాలా సంతోషంగా ఉంది" అని మంత్రి చెప్పారు. రామ జన్మభూమికి సంబంధించి కేసును వాయిదా వేయటంతో ఆర్డినెన్స్ తీసుకొస్తారనే వాదనలు ఈ మధ్య వినిపిస్తున్నాయి. ఈ కేసును విచారిస్తున్న ఐదుగురు జడ్జిల బెంచ్‌లో ఒకరు అందుబాటులో లేనందున కేసు విచారణను వాయిదా వేశారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం దుగినేపల్లిలో టార్పాలిన్‌పై నిలిచిన నీటిని ఎత్తిపోస్తున్న రైతు

తగ్గని వానలు

పలు జిల్లాల్లో మూడోరోజూ వర్షాలు

- అత్యధికంగా ఖమ్మం జిల్లా కొణిజర్లలో 8 సెం.మీ.
- రాష్ట్రాన్ని వణికిస్తున్న చలి
- ఇంకో రెండ్రోజులు ఇంతే: వాతావరణ శాఖ

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో వర్షాలు తగ్గడం లేదు. పలు జిల్లాల్లో సోమవారం కూడా వానలు కురిశాయి. ఖమ్మం జిల్లాలో భారీ వర్షం పడింది. కొణిజర్లలో అత్యధికంగా 8 సెంటీమీటర్లు, చంద్రుగొండలో 6, డోర్నకల్, తల్లాడ, నల్లగొండ, దేవరకొండ, సూర్యాపేటలలో 5 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో మధ్యాహ్నం దాకా సూర్యుడు కానరాలేదు. చలి తీవ్రత కొనసాగుతోంది. మెదక్‌లో 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. జిల్లాల్లో పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హిందూ మహాసముద్రం, దాన్ని ఆనుకుని ఉన్న అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతాల్లో అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం, ఐఎండీ అధికారులు పేర్కొన్నారు. మంగళ, బుధవారాల్లోనూ చల్లటి వాతావరణం ఉంటుందని, పొగమంచు పడుతుందని చెప్పారు. మరోవైపు హైదరాబాద్‌లో శనివారం కురిసిన 10.1 మి.మీ. వర్షపాతం రికార్డులకెక్కింది. గత పదేళ్లలో జనవరి నెలలో సిటీలో ఎప్పుడూ సగటు వర్షపాతం ఇంత ఎక్కువగా నమోదు కాలేదు.

ఐదుగురు నల్సార్ స్టూడెంట్స్‌కు స్వైన్ ఫ్లూ

రాజధానిలో మరో ఆరుగురికి కూడా సోకిన వ్యాధి

హైదరాబాద్, వెలుగు: రాజధానిలో ఒకేరోజు ఐదుగురు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థినులు స్వైన్ ఫ్లూ బారినపడ్డారు. వీరితోపాటు మరో ఆరుగురు నగరవాసులకు కూడా వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ జరిగింది. ఈమధ్యే ఉత్తరప్రదేశ్ వెళ్లొచ్చిన ఓ వర్సిటీ విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆమెతో కలివిడిగా తిరిగిన మరో నలుగురూ తీవ్రమైన జలుబుతో బాధపడ్డారు. దీంతో ఈ ఐదుగురిని గాంధీకి తరలించి పరీక్షలు చేయగా హెచ్1ఎన్1 వైరస్ సోకినట్టు తేలింది. ప్రస్తుతం వారికి ప్రత్యేక వార్డులో చికిత్స అందిస్తున్నారు. స్టూడెంట్లకు వ్యాధి సోకడంతో వర్సిటీలో అనుమానితులకు పరీక్షలు చేస్తున్నారు. ప్రస్తుతం గాంధీలో 9 మంది స్వైన్ ఫ్లూ రోగులకు చికిత్స అందిస్తున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్ కుమార్ తెలిపారు. నారాయణగూడలోని ఐపీఎంలో సోమవారం 95 శాంపిళ్లు పరీక్షిస్తే మొత్తం11 మందికి స్వైన్ ఫ్లూ ఉన్నట్టు తేలింది.

జనవరిలో 256 మందికి

రాష్ట్రవ్యాప్తంగా జనవరి ఒకటి నుంచి 28 వరకు 1,439 శాంపిళ్లను పరీక్షించగా 256 మందికి స్వైన్ ఫ్లూ ఉన్నట్టు తెలిసింది. వ్యాధి లక్షణాలతో శాంపిళ్లు ఇచ్చిన వారిలో 17 శాతం మందికి వైరస్ సోకినట్టు తేలిందని వైద్యాధికారులు తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే జనవరిలో 142 మంది స్వైన్ ఫ్లూ బారిన పడినట్లు చెప్పారు. గాంధీ, ఉస్మానియా, ఫీవర్ ఆస్పత్రుల్లో స్వైన్ ఫ్లూ చికిత్సకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో స్వైన్ ఫ్లూ అదుపులోకి రావొచ్చని ఐపీఎం డైరెక్టర్ శంకర్ అభిప్రాయపడ్డారు.

మన జోలికొస్తే ఊరుకోం

ఎన్‌సీసీ కేడెట్ల ర్యాలీలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ :

దేశ భద్రతకు సంబంధించిన అనేక కీలక నిర్ణయాలను తమ ప్రభుత్వం ఎంతో ధైర్యంగా తీసుకుందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. "మనంతట మనం ఎవరి జోలికీ వెళ్లం. అలాగని మన జోలికి ఎవరైనా వస్తే ఊరుకునేది లేదు" అని స్పష్టం చేశారు. రాఫెల్ డీల్ పై విమర్శలు వస్తున్నా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రక్షణ రంగానికి సంబంధించిన అనేక ప్రాజెక్టులకు ఓకే చెప్పామన్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో భారత్ వైపు ఏ దేశమూ కన్నెత్తి చూడలేదన్నారు. దేశాన్ని అంత శక్తివంతంగా తయారు చేసామన్నారు. మౌలికంగా ఇండియా, శాంతి కాముక దేశమన్నారు. అయితే భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని సోమవారం ఇక్కడ జరిగిన 'ప్రైమ్ మినిస్టర్స్ ఎన్ సీసీ కేడెట్స్ ర్యాలీ' లో ఆయన అన్నారు. బీజేపీ నిర్మించదలచిన 'నవభారతం' లో అవినీతికి చోటు లేదన్నారు. చేసే పని పట్ల నిబద్ధత, నైపుణ్యం, కష్టపడేతత్వం, ఆత్మ విశ్వాసం లాంటి లక్షణాలు ఎవరైనా జీవితంలో ఉన్నత స్థాయికి రావడానికి ఉపయోగపడతాయన్నారు. వీఐపీ కల్చర్ కు బదులుగా 'ప్రతి వ్యక్తికి ప్రాధాన్యం' అనే సంస్కృతిని పెంపొందిస్తామని మోడీ చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అనేక పథకాలకు యువత నుంచి మద్దతు లభించిందన్నారు. 'స్వచ్ఛ భారత్' లో యువత కీలక పాత్ర పోషించిందని చెప్పారు. మగవారితో పాటు అన్ని రంగాల్లో మహిళలు కూడా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. రిపబ్లిక్ డే తర్వాత ఢిల్లీలో ప్రతి ఏడాది 'ప్రైమ్ మినిస్టర్స్ ఎన్ సీసీ కేడెట్స్ ర్యాలీ' నిర్వహించే ఈ కార్యక్రమంలో రెండు వేల మంది కేడెట్లు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

రైళ్లలోనూ ఈ-పేమెంట్స్

హైదరాబాద్, వెలుగు:



డిజిటల్ ఇండియాలో భాగంగా టెక్నాలజీని ఇండియన్ రైల్వే అందిపుచ్చుకుంటోంది. ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఇటీవల కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. రైళ్లలో ప్రయాణికులు ఆహార పదార్థాలు, డ్రింక్స్ కొనుగోలు చేస్తే ఈ-పేమెంట్స్ ద్వారా చెల్లింపు జరిపే పద్ధతి తీసుకొచ్చింది. ఇప్పటికే వివిధ రైళ్లలో పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్)లను ప్రవేశపెట్టింది. దీంతో రైళ్లలో అధిక డబ్బుల దోపిడీకి అడ్డుకట్ట పడనుందని అధికారులు చెబుతున్నారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించనున్నారు. విజయవంతమైతే త్వరలోనే పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు.

పైసలు కట్టినంక బిల్లు కూడా

ఈ నెల 26 నుంచి రైళ్లలో 2,000 వరకు పీఓఎస్ మిషన్లను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్, మెయిల్ రైళ్లలో ఇవి నడుస్తున్నాయి. ప్రతీ రైల్‌లో కనీసం 8 పీఓఎస్ మిషన్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే అన్ని రైళ్లలో ప్రవేశపెట్టనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రైళ్లలో ఆహార పదార్థాలు విక్రయించే వెండార్లు తప్పనిసరిగా పీఓఎస్‌లు కలిగి ఉండేలా ఐఆర్‌సీటీసీ ఆదేశాలు జారీ చేసినట్లు చెబుతున్నారు. పీఓఎస్ మిషన్ ద్వారా డెబిట్, క్రెడిట్ కార్డులను ఉపయోగించి చెల్లింపులు

- క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు
- 2,000 పీఓఎస్ మిషన్లు అందుబాటులోకి
- ఫిబ్రవరి 15 వరకు స్పెషల్ డ్రైవ్
- త్వరలోనే పూర్తిస్థాయిలో అమలు
- ఆహార పదార్థాలపై అధిక వసూళ్లకు అడ్డుకట్ట

చేయవచ్చు. ఆ వెంటనే మిషన్ నుంచి బిల్ జనరేట్ అయి రిసిప్టు కూడా వస్తుంది. ఆహార పదార్థాలపై ధరలను కూడా పూర్తిస్థాయిలో ముద్రించనున్నట్లు అధికారులు తెలిపారు.

అధిక దోపిడీకి అడ్డుకట్ట

సాధారణంగా రైళ్లలో ప్రయాణికుల నుంచి ఎమ్మార్పీ ధర కంటే అధిక డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.20 వాటర్ బాటిల్‌కు రూ.25 వరకు వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఆహార పదార్థాలకైతే మరింత ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రయాణికులు ప్రశ్నిస్తే అలాగే ఉంటుందంటూ దబాయిస్తారు. వీటిపై రైల్వే అధికారులకు భారీగా ఫిర్యాదులు అందాయి. ఎట్టకేలకు స్పందించిన రైల్వే తాజాగా పీఓఎస్ విధానాన్ని తేవడంతో వీటన్నింటికీ అడ్డుకట్ట పడనుంది. దీనిపై ప్రయాణికులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాసినంక రద్దు చేసిండ్రు

ఎంబీబీఎస్ సెకండియర్ పరీక్షలో మారిన ప్రశ్నపత్రాలు

హైదరాబాద్, వెలుగు:



- ఒక్కో కాలేజీకి వేర్వేరు కోడ్స్ ఉన్న ఫార్మకాలజీ పేపర్లు
- కాళోజీ హెల్త్ యూనివర్సిటీ నిర్వాకం
- 'సాంకేతిక కారణం'తో పరీక్ష రద్దు చేస్తున్నట్లు ప్రకటన
- తిరిగి ఫిబ్రవరి 12న పరీక్ష ఉంటుందని వెల్లడి
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విద్యార్థులు

ఎంబీబీఎస్ సెకండియర్ ఎగ్జామ్స్ సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఫార్మకాలజీ పేపర్. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష జరిగింది. విద్యార్థులు పరీక్ష రాసి అప్పుడే బయటికి వచ్చారు. ఇంకా పరీక్ష మూడ్ నుంచి బయటికి రాలేదు. ఉన్నట్టుండి 'మీరు రాసిన పరీక్షను రద్దు చేస్తున్నాం' అని చావు కబురు చల్లగా చెప్పారు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ అధికారులు. ఆ వెంటనే పరీక్ష రద్దు సర్క్యులర్‌ను వర్సిటీ రిజిస్ట్రార్ జారీ చేశారు. దీంతో తలలు పట్టుకోవడం విద్యార్థుల వంతైంది.

అసలేం జరిగిందంటే?

రాష్ట్రంలోని 25 మెడికల్ కాలేజీలకు కాళోజీ యూనివర్సిటీనే పరీక్షలు నిర్వహిస్తుంది. ముందుగా 50 రకాలుగా ప్రశ్నపత్రాలను రూపొందించి ఆన్‌లైన్‌లో కాలేజీలకు పంపుతారు. సరిగ్గా పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు ఎంపిక చేసిన ప్రశ్నపత్రం కోడ్ విడుదల చేస్తారు. ఆ ప్రకారం మొత్తం 25 కాలేజీల్లోనూ ఒకటే ప్రశ్నపత్రాన్ని డౌన్ లోడ్ చేసి విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తారు. అయితే సోమవారం జరిగిన ఫార్మకాలజీ పరీక్షకు సంబంధించిన క్వశ్చన్ పేపర్ ఒక్కో కాలేజీకి ఒక్కోరకంగా వెళ్లినట్లు తెలుస్తోంది. అంటే హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థులు ఒక ప్రశ్నపత్రానికి సమాధానాలు రాస్తే కరీంనగర్లోని విద్యార్థులు మరో ప్రశ్నపత్రం ఆధారంగా రాశారు. పరీక్ష పూర్తయిన తర్వాత విషయం బయటికి తెలిసింది. అప్పటికే జరిగిన తప్పిదాన్ని గుర్తించిన కాళోజీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కార్యాలయం.. డిప్యూటీ రిజిస్ట్రార్ పేరుతో పరీక్ష రద్దు నిర్ణయాన్ని ప్రకటించింది. మొత్తం 3,750 మంది విద్యార్థులు తొలిరోజు ఫార్మకాలజీ పరీక్షకు హాజరయ్యారు. రద్దు చేసిన పరీక్షను ఫిబ్రవరి 12న తిరిగి నిర్వహించనున్నట్లు వర్సిటీ ప్రకటించింది. పరీక్షల నిర్వహణలో సాంకేతిక లోపం తలెత్తినందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. మంగళవారం నుంచి మిగతా పరీక్షలన్నీ యథావిధిగా ఉంటాయని స్పష్టం చేసింది.

విద్యార్థుల్లో ఆందోళన

పరీక్ష రద్దు నిర్ణయాన్ని విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సాధారణంగా ప్రశ్నపత్రం లీక్ అయినప్పుడే పరీక్షను రద్దు చేస్తారని, ఇప్పుడు జరిగింది లీక్ కాదు కాబట్టి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తొలి పరీక్షను రద్దు చేసి మంగళవారం నుంచి మిగతా పరీక్షలు కొనసాగుతాయని చెప్పడం విద్యార్థులపై ఒత్తిడి పెంచిందని, పరీక్షను రద్దు చేయకుండా, తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు తప్పు ఎక్కడ జరిగిందనే దానిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. మొత్తం వ్యవహారంపై కాళోజీ వర్సిటీ రిజిస్ట్రార్ మల్లికార్జున్, వీసీ కరుణాకర్ రెడ్డిని సంప్రదించేందుకు 'వెలుగు' పలుమార్లు ప్రయత్నించినా, వారు అందుబాటులోకి రాలేదు.

ఎస్సై పోస్టుల భర్తీకి తొలగిన అడ్డంకి

సింగిల్ జడ్జి ఉత్తర్వులపై హైకోర్టు స్టే

హైదరాబాద్, వెలుగు: ఎస్సై పోస్టుల భర్తీకి న్యాయపరమైన అడ్డంకి తొలగిపోయింది. గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలపై ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన బెంచ్ స్టే విధించింది. ఎస్సై పోస్టుల భర్తీ కోసం జరిగిన ఎగ్జామ్‌లోని ప్రశ్నల్లో ఆరింటిని తొలగించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సవాల్ చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన బెంచ్ సోమవారం విచారించింది. నియామక ప్రక్రియ 90 శాతం వరకూ జరిగినందున తాము జోక్యం చేసుకోబోమంటూ సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించింది. ఒక ప్రశ్నకు రెండు రకాలైన జవాబులు ఉండవచ్చునని, ఏది రాసినా తప్పుకాదని తెలిపింది. అభ్యర్థులు తమ మార్కుల కోసం బోర్డుకు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించింది. పోలీస్, ఫైర్, జైళ్ల శాఖల్లో 1,217 ఎస్సై పోస్టుల భర్తీ కోసం బోర్డు 2018 మే 31న నోటిఫికేషన్ వెలువరించి అదే ఏడాది ఆగస్టు 26న రాతపరీక్ష నిర్వహించి సంగతి తెలిసిందే.

యాసిడ్ బాటిల్ పగిలి ఆరుగురికి గాయాలు

ఏపీలోని చెర్లోపల్లి స్కూల్ లో ప్రమాదం

చెర్లోపల్లి (తిరుపతి): స్కూల్ లేబరేటరీలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఏపీలోని చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం చెర్లోపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్పెషల్‌క్లాస్ తీసుకుంటానని టీచర్ చెప్పడంతో ఎనిమిదో తరగతి స్టూడెంట్లు అందరూ డిజిటల్‌రూంకు వెళ్లారు. అక్కడ టీచర్లు లేకపోవడంతో స్టూడెంట్ల మధ్య తోపులాట జరిగింది. దీంతో ర్యాకుల్లోని యాసిడ్ బాటిళ్లు కిందపడ్డాయి. యాసిడ్ బయటకు చిట్లడంతో ల్యాబ్‌లో మంటలు చెలరేగాయి. కొంతమంది స్టూడెంట్లపైనా యాసిడ్ పడటంతో ఆరుగురు గాయపడ్డారు. వెంటనే స్పందించి పిల్లలను తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉంది.

ఎన్టీఆర్‌తో టీడీపీ పెట్టించడమే నేను చేసిన పొరపాటు

ఏపీ మాజీ సీఎం నాదెండ్ల

విజయవాడ, వెలుగు: 'ఎన్టీఆర్ తో తెలుగుదేశం పార్టీని పెట్టించడమే జీవితంలో నేను చేసిన అతిపెద్ద పొరపాటు' అని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు సోమవారం అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు ఫారిన్ టూర్ల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీతో విభేదాలు రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం కలిగిస్తాయని చెప్పారు. బీసీ ప్రధానిని వ్యతిరేకిస్తున్న చంద్రబాబు.. బీసీ సమావేశాలు పెట్టడం, బీసీ కార్పొరేషన్లు ప్రకటించడం విచిత్రంగా ఉందన్నారు. ఏపీలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆయన అన్నారు.

రెండుచోట్ల పాఠాలు చెబితే

పాన్ పట్టేస్తది

- ఆధార్‌తోపాటు లెక్చరర్ల పాన్‌కార్డు వివరాలు కోరిన టీఏఎఫ్‌ఆర్సీ
- వచ్చేనెల 21 లోపు సమాచారం ఇవ్వాలని వెల్లడి

హైదరాబాద్, వెలుగు: పొద్దున ఓ కాలేజీ, మధ్యాహ్నం మరో కాలేజీలో పాఠాలు చెప్పే ప్రైవేటు లెక్చరర్లకు చెక్ పెట్టేందుకు ఉన్నత విద్యామండలి రంగంలోకి దిగింది. కాలేజీల్లో పనిచేసే ఎంప్లాయిస్‌కు ఇప్పటి వరకూ కేవలం ఆధార్‌కార్డు ఉంటే సరిపోతుందని చెప్పిన అధికారులు.. తాజాగా పాన్‌కార్డు తప్పనిసరి చేశారు. తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ) ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్‌లో నిబంధనలు చేర్చారు. ప్రస్తుతం లెక్చరర్లు, ప్రొఫెసర్లు ఒక్కొక్కరు ఎన్ని కాలేజీల్లో బోధిస్తున్నారన్న సమాచారాన్ని పక్కాగా సేకరించనున్నారు. ఒక కాలేజీలో పనిచేసే బోధనా సిబ్బంది వేరే కాలేజీలో బోధించవద్దన్న నిబంధన ఉంది. కానీ ఇది సక్రమంగా అమలు కావడం లేదు. దీంతో టీఏఎఫ్‌ఆర్సీకి పంపాల్సిన వివరాల్లో పాన్‌కార్డు సమాచారాన్ని తప్పనిసరి చేశారు. దీనిద్వారా ఒక కాలేజీ కన్నా ఎక్కువ చోట్ల పాఠాలు చెప్పే లెక్చరర్ల వివరాలు తెలుసుకోవచ్చని విద్యామండలి భావిస్తోంది. బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాల కోసం ఇచ్చే చెక్కులు, బ్యాంకు ఖాతా వివరాలనూ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ఖర్చులన్నీ చూపాల్సిందే..

రాష్ట్రంలో 1,900 ప్రైవేటు వృత్తి విద్యా కాలేజీలున్నాయి. అవన్నీ ఫిబ్రవరి 21లోపు పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. గడిచిన రెండేళ్లలో విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు, సిబ్బంది, లెక్చరర్లకు ఇచ్చిన వేతనాలు, ఇతర ఖర్చులు, కాలేజీలోని ఒక్కో కోర్సు వివరాలన్నీ సమర్పించాలి. ప్రాసెసింగ్ ఫీజు కింద యాజమాన్యాలు ఇంజినీరింగ్, ఫార్మా రంగానికి చెందిన 11 కోర్సులకు రూ.18 వేలు, టీచింగ్, లా, మేనేజ్‌మెంట్ తదితర 12 కోర్సులకు రూ.9 వేలు చెల్లించాలి. ప్రస్తుతం టీఏఎఫ్‌ఆర్సీ చైర్మన్ పోస్టు ఖాళీగా ఉంది. ప్రభుత్వం కొత్త చైర్మన్‌ను నియమించిన తర్వాతే ఫీజుల లెక్క తేలనుంది.

ఇక 'దృశ్యం' చూపించలేరు!

హైదరాబాద్, వెలుగు:

నేరం చేసి 'దృశ్యం' చూపిద్దామనుకుంటే ఇక చెల్లదు. మ్యాన్ హ్యాండ్లింగ్ చేయకుండానే పక్కా ఆధారాలతో మూసేసే టెక్నాలజీ ప్రతి కొత్త జిల్లా కేంద్రానికీ రాబోతోంది. ఇప్పటివరకు హైదరాబాద్‌తోపాటు పాత జిల్లా కేంద్రాలకే పరిమితమైన దీన్ని ఫిబ్రవరి ఫస్టు వీక్ నుంచి కొత్త జిల్లాల్లోనూ అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

కాల్ డేటా సేకరణ, విశ్లేషణ, సీసీ కెమెరా ఫుటేజీ డెవలప్‌మెంట్ కోసం పోలీసులు ఇప్పటివరకు పాత జిల్లా కేంద్రాల్లోని సైబర్ ల్యాబ్‌లకు క్యూ కడుతున్నారు. యాభై, అరవై పోలీస్ స్టేషన్లకు కలిపి ఒకటే సైబర్ ల్యాబ్ ఉండడంతో డేటా విశ్లేషణ, కేసుల పరిష్కారం ఆలస్యమవుతోంది. పెరుగుతున్న సైబర్ క్రైం కేసులను దృష్టిలో పెట్టుకుని కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాల్లో సైబర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని డీజీపీ మహేందర్‌రెడ్డి నిర్ణయించారు. ఈనెల 31 లోగా ఏర్పాట్లు చేసుకోవాలని ఇటీవల ఎస్పీలను ఆదేశించినట్లు తెలిసింది. ఈ ల్యాబ్‌లో కాల్ డేటా సేకరణ, విశ్లేషణ, సెల్‌ఫోన్, కంప్యూటర్లలో డేటా రికవరీ, ఎనాలసిస్‌కు సంబంధించిన హార్డ్‌వేర్ పరికరాలు, సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో జిల్లాకు రూ.60 లక్షల పరికరాలు పంపిస్తున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన పోలీస్ సిబ్బందికి ఈ టెక్నాలజీ వాడకంపై శిక్షణ ఇస్తున్నారు. ఫిబ్రవరి మొదటివారం నుంచి ప్రతి జిల్లా కేంద్రంలో సైబర్ క్రైం సెల్‌లు పనిచేస్తాయి.

ఏ తరహా నేరానికి ఆ టెక్నాలజీ

- నేరం జరిగిన సమయంలో అనుమానితుడు, అతడి ఫోన్ ఏ టవర్ పరిధిలో ఉందో ఈజీగా కనుక్కునే టెక్నాలజీ ఇంతకు ముందే అందుబాటులోకి వచ్చింది. 'సెల్ సైట్ అనలైజర్' ద్వారా ఈ వివరాలన్నీ నిమిషాల్లో వచ్చేస్తున్నాయి.
- 'సీ5 ఎంటర్‌ప్రైజ్' సాఫ్ట్‌వేర్‌తో కాల్‌డేటా తీసుకుని నేరం గుట్టు విప్పేస్తున్నారు.
- ఫేస్‌బుక్, ట్విట్టర్, యూ ట్యూబ్ వంటి సోషల్ మీడియాలో ఇష్టమొచ్చిన కామెంట్స్, మార్ఫింగ్ ఫొటోస్, వీడియోలు అప్‌లోడ్ చేస్తే ఐఈఎఫ్ (ఇంటర్నెట్ ఎవిడెన్స్ ఫైండర్) ఇట్టే పట్టేస్తుంది.
- సాక్ష్యాలు మాయం చేసేందుకు సెల్‌ఫోన్లు పగులగొట్టినా, సిమ్ కార్డులు ధ్వంసం చేసినా, కంప్యూటర్‌లో డేటా డిలిట్ చేసినా ఎఫ్‌టీకే, ఫోరెన్సిక్ ఫాల్కన్, యూఎఫ్‌ఈడీ లాంటి హార్డ్‌వేర్ టెక్నాలజీ సాయంతో డేటా రికవరీ చేసి నేరస్తులను కటకటాల వెనక్కి పంపిస్తున్నారు.
- సీసీ కెమెరాల్లో సరిగ్గా కనిపించని వీడియోలనూ డెవలప్ చేసి నేరస్తుల్ని గుర్తిస్తు న్నారు. పాత జిల్లా కేంద్రాలకే పరిమితమైన ఈ టెక్నాలజీ వచ్చే నెలలో అన్ని జిల్లాల్లో అందుబాటులోకి రానుంది.



- జిల్లాకో సైబర్ ల్యాబ్ ఏర్పాటుకు సన్నాహాలు
- ఫిబ్రవరి ఫస్ట్ వీక్‌లో పని మొదలు
- ఏటీఎం ఫ్రాడింగ్, సోషల్ మీడియా కేసుల్లో వేగం
- పోలీసులకు హైదరాబాద్‌లో శిక్షణ

పెరుగుతున్న సైబర్ నేరాలు

వాట్సాప్, ఫేస్‌బుక్, ఫొటోలు, వీడియోల మార్ఫింగ్‌తో మహిళలను బ్లాక్ మెయిల్ చేస్తున్న వారి సంఖ్య ఇటీవల పెరిగింది. ఖాతాదారుడికి తెలియకుండానే డబ్బులు డ్రా చేస్తున్న కేసులూ వందల సంఖ్యలో నమోదవుతున్నాయి. గతేడాది హైదరాబాద్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో 394 కేసులు, సైబరాబాద్ సైబర్ క్రైం పరిధిలో 263 కేసులు, సీఐడీ ఆధ్వర్యంలో రెండు కేసులు నమోదు కాగా, మిగతా జిల్లాల్లో 440 సైబర్ క్రైం కేసులు ఫైల్ అయ్యాయి. మొత్తంగా 1,099 కేసులు నమోదయ్యాయి.

మంగళవారం | హైదరాబాద్
29.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu



వెనెజులాలో ముదురుతున్న రాజకీయ సంక్షోభం

- ఈ వారంలో దేశవ్యాప్త ఆందోళనలకు గుయిడో ప్లాన్
- అమెరికా కుట్రకు దేశం బలవుతోందన్న మదురో

కారకాస్(వెనెజులా): వెనెజులాలో సంక్షోభం మరింత ముదురుతోంది. సైన్యం అండతో అధ్యక్షుడు నికొలస్ మదురో, ప్రజలు, దేశవిదేశాల మద్దతు తనకే ఉందంటూ ప్రతిపక్ష నేత జువాన్ గుయిడో ఎవరికి వారు తామే ప్రెసిడెంట్ అని ప్రకటించుకుంటున్నారు. ప్రజాతీర్పుకు వ్యతిరేకంగా మదురో అధికారం చెలాయిస్తున్నారంటూ గుయిడో ఆందోళనలు చేస్తున్నారు. ఇటీవల అమెరికా దౌత్యాధికారులు దేశం విడిచి వెళ్లాలంటూ మదురో ఆదేశాలు జారీ చేయడంపైనా ఆయన మండిపడ్డారు. దీనికి నిరసనగా బుధ, శని వారాల్లో ఆందోళనలకు పిలుపునిచ్చారు. మదురోకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బుధవారం ప్రజలంతా రోడ్లపైకి వచ్చి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయాలని కోరారు. భారీ ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈమేరకు ఆయన ట్విట్టర్లో ఆదివారం ఓ వీడియో పోస్ట్‌చేశారు. శనివారం నిర్వహించే ఆందోళనలో తనతో కలిసి రావాలని ప్రజలను కోరారు. మదురోకు వ్యతిరేకంగా తాము తలపెట్టిన ఆందోళనలు విఫలం కావాలని కోరుకుంటున్న వారికి నిరాశ తప్పదని గుయిడో అన్నారు. నిరసన కార్యక్రమాలు చాలా రోజుల నుంచి కొనసాగుతున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మరోవైపు, అమెరికా కుట్రకు వెనెజులా బలిపశువుగా మారిందని మదురో ఆరోపించారు. అధ్యక్ష పీఠం నుంచి తనను తప్పించేందుకు అమెరికా కుట్ర పన్నిందని విమర్శించారు. రెండోసారి తను అధికార పగ్గాలు చేపట్టడంపై అసంతృప్తిగా ఉన్నవారితో చర్చలు జరిపేందుకు తాను సిద్ధమని ప్రకటించినా ప్రతిపక్షాలు స్పందించడంలేదన్నారు. చర్చలకు సిద్ధమంటూ అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్‌ట్రంప్‌కు సందేశం పంపించినట్లు ఓ వార్తా పత్రికకు తెలిపారు. అయినా ట్రంప్‌నుంచి ఎలాంటి జవాబులేదని విమర్శించారు. వెనెజులాను అస్థిరపరిచి దెబ్బతీయాలని అమెరికా కుట్రపూరితంగా ప్రవర్తిస్తోందని మదురో ఆరోపించారు.

ఇట్లైతే దిగిపోతా!

కాంగ్రెస్‌కు కర్నాటక సీఎం హెచ్చరిక | ఆ పార్టీ నేతల తీరుపై అసంతృప్తి | సంకీర్ణంలో అగ్గి రాజేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే సోమశేఖర కామెంట్

బెంగళూరు:

కాంగ్రెస్ నాయకుల తీరు మారకుంటే తాను పదవి నుంచి దిగిపోవడానికి కూడా వెనకాడబోనని కర్నాటక ముఖ్యమంత్రి హెచ్ డీ కుమారస్వామి హెచ్చరించారు. తనను అగౌరవపరిస్తే కాంగ్రెస్ కే నష్టమన్నారు. మా నాయకుడు సిద్దరామయ్యేనంటూ కాంగ్రెస్ నాయకులు తరచూ అంటూ గీత దాటుతున్నారంటూ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎమ్మెల్యేలను అదుపు చేసుకోవాలన్నారు.

అసలేం జరిగింది?

సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు గడిచినా ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా అమలు కాలేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్ టీ సోమశేఖర్ చేసిన వ్యాఖ్య సంకీర్ణంలో దుమారం రేపింది. బెంగళూరు లో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ కామెంట్ చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సిద్దరామయ్య మరోసారి సీఎం కావాలన్నారు. దీంతో అదే వేదికపై ఉన్న సీఎం కుమారస్వామి తీవ్రంగా స్పందించారు. తన పనితీరు నచ్చకపోతే దిగిపోవడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. పదవి పట్టుకుని వేలాడాలని తాను కోరుకోవడం లేదన్నారు. లక్ష కోట్ల రూపాయలతో రవాణా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సంకీర్ణ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఈసందర్భంగా ఆయన వివరించారు. వివాదం తీవ్రమయ్యే పరిస్థితి కనపడటంతో వేదికపై ఉన్న రాష్ట్ర పీసీసీ ప్రెసిడెంట్ దినేష్ గుండూరావు కలగజేసుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సోమశేఖర్ కామెంట్లను ఖండిస్తున్నానన్నారు.బహిరంగంగా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే కామెంట్లు చేసినందుకు ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేస్తామన్నారు. ఈ వివాదం పై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ చార్జ్ కేసీ వేణు గోపాల్ స్పందించారు. “ సోమశేఖర్ కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని దినేష్ గుండూరావు ను ఆదేశించా ” అని ట్వీట్ చేశారు. నోటీసుకు బదులిచ్చిన తర్వాత క్రమశిక్షణా చర్య తీసుకునే అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

మా సీఎం సిద్దరామయ్యే: పుట్టరంగ శెట్టి

పేరుకు కుమారస్వామి సీఎం అయినా తమ వరకు ఇప్పటికీ ముఖ్యమంత్రి సిద్దరామయ్యేనని కేబినెట్ మంత్రి సి.పుట్టరంగ శెట్టి చేసిన వ్యాఖ్య కూడా వివాదాస్పదమైంది. ఇదొక్కటే కాదు కాంగ్రెస్ నేతలు తరచు తమ నేతగా సిద్దరామయ్య ను పేర్కొనడం పై జేడీ(ఎస్) ఆగ్రహంగా ఉంది.



నెలరోజులుగా గరంగరంగా కర్నాటక పాలిటిక్స్

దాదాపు నెలరోజుల నుంచి కర్నాటక పాలిటిక్స్ గరంగరంగా కొనసాగుతున్నాయి. కుమారస్వామి సర్కార్‌ను పడగొట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని మంత్రి డీకే శివకుమార్ చేసిన ఆరోపణతో పాలిటిక్స్ వేడెక్కాయి. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు నడిచాయి. బీజేపీ తన 104 మంది ఎమ్మెల్యేలను ముంబైకి తరలించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగళూరు శివార్లలోని ఈగల్టన్ రిసార్ట్స్‌కు తరలించారు. ఈనేపథ్యంలో జరిగిన సీఎల్పీ సమావేశానికి నలుగురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. రిసార్ట్స్‌లో ఎమ్మెల్యే ఆనంద్ సింగ్‌పై మరో ఎమ్మెల్యే గణేశ్ దాడి చేసినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ పార్టీ గణేశ్‌ను సస్పెండ్ చేసింది. వివాదం సద్దుమణుగుతోందని అందరూ భావిస్తున్న నేపథ్యంలో సోమశేఖర కామెంట్‌తో సంకీర్ణ ప్రభుత్వంలో గొడవలు బయటపడ్డాయి.

బహిరంగంగా మాట్లాడొద్దు: మల్లికార్జున ఖర్గే

సోమశేఖర్ వ్యాఖ్యను కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే తప్పు పట్టారు. సంకీర్ణ ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి ఉంటే మాట్లాడటానికి వేరే వేదికలు ఉన్నాయన్నారు. సోమశేఖర్ బహిరంగంగా అలా మాట్లాడకూడదన్నారు.

కుమారస్వామి ఐదేళ్లూ ఉంటారు

కుమారస్వామి ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని సీఎల్పీ నేత సిద్దరామయ్య చెప్పారు. తాను మరోసారి సీఎం అయ్యే ప్రసక్తే లేదన్నారు. సోమశేఖర కామెంట్ ను తప్పుపట్టారు. కుమారస్వామితో తాను మాట్లాడతానన్నారు.

ఆ కామెంట్ లో తప్పేం లేదు: డిప్యూటీ సీఎం

కాంగ్రెస్ ఎమ్మెల్యే సోమశేఖర వ్యాఖ్యలో తప్పేంలేదని డిప్యూటీ సీఎం జి.పరమేశ్వర అన్నారు. “ ఒక ఎమ్మెల్యేకు లెజిస్లేచర్ పార్టీ నాయకుడు సీఎంతో సమానమే ” అని అన్నారు. ఏమైనా కుమారస్వామి నాయకత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా హ్యాపీగా ఉన్నారని చెప్పారు.

మిత్రపక్షాల మధ్య అభిప్రాయ భేదాలే: దేవెగౌడ

పదవి నుంచి దిగిపోతానని కుమారస్వామి చేసిన హెచ్చరికను ఆయన తండ్రి, జేడీ(ఎస్) ప్రెసిడెంట్ హెచ్ డీ దేవగౌడ లైట్‌గా తీసుకున్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో ఇలాంటివన్నీ మామూలేనన్నారు. మొత్తం వివాదాన్ని మిత్రపక్షాల మధ్య నెలకొన్న అభిప్రాయ భేదాలుగా ఆయన కొట్టివేశారు. మరోవైపు సంకీర్ణ ప్రభుత్వంలో గొడవల నేపథ్యంలో బీజేపీ స్పందించింది. ముఖ్యమంత్రి కుర్చీ నుంచి కుమారస్వామి దిగిపోవడమే మంచిదని బీజేపీ ప్రతినిధి తేజస్విని గౌడ వ్యాఖ్యానించారు.

మరో వివాదంలో సిద్దరామయ్య

బెంగళూరు: కర్నాటక మాజీ సీఎం సిద్దరామయ్య మరో వివాదంలో చిక్కుకున్నారు. ఓ మహిళ పట్ల ఆయన ప్రవర్తించిన తీరు తీవ్ర దుమారం రేపింది. మైసూరులో సిద్దరామయ్య ప్రసంగిస్తుండగా “మీ కుమారుడు యతీంద్ర ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అందుబాటులో లేరు” అని కాంగ్రెస్ కార్యకర్తగా భావిస్తోన్న జమీల అనే మహిళ నిలదీయడంతో సిద్దరామయ్యకు కోపమొచ్చింది. జమీల చేతిలో ఉన్న మైక్ లాగారు. మైకుతో పాటు చున్నీ కూడా ఆయన చేతిలోకి వచ్చింది. దీనికి సంబంధించిన వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ అయింది. సిద్దరామయ్య ప్రవర్తనను బీజేపీ తప్పు పట్టింది. “మహిళలతో ప్రవర్తించే తీరు ఇదేనా” అంటూ బీజేపీ సీనియర్ నేత, కేంద్ర



మంత్రి ప్రకాశ్ జవదేకర్ ప్రశ్నించారు. సిద్దరామయ్య కావాలని జమీల చున్నీ లాగలేదని కాంగ్రెస్ నేత దినేశ్ గుండూరావు అన్నారు. మైక్‌ను లాగితే, చున్నీ కూడా వచ్చిందని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. మరో వైపు జాతీయ మహిళా కమిషన్ కూడా స్పందించింది. ఈ వివాదంపై విచారణకు ఆదేశించామని కమిషన్ చైర్ పర్సన్ రేఖ శర్మ చెప్పారు. దీనిపై సమగ్రంగా దర్యాప్తు జరిపి, చర్యలు తీసుకోవాలని కోరుతూ కర్నాటక పోలీసులకు లేఖ రాశామన్నారు. ఈ ఘటనపై సిద్దరామయ్య వివరణ ఇచ్చారు. 15 ఏళ్లుగా ఆమె తనకు తెలుసని, సోదరిలాంటిదని చెప్పారు. ఎక్కువసేపు మాట్లాడినందువల్లే ఆమె దగ్గర నుంచి మైకు లాక్కోవాల్సి వచ్చిందన్నారు. కాగా సిద్దరామయ్యతో తనకు ఎలాంటి గొడవలు లేవని జమీల చెప్పింది. “ఆయన మంచి సీఎం. ఆయనతో నేను అలా మాట్లాడి ఉండాల్సింది కాదు” అని పేర్కొంది. బల్లను గట్టిగా చరచడం వల్ల సిద్దరామయ్యకు కోపం వచ్చి ఉండొచ్చని జమీల చెప్పింది.



‘హిందూ’ విమర్శలొద్దు


రిపబ్లికన్ ఎంపీ తులసీ గబ్బార్డ్

వాషింగ్టన్: అమెరికా ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీచేస్తానని ప్రకటించిన హిందూ అమెరికన్ తులసీ గబ్బార్డ్ తనపై వచ్చిన విమర్శలను తిప్పికొట్టారు. అమెరికా అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, తనపై హిందూ నేషనలిస్ట్ అంటూ అమెరికా నుంచి తనను వేరుగా చూపించేందుకు ప్రయత్నిస్తుండడం వారి మతమౌఢ్యానికి అద్దం పడుతోందని అన్నారు. ఓ పత్రిక వెల్లడించిన సర్వే రిపోర్టులో తనకు వ్యతిరేకంగా హిందూ నేషనలిస్ట్ అంటూ విమర్శించిన వారిని ఉద్దేశించి సోమవారం ఆమె ఈ కామెంట్ చేశారు. అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న మొదటి హిందూ మహిళగా తాను గర్వపడుతున్నాని చెప్పారు. తాను హిందువనే కారణంగానే విమర్శలు చేశారని, అమెరికాలో హిందూ వ్యతిరేక భావాల్ని పెంపొందించేదుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అధికారిక సమావేశాల్లో భాగంగానే గతంలో తాను ప్రధాని నరేంద్ర మోడీతో సమావేశమయ్యానని ప్రస్తుతం వాటినే సాకుగా చూపిస్తూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. మాజీ ప్రెసిడెంట్ బరాక్ ఒబామా, సెక్రెటరీ హిల్లరీ క్లింటన్, ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్‌తో పాటు చాలామంది అమెరికా సెనేటర్లు మోడీని కలుసుకున్నారన్న సంగతి గుర్తుంచుకోవాలని చెప్పారు. “అమెరికా కాంగ్రెస్‌కు ఎంపికైన తొలి హిందూ నేతగా ఉన్న నాపై ఈరోజు హిందూ జాతీయవాదిగా ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోరోజు ముస్లిం, యూదు, ఆఫ్రికన్, జపనీస్ అమెరికన్లపైనా ఇలాంటి ఆరోపణలే చేస్తారా? మతం పేరుతో ప్రజల మనోభావాల్ని రెచ్చగొట్టే ఇలాంటి వారిని సమాజం ముందు నిలబెట్టాలి. లింగ, జాతి, మతం ఆధారంగా ఒక వ్యక్తికి ఓటు వేయొద్దని చెప్పేవాళ్లే అసలైన అమెరికన్లు కాదు”అని ఆమె స్పష్టంచేశారు.


జుట్టుకు పైసలే పైసలు

హెయిర్‌తో అమైనో యాసిడ్ ■ పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్న యూపీ సర్కార్

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లోని నాయీ బ్రాహ్మణులకు మంచి గిరాకీ వచ్చింది. ఇన్ని రోజులు పనికి రాదని భావించి చెత్త కుప్పలో పడేస్తున్న జుట్టుతో డబ్బులు సంపాదించే మార్గం దొరికింది. రోడ్డుపై పడేస్తున్న జుట్టును వేస్ట్‌చేయకుండా యూపీ ప్రభుత్వం కొత్త ఆలోచన చేసింది. జుట్టుతో అమైనో యాసిడ్‌ను తయారు చేసేందుకు ముందుకు వచ్చింది. దీని కోసం రాష్ట్రంలోని బార్బర్ల నుంచి కేజీకి నలభై రూపాయలు చెల్లించి జుట్టును కొంటోంది. కుటీర పరిశ్రమలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో యూపీలోని ‘భారతీయ హరిత్ ఖాదీ గ్రామ ఉద్యోగ్ సంస్థాన్’(బీహెచ్ కేజీఎస్) ఈ స్కీమ్ తీసుకొచ్చింది. జుట్టును, ఆవు మూత్రం, పేడతో కలిపి అమైనో యాసిడ్‌ను తయారు చేస్తారని బీహెచ్‌కేజీఎస్ ప్రతినిధులు చెప్పారు. దీని కోసం ఇప్పటికే ఖాదీ బోర్డు, గ్రామ ఉద్యోగ్ మధ్య ఒప్పందం కుదిరిందని ఖాదీ గ్రామ ఉద్యోగ మినిస్టర్ సత్యదేవ్ చెప్పారు. ఈ ప్లాన్‌లో భాగంగా మార్చి మొదటి వారంలో పది సిటీల్లో కలెక్షన్‌సెంటర్లను ఏర్పాటుచేసి బార్బర్ల నుంచి జుట్టును కొంటామని అధికారులు చెప్పారు.



అమైనో యాసిడ్ ప్రిపరేషన్‌కు సంబంధించి రెండు సంవత్సరాల పాటు రిసెర్చ్‌చేశామని, దీన్ని తయారు చేసేందుకు జుట్టు సరైన ముడిపదార్థంగా గుర్తించాని బీహెచ్‌కేజీఎస్ ట్రైనింగ్ ప్రోగ్రామర్ విజయ్‌రాయ్ అన్నారు. జుట్టుతో తయారు చేసిన అమైనో యాసిడ్ ధర లీటర్‌కు రూ.150గా నిర్ణయించామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 800 కేజీల జుట్టును వేస్ట్‌గా పడేస్తున్నారని, ఈ స్కీం వల్ల బార్బర్లకు మరింత ఆదాయం పెరుగుతుందన్నారు. “కలెక్షన్ సెంటర్లను ఏర్పాటుచేసి అమైనో యాసిడ్ తయారు చేసేందుకు కొంత మందికి ట్రైనింగ్ ఇస్తున్నాం. మార్చి మొదటి వారంలో పది సిటీల్లో వీటిని ఏర్పాటుచేసి, ఆ తర్వాత రాష్ట్రమంతటా విస్తరిస్తాం” అని విజయ్ చెప్పారు. కర్నాటకకు చెందిన ఒక కంపెనీ 50వేల లీటర్ల అమైనో యాసిడ్ ఆర్డర్ ఇచ్చిందన్నారు.



కాంగ్రెస్‌లో ‘ఓఆర్‌ఓపీ’

అమిత్ షా ఎద్దేవా

ఉణ (హిమాచల్ ప్రదేశ్): సైనికుల కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం ‘వన్ ర్యాంక్ వన్ పెన్షన్’(ఓఆర్‌ఓపీ) స్కీమ్ తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ ‘ఓన్లీ రాహుల్ ఓన్లీ ప్రియాంక’ (ఓ ఆర్ ఓపీ) స్కీమ్ తీసుకువచ్చిందని బీజేపీ ప్రెసిడెంట్ అమిత్ షా ఎగతాళి చేశారు. ఓఆర్ ఓ పీకి కాంగ్రెస్ కొత్త నిర్వచనం ఇచ్చిందన్నారు. కాంగ్రెస్‌లో గాంధీ కుటుంబమే పార్టీ అని హిమాచల్ ప్రదేశ్‌లోని ఉణ లో సోమవారం జరిగిన బహిరంగ సభలో ఆయన విమర్శించారు. అందుకే అన్ని కీలక పదవుల్లో గాంధీ కుటుంబ సభ్యులే ఉంటారని చెప్పారు. మిగతా నాయకులు ఎంత సత్తాగల వారైనా ఒక స్థాయి వరకే ఉంటారన్నారు. ప్రియాంక ఏఐసీసీ జనరల్ సెక్రెటరీగా నియమితులైన నేపథ్యంలో అమిత్ షా ఈ కామెంట్ చేశారు.

మెక్సికోలో గ్రూపు తగాదాలు.. 10 మంది మృతి

మెక్సికో: మెక్సికోలో రెండు సెల్ఫ్ డిఫెన్స్ గ్రూపుల మధ్య జరిగిన కాల్పుల్లో పదిమంది చనిపోయారు. గుయిరెరోలో ఆదివా రం అర్ధరాత్రి తర్వాత ఈ సంఘటన జరిగి నట్లు సెక్యూరిటీ అధికారులు చెప్పారు. తమకు తాము సెల్ఫ్ డిఫెన్స్‌ఆర్మీగా ప్రకటించుకున్న రెండు వర్గాల మధ్య కాల్పులు జరిగాయన్నారు. ఘటనాస్థలంలోని రెండు వ్యాన్లలో కొంత మంది బుల్లెట్ గాయాలతో చనిపోయి ఉన్నారని, ఇది డ్రగ్స్‌కు సంబంధించిన గొడవ అని భావిస్తున్నట్లు అధికారులు చెప్పారు. దేశంలో 2006 నుంచి ఇప్పటి వరకు దాదాపు రెండు లక్షల మంది డ్రగ్స్ గొడవల్లో ప్రాణాలు వదిలారని అధికారులు చెప్పారు.

51 మంది ప్రాణాలు తీసిన పైలట్ స్మోకింగ్

ఖాట్మాండు:

గత ఏడాది మార్చిలో నేపాల్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనకు డ్యూటీలో ఉన్న పైలట్ సిగరెట్టే కారణమనితెలిసింది. ఈ ప్రమాదంలో మొత్తం 51 మంది చనిపోయారు. విధి నిర్వహణలో ఉండగా సిగరెట్ తాగకూడదన్న నిబంధనల్ని ఆ పైలట్ పట్టించుకోనందుకు ప్రయాణికులు భారీ మూల్యం చెల్లించాల్సివచ్చింది. కాక్‌పిట్‌లో పైలట్ స్మోకింగ్ చేయడంతో అమెరికా-బంగ్లాదేశ్ ఎయిర్ లైన్స్ బొంబార్డియర్‌కు చెందిన యూబీజీ 211 ఫ్లయిట్ నేపాల్‌లో కుప్పకూలింది. నేపాల్‌లోని త్రిభువన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లో ల్యాండింగ్ చేస్తుండగానే ఫ్లయిట్ కూలిపోయింది. ఆ ప్రమాదంలో ఆరుగురు విమాన సిబ్బందితోపాటు మరో 45 మంది ప్రయాణికులు చనిపోయారు. పైలట్ పొగతాగడంవల్లే ఈ ప్రమాదం జరిగిందని యాక్సిడెంట్‌పై విచారణకు ఏర్పాటుచేసిన కమిషన్ నివేదికలో తేల్చింది. నేపాల్ సివిల్ ఏవియేషన్ మంత్రిత్వశాఖకు విచారణ కమిషన్ నివేదిక అందజేసింది. త్రిభువన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కంట్రోల్ టవర్, విమాన సిబ్బంది నిర్లక్ష్యాన్ని కూడా రిపోర్ట్ తప్పుపట్టింది.



- పైలట్ సిగరెట్ తాగడంతో విమానంలో అగ్ని ప్రమాదం
- యూఎస్-బంగ్లా విమాన ప్రమాదంపై కమిషన్ రిపోర్ట్ వెల్లడి



కుప్పకూలిన ఫైటర్ జెట్.. పైలట్ క్షేమం

ఖుషినగర్: ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన జాగ్వార్ యుద్ధ విమానం ఒకటి ఉత్తరప్రదేశ్‌లోని ఖుషినగర్ దగ్గర్లో సోమవారం కుప్పకూలింది. కూలిన వెంటనే విమానానికి మంటలు అంటుకున్నాయి. అయితే పారాచూట్ సాయంతో పైలెట్ సురక్షితంగా బయట పడ్డాడు. గోరఖ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ సెంటర్ నుంచి బయలుదేరిన వెంటనే ఈ ప్రమాదం జరిగింది. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, అధికారులు ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకున్నారు. ఘటనపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. జెట్ కూలడానికి కారణాలు తెలియాల్సి ఉంది.

రాణే ఆడియో టేప్‌పై చర్యలేవీ?

కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ



పనాజీ: రాఫెల్ డీల్ కు సంబంధించిన అన్ని ఫైళ్లు తన వద్ద ఉన్నాయని గోవా సీఎం మనోహర్ పారికర్ చెప్పినట్లు ఉన్న ఆడియో క్లిప్ పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మోడీ సర్కార్ పై కాంగ్రెస్ చీఫ్ రాహుల్ మండిపడ్డారు. ఈ ఆడియో క్లిప్ విడుదలై నెలరోజులైందన్నారు. పారికర్ అన్నట్లు భావిస్తున్న ఆడియో క్లిప్ బయటకు వస్తే ఒప్పందానికి సంబంధించిన అన్ని విషయాలు బయటపడతాయన్నారు. అందుకే పారికర్ పై కేంద్రం చర్యలు తీసుకోవడం లేదని సోమవారం ఆయన ట్వీట్ చేశారు. రాఫెల్ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఫైళ్లూ మనోహర్ పారికర్ దగ్గర ఉన్నాయని చెబుతున్న ఓ ఆడియో క్లిప్‌ను దాదాపు నెలరోజుల కిందట కాంగ్రెస్ విడుదల చేసింది. గోవా మంత్రి విశ్వజిత్ రాణే మరో వ్యక్తితో మాట్లాడిన టేప్ ఇదేనంటూ కాంగ్రెస్ చెప్పింది. ఒప్పందానికి సంబంధించిన అన్ని ఫైళ్లు పారికర్ బెడ్ రూంలోనే ఉన్నట్లు రాణే చెప్పినట్లు ఆడియో టేపులో ఉందని కాంగ్రెస్ పేర్కొంది. అయితే ఆడియో టేప్ నకిలీదని మంత్రి విశ్వజిత్ రాణే పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం బూటకపు ఆడియో టేప్ సృష్టించిందని కాంగ్రెస్ పై రాణే ఎదురుదాడి చేశారు.

మహారాష్ట్రలో కుదరని బీజేపీ, సేన సీట్ల సర్దుబాటు

ముంబై: లోక్ సభ ఎన్నికలకు సంబంధించి మహారాష్ట్రలో శివసేన, బీజేపీ మధ్య సీట్ల సర్దుబాటు ఒక కొలిక్కి రాలేదు. మహారాష్ట్రలోని బీజేపీ మిత్రపక్ష కూటమిలో తాము పెద్దన్నల్లాగే కొనసాగుతామని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. సోమవారం ఇక్కడ జరిగిన శివసేన పార్టీ సమావేశంలో లోక్ సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం పై చర్చ జరిగింది. తమ పార్టీతో కలిసి కూటమి ఏర్పాటు చేయడం పై బీజేపీ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని మీడియాకు సంజయ్ రౌత్ చెప్పారు. ఎన్నికల్లో తమ అవసరం ఉందనుకుంటే బీజేపీ నాయకులే మాట్లాడతారన్నారు. శివసేనతో పొత్తుకు తాము తొందరపడటం లేదని బీజేపీ సీనియర్ నేత,మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు. అయితే సేనతో పొత్తు ఉండాలని తాము కోరుకుంటున్నామన్నారు.



ఐఆర్‌సీటీసీ స్కాం.. లాలూకు ఊరట

- రబ్రీదేవి, తేజస్వి యాదవ్‌కు కూడా
- లక్ష రూపాయల పూచీకత్తుపై బెయిల్

న్యూఢిల్లీ: ఆర్జేడీ అధినేత, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట లభించింది. ఐర్‌సీటీసీ స్కాం కేసులో లాలూతోపాటు ఆయన భార్య రబ్రీదేవి, తేజస్వి యా దవ్‌కు కూడా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సోమవారం కేసును విచారించిన స్పెషల్ జడ్జి అరుణ్ భరద్వాజ్ ఒక్కొక్కరికి లక్ష రూపాయల బాండ్, ఒకరి పూచికత్తుతో కూడిన బె యిల్ ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురికి ఈ నెల 19 వరకు ఇచ్చిన మధ్యంతర బెయిల్ గడువు సోమ వారంతో ముగిసింది. ఐఆర్‌సీటీసీ హోటల్స్ కాంట్రాక్ట్‌లో అవకతవకలు చేశారని లాలూపై ఆరోపణలు వచ్చాయి.



సింగరేణి కార్మిక వాడల్లో సినిమా షూటింగ్

భద్రాద్రికొత్తగూడెం : కొత్తగూడెంలోని సింగరేణి కార్మిక వాడల్లో సోమవారం సినిమా షూటింగ్ జరిగింది. ప్రముఖ నిర్మాత కేఎస్ రామారావు సారథ్యంలో నిర్మిస్తున్న ఈ సినిమాలో విజయ్ దేవర కొండ హీరోగా, రాశీఖన్నా, ఐశ్వర్యరాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సినిమాకు క్రాంతిమాధవ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. కొత్తగూడెంలోని రుద్రంపూర్ ఏరియా కార్మికవాడలోని సింగరేణి క్వార్టర్లో సినిమా షూటింగ్ కొనసాగింది. సింగరేణి కార్మికుడి కుమారుడిగా విజయ్ దేవరకొండ నటిస్తున్నట్లు సమాచారం. మంగళ, బుధవారాల్లో షూటింగ్ ఇల్లెందులోని జేకే-5 ఓపెన్‌కాస్టు గనిలో కొనసాగనుంది. రుద్రంపూర్‌లోని సెయింట్ జోసఫ్ స్కూల్లో స్టూడెంట్స్‌తో హీరో కొంత సేపు గడిపారు. షూటింగ్ చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆదివాసీల సంబురాలు

భద్రాచలం, వెలుగు : ఐక్యరాజ్యసమితి జనవరి 28వ తేదీని ప్రపంచ ఆదివాసీ భాషా దినోత్సవంగా ప్రకటించడంపై భద్రాచలం పట్టణంలో సోమవారం ఆదివాసీలు సంబురాలు నిర్వహించారు. 2019 సంవత్సరాన్ని ఆదివాసీ భాషా పరిరక్షణ సంవత్సరంగా జరుపుకోవాలని యునెస్కో పారిస్‌లో జెండాను ఆవిష్కరించింది. ఇదే సమయంలో భద్రాచలం ఐటీడీఏలో పీవో పమేలా సత్పథితో ఆదివాసీలు ఆదివాసీ భాషా సంవత్సర జెండాను ఆవిష్కరింపజేశారు. అనంతరం వారు అంబేద్కర్ సెంటర్‌లో ఆదివాసీ అమరవీరుల విగ్రహాల వద్ద జెండా ఎగురవేశారు. కోయ, నాయకపోడు, కొండరెడ్ల ఆదివాసీ సంఘాల నేతలు ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తెల్లం వెంకట్రావ్ హాజరయ్యారు. ఆదివాసీల భాషను, సంస్కృతిని పరిరక్షించేందుకు ఐక్యరాజ్యసమితి చేస్తున్న కృషిని వారు అభినందించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ సమన్వయ కర్త మడివి నెహ్రూ, కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముర్ల రమేశ్, ఎంపీపీ ఊకె శాంతమ్మ, ఎంపీటీసీ మానె కమల, ఆదివాసీ నాయక పోడు సేవా సంఘం నాయకుడు పుల్లయ్య సంబురాల్లో పాల్గొన్నారు.



వరంగల్ నిట్‌లో మార్చి 15 నుంచి 17 వరకు నిర్వహించే స్ప్రింగ్ స్ప్రీ–2019 థీమును 'కళాక్షేత్ర' పేరుతో సోమవారం ఆవిష్కరించారు.



తెలంగాణ 'సూపర్ పవర్'

శరవేగంగా తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్లాంటు పనులు

గోదావరిఖని, వెలుగు :
ప్రభుత్వం భవిష్యత్ తరాల అవసరాల కోసం ప్రస్తుతం ఉన్న ఎన్టీపీసీ పవర్ ప్లాంటుతో పాటు తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణం చేపడుతోంది. రానున్న రోజుల్లో అది పూర్తి కానుంది. దీంతో తెలంగాణలో కరెంట్ ఉత్పత్తికి ప్రధాన కేంద్రంతో పాటు పారిశ్రామికంగా ఎన్టీపీసీ మరింత పురోగతి సాధించనుంది. ఇక్కడున్న వనరుల ద్వారా నాణ్యమైన విద్యుత్తును ఉత్పత్తి చేసి వివిధ రాష్ట్రాల అవసరాలకు సరఫరా చేస్తుంది. దేశంలోనే ప్రత్యేకతను చాటుకున్న రామగుండం నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) మరో మణిహారాన్ని తన సిగలో ధరించనుంది. దీంతో స్థానికంగా ఉపాధి అవసరాలతో పాటు ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది.
2016 ఆగస్టు 7న ప్రధాని మోదీ చేతుల మీదుగా తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు -1 వ దశ (2 x 800 మెగావాట్లు) నిర్మాణానికి ఫౌండేషన్ స్టోన్ పడింది. అంతేగాకుండా తెలంగాణ స్టేజ్-2 (3 x 800 మెగావాట్లు) కోసం ఎన్టీపీసీ డైరెక్టర్ల బోర్డు కూడా ఆమోదించింది.

- ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. ఇందు కోసం 8.0 ఎంటీపీఏ బొగ్గు అవసరాలుంటాయి. సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 2 టీఎంసీల నీళ్లు ప్లాంటు నిర్వహణకు ఉపయోగించుకోనున్నారు.
- ప్లాంటులో కరెంట్ ఉత్పత్తి కోసం మందాకినీ-బీ బొగ్గు మైన్, ఒడిశా, టాపర్రింగ్ బొగ్గు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే పీపీఏతో జనవరి 18, 2016 టీఎస్ఎస్‌పీడీసీఎల్ తో ఒప్పందం కుదిరింది.
- ప్లాంటు నిర్మాణం కోసం స్థానికంగా అనువైన ప్రాంతంగా గుర్తించి 2016 జనవరి 20న పర్యావరణ క్లియరెన్స్ చేసుకుంది. దీనికి గానూ ప్లాంటు పెట్టుబడి వ్యయం రూ.10598.98 కోట్లుగా నిర్ధారించారు.
- ప్లాంట్‌లో ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేస్తూ, 50,000 కన్నా ఎక్కువ మొక్కలు పెంచనున్నారు.
- అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ద్వారా బొగ్గు వినియోగం భారీ తగ్గింపులో సహాయపడుతుంది.
- బాయిలర్, సీలింగ్ గ్రిడ్ల నిర్మాణంలో భాగంగా మూడు గ్రిడ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన ఎనిమిదో సీలింగ్ గ్రిడ్ల నిర్మాణం ఫిబ్రవరి 2019 నాటికి పూర్తికానుంది.
- బీవోపీ 44 శాతం పూర్తి.
- ప్లాంటుకు సంబంధించి యూనిట్ -1, మే 2020 అలాగే యూనిట్-2 నవంబర్ 2020 కల్లా పూర్తి కానుంది.

అవార్డ్స్

రామగుండం తెలంగాణ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అవార్డు విజేత ట్రోఫీని (గ్రీన్‌ఫీల్డ్ థర్మల్ 201718) అందుకుంది.



ప్లాంటు నిర్మాణంలో పనిచేస్తున్న అధికారులకు అభినందనలు. భద్రతపై దృష్టిసారించిన ఇంజినీర్లు ప్లాంటు పూర్తయ్యే వరకూ అదే స్థాయిలో పనిచేయాలి. కొత్త ప్లాంటు ఏర్పాటులో భాగంగా పురోగతిని సాధించేందుకు అధునాతన సాంకేతికతలను ఈ ప్రాజెక్టు రూపొందించింది. ఈ టెక్నాలజీ ద్వారా మొదటి 800 మెగావాట్ల చిమ్నీ నిర్మాణంతో పాటు సీబ్ల్యూ బాక్స్, జీఐఎస్ ఆధారిత స్విచ్చాన్ వ్యవస్థలతో పాటు మరిన్ని నిర్మాణాలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తాం.
రవీంద్ర, ఈడీ (రామగుండం ఎన్టీపీసీ)

700 ఎకరాల్లో తడిసిన వేరుశనగ

నాగర్‌కర్నూల్, వెలుగు : వర్షాలకు నష్టపోయిన పంటను లెక్కలేసే పనిలో వ్యవసాయ అధికారులున్నారు. సోమవారం బిజినేపల్లి మండలం పోతేపల్లి, మహదేవునిపేటలో తడిసిన వేరుశనగ పంటను అధికారులు పరిశీలించారు. ఈ మండలాల్లో సుమారు 450 ఎకరాల్లో వేరుశనగ వర్షపునీటలో తడిసిపోయినట్లు సమాచారం. వెల్దండ, చారగొండ మండలాలలో 205 ఎకరాల్లో వేరుశనగ దెబ్బతిన్నట్లు ఓ అంచనాకొచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు దాదాపు 700 ఎకరాల వేరుశనగ పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.



మహదేవునిపేటలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

క్విక్ బైట్స్

యాసంగికి ఎస్సారెస్పీ నీటి విడుదల

బాల్కొండ, వెలుగు : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుండి కాకతీయ కాలువ, లక్ష్మి కాలువల ద్వారా యాసంగి పంటలకు అధికారులు సోమవారం నీటిని విడుదల చేశారు. ఎస్సారెస్పీలో నీటిని నిలువను దృష్టిలో ఉంచుకొని అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ కాలువల ద్వారా 30 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. లక్ష్మి కాలువకు 200 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ఇరిగేషన్ కార్యాలయంలో శివం కమిటీ నిర్ణయం మేరకు ఇప్పటి నుంచి మార్చి 25 తేది వరకు క్రమంగా ప్రతీ రోజు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

మిగిలిన జీవితం ప్రజాసేవకే..

టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హుజూర్‌నగర్, వెలుగు: ఇప్పటికే 75 శాతం జీవితం ముగిసిందని, మిగిలిన 25 శాతం కూడా ప్రజాసేవకే పాటుపడతానని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. మూడో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల్లోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ మద్దతుదారుల తరఫున ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాజకీయాలు ప్రమాదకరంగా మారనున్నాయన్నారు. పేదలు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేదన్నారు. అభ్యర్థి వ్యక్తిత్వాన్ని, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హుజూర్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని, అధికార పార్టీ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించకపోతే పథకాలు అందవనే వారిని నమ్మొద్దన్నారు.



రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నరు

- **బీమా చెక్కు ఇచ్చేందుకు రూ. 64 వేలు డిమాండ్**
- **డబ్బు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ**

వరంగల్, వెలుగు: ఇన్సూరెన్స్ చెక్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన అధికారిని ఏసీబీ అధికారులు సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ రూరల్ జిల్లా శాయంపేటకు చెందిన మారపల్లి సుమన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు 2018 సెప్టెంబర్‌లో గుండెపోటుతో మరణించాడు. సుమన్‌కు సంబంధించిన రూ. 3 లక్షల బీమా డబ్బుల కోసం అతడి తమ్ముడు రాజు వరంగల్‌లోని రాష్ట్ర ప్రభుత్వ జీవిత బీమా శాఖ జాయింట్ డైరెక్టర్ ఆఫీస్‌ను సంప్రదించాడు.
బీమా చెక్‌ను పాస్ చేసేందుకు జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ యాదగిరి రూ. 64,500 లంచం డిమాండ్ చేశాడు. డబ్బులు ఇచ్చుకోలేనని, చెక్కు ఇవ్వాలని రాజు ఎన్నిసార్లు తిరిగినా ఆ అధికారు చెక్కు ఇవ్వకపోవడంతో రాజు చివరకు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు రాజు లంచం ఇచ్చేందుకు అంగీకరించడంతో సోమవారం హన్మకొండలోని అదాలత్ వద్ద ఉన్న ఓ క్యాంటిన్‌లో లంచం తీసుకుంటున్న యాదగిరిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వరి సాగు తగ్గింది

అచ్చంపేట, వెలుగు :
యాసంగిలో వరిసాగు సగానికి సగం తగ్గింది. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభించిన తర్వాత నా గర్ కర్నూలు జిల్లాలో వరి ప్రధాన పంటగా మారింది. దీంతో నిరుడు సాధారణ విస్తీర్ణం కన్నా ఎక్కువగా వరి సాగయ్యింది. ఐతే, ఈసారి కల్వకుర్తి నీటిని వదిలే అవకాశం లేదని అధికారులు తేల్చిచెప్పడంతో రైతులు ఇతర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. బోరుబావులున్న చోట్లనే వరి సాగు చేస్తున్నారు.
జిల్లాలోని రైతులు ఇప్పటిదాకా 6,262 హెక్టార్లలోనే వరి వేశారు. నాట్లు వేసుకునేందుకు ఇంకో 15 రోజుల సమయమే ఉంది. మరో వెయ్యి హెక్టార్లలో మాత్రమే వరి వేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. యాసంగిలో జిల్లా సాధారణ వరి విస్తీర్ణం 11,923 హెక్టార్లు కాగా, గత సీజన్లో కేఎల్ఐ నీటిని విడుదల చేయడం వల్ల 17,636 హెక్టార్లలో రైతులు వరి పండించారు. గతేడాది సెప్టెంబర్‌లో కృష్ణానదికి వరదలు వచ్చాయి. దీంతో అక్టోబర్ నుంచి మార్చి వరకు కేఎల్ఐ కాలువల ద్వారా నీరు వదిలారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో మూడు వందలకు పైగా చెరువులు నింపారు. ఈసారి జులైలోనే వరదలు రావడంతో ఆగస్టు నుంచి కాలువల ద్వారా నీరు వదిలారు. దీంతో ఖరీఫ్‌లోనే భారీగా వరి సాగయ్యింది. డిసెంబర్ వరకు కెఎల్ఐ నుంచి నీరు వదిలి చెరువులను నింపారు. చివరిదశలో ఉన్న వేరుశనగకు మరో రెండు తడుల నీళ్లివ్వాల్సిఉండడంతో రబీకి నీరు వదలలేమని అధికారులంటున్నారు. సీజన్ మొదలు కాకముందే కేఎల్ఐ నీరు వదలలేమని, ఆరుతడి పంటలే వేసుకోవాలని అధికారులు సూచించారు. దీంతో వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం, కంది పంటలను సాగు చేస్తున్నారు.



- **గత యాసంగిలో 17,636 హెక్టార్లు సాగు**
- **ఇప్పుడు 6, 262 హెక్టార్లకే పరిమితం**
- **కేఎల్ఐ నుంచి నీళ్లివ్వలేమన్న అధికారులు**

వరి నాట్లు వద్దన్నాం

ఈ యాసంగికి కేఎల్ఐ ద్వారా సాగునీరు ఇవ్వలేమని ఇరిగేషన్ అధికారులు డిసెంబర్‌లోనే చెప్పారు. వరి నాట్లు వేసుకోవద్దని అప్పుడే రైతులకు సూచించాం. బోరు, బావి ఉన్న రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని చెప్పాం. ఈ సారి ప్రాజెక్టు ద్వారా చెరువులను నింపినా, వాటిలో కనీసం 40 శాతం నీటిని తాగునీటి అవసరాలకు వాడాల్సి ఉంది.
బైరెడ్డి సింగారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి నాగర్‌కర్నూల్



సతాయిస్తుండ్రు

- **ఓట్ల కోసం పదే పదే తిరుగుతున్న అభ్యర్థులు**
- **ఓటేస్తామని ఒట్టు వేయాలంటూ బలవంతం**

యాదాద్రి, వెలుగు: పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓటర్ల మనసులోని మాటను బయట పెట్టించేందుకు నానా విధాల ప్రయత్నిస్తున్నారు. ఓట్ల కోసం పదే పదే వారి చుట్టూ తిరుగుతూ చిరాకు పెట్టిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల్లో బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. అయితే పోటీ తీవ్రంగా ఉన్న గ్రామాల్లో ఓటర్ల మనోగతం ముందుగానే తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రచారం పేర ఇంటికొచ్చే అభ్యర్థులకు ఓటేస్తామని చెబుతున్నప్పటికీ అభ్యర్థులు వినడం లేదు. ఓటేస్తామని నమ్మకం కలిగేలా ఒట్టు వేయాలని, లేకపోతే వేయనని చెప్పాలని అడుగుతున్నారు. మీరు వేయమని చెబితే వేరే వాళ్లనైనా చూసుకుంటామని ఒత్తిడి చేస్తున్నారు. కొందరు అభ్యర్థులు తమ గుర్తులైన జగ్గులు, గౌన్లు, గ్యాస్‌స్టౌ, కత్తెర, వెండి ఉంగరాలను పంపిణీ చేస్తున్నారు. అభ్యర్థులు ఇచ్చే కానుకలు, మందు, మాంసం తీసుకోకపోయినా, వారితో కలిసి తాగేందుకు ఒప్పుకోకపోయినా నాటు ఓటేయవన్న మాట అని ఇబ్బంది కలిగిస్తున్నారని పలువురు వాపోతున్నారు.


అభ్యర్థులకు తగ్గట్లుగానే ఓటర్ల సమాధానం

పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు అభ్యర్థుల కంటే తెలివిగా వ్యవహరిస్తున్నారు. ప్రచారం పేర అభ్యర్థులు వచ్చి ఎన్ని తీర్ల అడిగినా వారికి తగ్గట్లుగానే సమాధానం చెబుతున్నారు. పోటీలో ఎంత మంది అభ్యర్థులున్నా.. ఎవరు ఏమిచ్చినా తీసుకుంటున్నారు. దీంతో తమకు ఓటేసే వారెవరో, వేయని వారెవరో తేల్చుకోలేక తలలు పట్టుకుంటున్నారు.

రూ.50 వేలు దొరికాయ్

- **ఓటర్లకు పంచుతుండగా పట్టుకున్న పోలీసులు**

ఎల్కతుర్తి, వెలుగు: పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లకు పంచుతున్న డబ్బులను సోమవారం కమలాపూర్ మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. ఇన్స్‌పెక్టర్ బాలాజీ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం కమలాపూర్‌కు చెందిన కట్కూరి తిరుపతిరెడ్డి తరఫున కొందరు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారనే విషయాన్ని కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామానికి వెళ్లిన పోలీసులు ముచ్చ సాంబయ్య అనే వ్యక్తి వద్ద నుంచి రూ. 50 వేలు స్వాధీనం చేసుకున్నారు. అతడితో పాటు కట్కూరి మోహన్‌రెడ్డి, చేరాల సత్యనారాయణను అదుపులోకి తీసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



ఖేడ్ యువకుడికి స్టేట్ గౌరవ అవార్డు

నారాయణఖేడ్ , వెలుగు: నారాయణఖేడ్ కు చెందిన మూడ్ వెంకటేశ్‌కు స్టేట్ గౌరవ అవార్డు లభించింది. ఢిల్లీలో ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, నేషనల్ హ్యూమన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాస్ చంద్ర బోస్ జయంతి పురస్కరించుకొని నిర్వహించిన, జాతీయ యువ సమ్మేళనం కార్యక్రమంలో యువత సాధికారత, క్రీడలు, గుడ్ మోటివేషనల్ మెస్సేజెస్ విభాగాల్లో సేవ చేసినందుకు, ఈ అవార్డును వెంకటేశ్ కు దక్కిందని ఢిల్లీ ఎంపీ మహాబూబ మిశ్రా, ఢిల్లీ ప్రెస్ క్లబ్ బాధ్యులు రామచంద్రం పేర్కొన్నారు. కాగా క్రికెట్ లోనూ వెంకటేష్ సత్తా చాటి ఈనెల 26న ఢిల్లీలో నిర్వహించిన ప్రవాస తెలుగు క్రికెట్ టోర్నీలో కరుడు బాగ్ జట్టుకు కెప్టెన్ గా ఆడి జట్టు ను గెలిపించాడు.

ఇక ప్రతి పల్లెలో పచ్చదనం

- గ్రామానికో నర్సరీ పెంచేందుకు ఏర్పాట్లు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచడంలో భాగంగా గ్రామాల్లో నర్సరీలకు ప్రభుత్వం రూ.25 కోట్లు విడుదల చేసింది. గ్రామీణాభివృద్ధి శాఖ రూ.100 కోట్లు కోరగా తొలి విడతగా రూ.25 కోట్లు విడుదల చేస్తూ పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పచ్చదనం పెంపుకోసం నర్సరీలు ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం కేసీఆర్ ఇప్పటికే ఆదేశించిన విషయం తెలిసిందే.

నాబార్డుకు రూ.21 కోట్లు విడుదల

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో గోదాముల నిర్మాణానికి నాబార్డ్ మంజూరు చేసిన రుణాలకు ప్రభుత్వం వాయిదాల చెల్లింపుల్లో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(201819) చివరి త్రైమాసికానికి రూ.20,98,21,744 ఆర్థికశాఖ సోమవారం విడుదల చేసింది. ముంబైలోని నాబార్డు బ్యాంక్ ఖాతాలో ఈ మొత్తాన్ని మూడు విడతల్లో చెల్లించనుంది.

ఎస్‌ఎస్‌సీ బోర్డు మాజీ అధికారికి రెండేళ్ల జైలు

- అక్రమాస్తుల కేసులో ఏసీబీ కోర్టు తీర్పు

హైదరాబాద్, వెలుగు: ఆదాయానికి మించిన ఆస్తుల ఉన్న కేసులో ఎస్ఎస్‌సీ బోర్డు మాజీ అడిషనల్ జాయింట్ సెక్రెటరీ ఏడీ రవీంద్రరావుకు రెండేళ్ల జైలుశిక్ష పడింది. అక్రమాస్తులు రూ.34లక్షలు కలిగి ఉండడంతో 2010లో ఆయనపై చార్జిషీటు దాఖలైంది. దీనిపై సోమవారం విచారణ జరిపిన ఏసీబీ సెషన్ కోర్టు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. జరిమానా చెల్లించలేకపోతే శిక్ష కాలం మరో ఏడాది పొడగించాలని ఆదేశించింది.

క్రాసింగ్‌ల్లో భద్రత మరింత పెంచండి

- దక్షిణమధ్య రైల్వే జీఎం కుల్‌శ్రేష్ఠ

హైదరాబాద్, వెలుగు: రైల్వేలో భద్రత విధానాల్ని తప్పనిసరిగా పాటించాలని దక్షిణమధ్య రైల్వే జీఎం కుల్‌శ్రేష్ఠ అధికారులను ఆదేశించారు. సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో అన్ని విభాగాల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. నూతన టెక్నాలజీతో రైళ్ల నిర్వహణ చేపట్టాలని, లెవల్ క్రాసింగ్ వద్ద భద్రతను మరింత పటిష్ఠం చేయాలని సూచించారు. సరుకు రవాణా లక్ష్యాన్ని చేరుకునేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్



మాంసం అమ్మకాల కోసం ఏర్పాటు చేసిన విభాగం

‘ఇంటిగ్రేటెడ్’కు అంతా రెడీ

సిద్దిపేట, వెలుగు:

- సిద్దిపేటలో ఫిబ్రవరి 6న ప్రారంభం
- 20 కోట్లతో నిర్మాణ పనులు
- రోడ్లపై మాంసం అమ్మకాలు బంద్

లేటెస్ట్ డిజైన్‌తో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ కొద్ది రోజుల్లో సిద్దిపేట ప్రజలకు అందుబాటులోకి రానున్నది. దాదాపు ఇరవై కోట్ల వ్యయంతో పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్మించిన మార్కెట్‌ను ఫిబ్రవరి 6వ తేదీన ప్రారంభించడానికి ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలతో పాటు మార్కెట్‌కు అదనపు ఆదాయం అందేలా సమీకృత మార్కెట్‌ను తీర్చిదిద్దారు. ప్రధాన రహదారికి ఎదురుకు 17 కమర్షియల్ దుకాణాలను, హోల్ సేల్ రిటేల్ వ్యాపారులకు 16, హోటల్, రెస్టారెంట్లను ఏర్పాటు చేసి ఓపెన్ టెండర్ల ద్వారా వ్యాపారులకు కేటాయించారు. దీని ద్వారా సమీకృత మార్కెట్‌కు అదనపు ఆదాయం సమకూరనుంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో వెజ్ నాన్‌వెజ్‌తో పాటు మొదటి అంతస్తులో ప్రత్యేకంగా రెండు సూపర్ మార్కెట్లను ఏర్పాటు చేయనున్నారు. వినియోగదారుడు ఈ మార్కెట్లోకి అడుగు పెడితే వారికి అవసరమైన అన్ని సరుకులు తీసుకుని వెళ్లే విధంగా తీర్చిదిద్దారు. నాలుగు లిఫ్ట్‌లు, రైతులకు విశ్రాంతి గది, విశాలమైన ఆవరణలో పార్కింగ్ సౌకర్యం, 120 కేవీ జనరేటర్, సీసీ కెమెరాలు, ధరల పట్టిక కోసం డిజిటల్ డిస్‌ప్లే బోర్డు, అనౌన్స్‌మెంట్ కోసం మైక్ సౌకర్యం, తాగునీటికి మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సిద్దిపేటలో ఏర్పాటు చేసిన ఆధునిక రైతు బజార్ మాదిరిగానే ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను తీర్చిదిద్దుతున్నారు. నాలుగు బ్లాక్‌ల ఏర్పాటు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులో నాలుగు బ్లాకులను ఏర్పాటు చేశారు. రెండు బ్లాకుల్లో కూరగాయల హోల్‌సేల్, రిటేల్ మార్కెట్లను ఏర్పాటు చేయనున్నారు. కూరగాయల రిటేల్ అమ్మకాల కోసం 110 దుకాణాలను ఏర్పాటు చేశారు. వీటి పైఅంతస్తుల్లో సూపర్ మార్కెట్లను ఏర్పాటు చేస్తున్నారు. మరో రెండు బ్లాకుల్లో ఫిష్ మార్కెట్, మటన్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులను అధికారులు పూర్తి చేయించారు. ఆయా బ్లాక్‌లకు ప్రత్యేకంగా లిఫ్ట్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

నాన్ వెజ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో నాన్ వెజ్ మార్కెట్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పాటు చేసిన మటన్, చేపల దుకాణాలను ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే వ్యాపారులతో మాట్లాడి వారికి దుకాణాలను కేటాయిస్తున్నారు. ఫిష్ మార్కెట్‌లో 17, మటన్ మార్కెట్లో 92 మందికి దుకాణాలు కేటాయించారు. ఈ మార్కెట్ ప్రారంభమైతే పట్టణంలో రోడ్లపై మటన్‌తో పాటు మాంసం అమ్మకాలు నిలచిపోతాయి.

ప్రారంభానికి సిద్ధం చేసాం

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభానికి సిద్ధం చేశాం. ఫిబ్రవరి 6వ తేదీన మార్కెట్‌ను ప్రారంభించాలని నిర్ణయించాం. కొన్ని చిన్న పనులు మిగిలి ఉన్నా, ప్రారంభం నాటికి పూర్తి చేస్తాం. సర్వ హంగులతో ఏర్పాటైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో వినియోగదారులకు కావాల్సిన సరుకులు దొరుకుతాయి.

– శ్రీనివాస్ , మార్కెట్ కార్యదర్శి

బస్టాండ్లలో మినీ థియేటర్ల ఏర్పాటు

- కసరత్తు చేస్తున్న ఆర్టీసీ
- ఎండీకి నివేదిక సమర్పించిన అధికారుల బృందం

హైదరాబాద్, వెలుగు: ఆర్టీసీ బస్టాండ్లలో మినీ థియేటర్ల ఏర్పాటుకు విధివిధానాలపై అధికారుల బృందం ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మకు సోమవారం నివేదిక సమర్పించింది. ఇటీవల విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ లో మినీ థియేటర్ ను అధికారుల బృందం పరిశీలించింది. విజయవాడ బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మినీ థియేటర్‌లో రెండు స్క్రీన్లు ఉన్నాయని, ఫుడ్ స్టాళ్ల ద్వారా నెలకు రూ. 4.45లక్షలు ఆదాయం వస్తోందని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని బస్‌స్టేషన్లలో ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకోవడానికి కొన్ని మార్పులు చేర్పులతో మినీ థియేటర్ల నిర్మాణం చేపట్టవచ్చని సూచించారు. లక్నోలోని పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) స్కీం ద్వారా నిర్మించిన బస్‌స్టేషన్‌ను త్వరలో ఇదే బృందం అధ్యయనం చేస్తుందని ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మ చెప్పారు. ఆర్టీసీకి సంబంధించిన ఖాళీ స్థలాలను ఏ రకంగా ఉపయోగించుకుంటే ఆదాయం సమకూరుతుందనే విషయంపై లోతుగా అధ్యయనం చేస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలో మినీ థియేటర్ల ఏర్పాటుకు ఇప్పటికే 23 స్థలాలను గుర్తించారు. 15 చోట్ల థియేటర్ల నిర్మాణానికి రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ కూడా ముందుకొచ్చింది. మినీ థియేటర్లతో ఏటా రూ.3.11 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు.

‘అకాల’ బాధిత రైతులను ఆదుకోవాలి

- తడిసిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలి: రావుల

హైదరాబాద్, వెలుగు: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ నేత రావుల చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో అధికారులు పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు. మార్కెట్‌కు తెచ్చిన వరి, కంది, మిర్చిరాశులు అధికారుల నిర్లక్ష్యంతో కల్లాల్లోనే తడిశాయని, వాటికి మద్దతు ధర ఇవ్వాలని కోరారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరిస్తా: హోంమంత్రి

హైదరాబాద్, వెలుగు:



మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. సోమవారం ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(పీఎంటీఏ) రూపొందించిన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఎంటీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదగిరి, తరాల జగదీశ్‌లు టీచర్ల సమస్యలను హోంమంత్రికి వివరించగా సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పూల రవీందర్, కాటేపల్లి జనార్దన్, నాయకులు లింగస్వామి, ప్రవీణ్, బబ్లూ నాయక్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనాలి: తమ్మినేని

హైదరాబాద్, వెలుగు: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.20వేల పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట, భూపాలపల్లి, జనగాం, మెదక్, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో కోతకొచ్చిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. కల్లాల్లో ఉన్న పత్తి, మిరప పంటలతో పాటు మార్కెట్ యార్డులు, ఐకేపీ సెంటర్లకు అమ్మడానికి తెచ్చిన ధాన్యం తడిసిందన్నారు.

అడవిలో అడుగుపెట్టాలంటే భయపడాలె

హైదరాబాద్, వెలుగు:



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ జోషి

- అటవీ శాఖ సిబ్బంది, పోలీసులు కలిసి పని చేయాలి
- అటవీప్రాంతాల్లో 54 చెక్ పోస్టులు ఏర్పాటు
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ ఎస్ కే జోషి

అడవుల్లోకి అడుగు పెట్టాలంటే కలప స్మగ్లర్లు, వేటగాళ్లు భయపడేలా పోలీసు, అటవీశాఖ అధికారులు పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి అన్నారు. సోమవారం డీజీపీ మహేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పి.కె. ఝాతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు ఎస్పీలు, పోలీస్ , అటవీశాఖ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడారు. హరితహారంతో అడవుల బయట, కఠిన చర్యలతో అడవి లోపల పచ్చదనం పునరుద్ధరించేందుకు కృషి చేయాలన్నారు. వచ్చే నెల 6వ తేదీ నాటికి అన్ని జిల్లాల ‘అటవీ సంరక్షణ ప్రణాళికలు’ సిద్ధం చేయాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో వెంటనే 54 చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. కలప స్మగ్లింగ్ ను అరికట్టేందుకు ఇంటెలిజెన్స్ సాయం తీసుకోవాలనిసూచించారు. అటవీ నేరగాళ్ల సమాచారం ఇచ్చేవారికి రివార్డులు ఇస్తామన్నారు. అటవీ నేరగాళ్లకు సత్వరమే కఠిన శిక్షలు పడేలా కొత్త అటవీ చట్టాన్ని రూపొందిస్తామని సీఎస్ చెప్పారు. అటవీ నేరస్థులను జియో ట్యాగింగ్ చేస్తామని డీజీపీ మహేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కట్టె కోత మిషన్లపై నిఘా పెట్టాలని పోలీసులను ఆదేశించారు. అటవీ సిబ్బందికి కానిస్టేబుల్‌నుంచి ఎస్పీ స్థాయి అధికారుల వరకు అందరూ అందుబాటులో ఉంటారన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ కలిసి ఒక టీమ్‌గా పనిచేయాలన్నారు. అడవులపై సాయుధ పోలీసులతో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అటవీ సిబ్బందిని ఉపేక్షించేది లేదని సీఎం ముఖ్య కార్యదర్శి భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. అదిలాబాద్ జిల్లాలో ముల్తానీలను కలప స్మగ్లింగ్ నుంచి దూరం చేసేందుకు వారికి పునరావాస ప్యాకేజీ కల్పిస్తామన్నారు. ఆయా జిల్లాల ఉన్నతాధికారుల ‘అటవీ రక్షణ కమిటీ’లుగా ఏర్పడి సమీక్షించాలని సూచించారు. గ్రామ స్థాయిలో ‘హరిత రక్షక కమిటీ’లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్, రెవెన్యూశాఖ సిబ్బంది సాయంతో అంగుళం అటవీ భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వబోమని, వన్యప్రాణుల వేటపై కఠినంగా వ్యవహరిస్తామని పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా అన్నారు.

≡ క్విక్ బైట్స్

రూ.12,500 కోట్లు కేటాయించండి

- పాఠశాల విద్యాశాఖ బడ్జెట్ ప్రతిపాదన

హైదరాబాద్, వెలుగు: రానున్న ఆర్థిక సంవత్సరానికి పాఠశాల విద్యాశాఖ బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జీతాలకు రూ.10 వేల కోట్లు, స్కీమ్ లకు రూ.2,500 కోట్లు కలిపి మొత్తం రూ.12,500కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. గత బడ్జెట్లో ప్రభుత్వం రూ.9,482 కోట్లు కేటాయించింది. పథకాలకు రూ.1,288 కోట్లకుగాను రూ.1,045కోట్లు ఇచ్చింది. వేతనాలకు రూ.9 వేలకోట్లకు పైగా నిధులు అవసరముంటే, దాంట్లోనూ కోత పెట్టి రూ.8,437 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది పాఠశాల విద్యాశాఖలో నిధుల సమస్య తీవ్రమైంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ కొంత ఎక్కువ బడ్జెట్ అవసరమని ప్రభుత్వాన్ని కోరింది.

ఆర్టీసీ స్థలాల్లో సోలార్ ప్లాంట్లు

- ఏటా రూ.2.25 కోట్లు ఆదా
- ఆర్టీసీ ఈడీ పురుషోత్తం

హైదరాబాద్, వెలుగు: ఆర్టీసీ బస్టాండ్లు, ఖాళీ స్థలాల్లో సోలార్‌ప్లాంట్లు ఏర్పాటు చేయడం ద్వారా సంస్థకు ఏటా రూ.2.25 కోట్ల వరకు ఆదా అవుతుందని ఆర్టీసీ ఈడీ (రెవెన్యూ, ఐటీ) పురుషోత్తం వెల్లడించారు. వివిధ సంస్థలు 4,458 కిలోవాట్ల కెపాసిటీ గల ప్లాంట్లను అన్ని డిపోలు, ప్రధాన బస్‌స్టేషన్లు, యూనిట్లలో దశలవారీగా ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. బస్‌భవన్‌లో సోలార్ సంస్థల ప్రతినిధులు, అధికారులతో ఆయన సోమవారం సమీక్షించారు. నిర్దేశించిన సమయానికి ప్లాంట్లను అందుబాటులోకి తేవాలని సూచించారు. సాధారణ విద్యుత్‌కు అయ్యే ఖర్చు కన్నా సోలార్ విద్యుత్‌కు తక్కువ అవుతుందని, దీంతో ఆర్టీసీకి మేలు జరుగుతుందన్నారు.

ఆ కేసుల విచారణాధికారం ఏపీ హైకోర్టుకు లేదు

- లేఖ రాసిన ఏపీ లాయర్ల సంఘం
- ప్రజాహిత వ్యాజ్యంగా స్వీకరించిన రాష్ట్ర హైకోర్టు
- వ్యాజ్యంపై విస్తృత ధర్మాసనం విచారిస్తుందని వెల్లడి



అమరావతి, వెలుగు: తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు ఉమ్మడిగా ఉన్నప్పుడు దాఖలైన కీలక కేసుల్ని విచారణ చేయాల్సిన పరిధి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు లేదంటూ ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం రాసిన లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా రాష్ట్ర హైకోర్టు పరిగణించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 40(3) ప్రకారం అప్పీళ్లు, కోర్టు ధిక్కార వ్యాజ్యాలు, ప్రజాహిత వ్యాజ్యాలను ఎవరు విచారించాలో వెల్లడించాలని లేఖలో సంఘం కోరింది. ఇందులో న్యాయపరమైన కీలక విషయాలు ఉన్నందున లార్జర్ బెంచ్ (విస్తృత ధర్మాసనం)కు నివేదించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో డివిజన్ బెంచ్ నిర్ణయించింది. ఈ పిల్‌ను విస్తృత ధర్మాసనం విచారించనుంది.

నేడు స్వదేశానికి 14 మంది గల్ఫ్ బాధితులు

హైదరాబాద్: నిజామాబాద్‌కు చెందిన 14 మంది గల్ఫ్బాధితులు మంగళవారం భారత్‌కు తిరిగి రానున్నారు. ఏజెంట్ల చేతిలో మోసపోయిన వీరంతా 4 నెలలుగా ఇరాక్ లో చిక్కుకున్నారని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇప్పుడు స్వదేశానికి వస్తున్నారని తెలంగాణ గల్ఫ్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పాట్కూరి బసంత్ రెడ్డి సోమవారం మీడియాకు తెలిపారు.

డాక్టర్స్ ఫోరమ్ అధ్యక్షుడిగా అన్వేష్‌కుమార్

హైదరాబాద్, వెలుగు: తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ డాక్టర్స్ ఫోరమ్ కొత్త కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. అసోసియేషన్ అధ్యక్షుడిగా నిమ్స్ ఆస్పత్రి వైద్యుడు అన్వేష్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్స్ ఫోరమ్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాలస్వామి, కోశాధికారి నిర్మల పాల్గొన్నారు.

డూప్లికేట్ ఓట్లతో రెండు సర్పంచ్‌లు కోల్పోయినం

- టీపీసీసీ ఎన్నికల కమిటీ కన్వీనర్ నిరంజన్

హైదరాబాద్, వెలుగు: డూప్లికేట్ ఓట్లతో రెండు సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ నష్టపోయిందని టీపీసీసీ ఎన్నికల కమిటీ కన్వీనర్ జి. నిరంజన్ ఆరోపించారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి సెగ్మెంట్‌లో 23 మందికి రెండు గ్రామాల్లో ఓట్లున్నాయని, వాళ్లు రెండు చోట్లా ఓటేశారన్నారు. ఆ రెండు పంచాయతీల్లో కాంగ్రెస్ అభ్యర్థులు 10, 7 ఓట్ల తేడాతో ఓడిపోయారన్నారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘం, కలెక్టర్, ఎంపీడీవోకు ఫిర్యాదు చేయగా ఎన్నికల ట్రిబ్యునల్ ఆశ్రయించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపిందన్నారు. జిల్లాలో, రాష్ట్రంలో ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను నియమించలేదని గుర్తు చేశారు. డూప్లికేట్ ఓట్లపై కమిషన్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

పొట్టి శ్రీరాములు వర్సిటీలో దూరవిద్య క్లాసులు

హైదరాబాద్, వెలుగు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో దూరవిద్య క్లాసులు ఫిబ్రవరి 2 నుంచి 11వరకు జరుగుతాయని వర్సిటీ రిజిస్ట్రార్ అలేఖ్య పుంజాల చెప్పారు. డిప్లొమా, డిగ్రీ, పీజీల్లో మొదటి సంవత్సరం మినహా మిగతా విద్యార్థులందరికీ క్లాసులు జరుగుతాయన్నారు. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్ www.teluguuniversity.ac.in ద్వారా తెలుసుకోవచ్చాన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కేసు బుధవారానికి వాయిదా

హైదరాబాద్, వెలుగు: జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఫలితాల కేసు విచారణ బుధవారానికి వాయిదా పడింది. ఫలితాల్లో అక్రమాలు జరిగాయంటూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ అభినంద్‌కుమార్ షావలి కేసు వాయిదావేస్తూ ఉత్తర్వులిచ్చారు. తాము అనుమతి ఇచ్చేంతవరకు నియామకాలు చేపట్టవద్దని ఈ కేసులో ఇదివరకే హైకోర్టు తీర్పునిచ్చింది.

ఆర్ఆర్ఆర్ రెండో దశకు నేడు కేంద్రం ముద్ర?

హైదరాబాద్, వెలుగు:

- కేంద్ర రవాణా మంత్రితో రాష్ట్ర అధికారుల సమావేశం
- ఇప్పటికే తొలి దశ 152 కిలోమీటర్లకు ఆమోదం


రాష్ట్రప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఎక్స్‌ప్రెస్ హైవే రెండో దశకు మంగళవారం కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. ఈ విషయమై ఢిల్లీలో కేంద్ర రవాణా శాఖ, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులతో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ అధికారులు సమావేశం కానున్నారు. రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి సహా పలువురు అధికారులు కేంద్ర ఉన్నతాధికారులతో ప్రాజెక్టు రెండో దశపై చర్చిస్తారు. మిగతా ప్రాజెక్టును కేంద్రం ఆమోదిస్తే డీపీఆర్ పనులు మొదలవుతాయి. ఆర్ఆర్ఆర్ విషయమై కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీని సీఎం కేసీఆర్, ఎంపీలు, రోడ్లు భవనాల శాఖ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఇప్పటికే పలు మార్లు కలిశారు. రెండు దశలుగా 338 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఆర్ఆర్ఆర్‌లో 152 కిలోమీటర్లను కేంద్రం ఆమోదించి ఎన్‌హెచ్ 161ఏఏగా పేరు పెట్టింది. ప్రాజెక్టు వ్యయం రూ.11 వేల కోట్లు. భూ సేకరణకు రూ.2,500 కోట్లు ఖర్చు చేయనున్నారు.

ప్రాజెక్టు స్వరూపం

దశలు	రెండు
పొడవు	338కి.మీ
వెడల్పు	500 అడుగులు
లేన్లు	6
ఖర్చు	11 వేల కోట్లు
భూ సేకరణకు	2,500 కోట్లు
కాలపరిమితి	మూడేళ్లు
కలిసే హైవేలు	5
బైపాస్‌లు	15

ఏ ఊళ్లను కలుపుతూ వెళ్తోంది?

సంగారెడ్డి, తుప్రాన్, గజ్వేల్, జగదేవ్‌పూర్, భువనగిరి, చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, శంకరపల్లి, యాచారం, కడ్తాల్, షాద్‌నగర్, కంది



సేద్యానికి స్ట్రాటజీ ఏది?

ఇండియాకి ఇండిపెండెన్స్ వచ్చి 70 ఏళ్లు దాటింది. ఇప్పటివరకు 15 సార్లు లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. ఇన్నేళ్లలో జనం దాదాపు 4,000 మంది ఎంపీలను ఎన్నుకున్నారు. కానీ, వాళ్లల్లో ఒక్కరైనా చేయని ఒక గొప్ప పనిని ఫిరోజ్ వరుణ్ గాంధీ చేశారు. రైతులు, గ్రామీణుల కష్టాలకు, కన్నీళ్లకు కారణమేంటో తెలుసుకోవటానికి, ఆ బాధలు తీరే దారులను వెదకటానికి వందల రోజులు పనిచేశారు. వరుణ్ గాంధీ పడిన శ్రమ ఆయన రాసిన 'ఏ రూరల్ మ్యానిఫెస్టో' పుస్తకంలోని ప్రతి పేజీలోనూ కనిపిస్తోంది.

దేశానికి వెన్నెముకగా భావించే రైతన్నకు వ్యవసాయం తలకు మించిన భారంగా మారుతోంది. ఆ బరువును మోయలేక అన్నదాతల వెన్ను విరుగుతోంది. అనేక కారణాల వల్ల సాగు లాభదాయకం కాకపోవటం కర్షకుల పాలిట శాపమవుతోంది. కుటుంబాలను అప్పుల పాలు చేస్తోంది. పంట కోసం తెచ్చిన రుణాలకు వడ్డీలు కట్టలేక, అసలు తీర్చేదారిలేక వాళ్లు అర్ధంతరంగా బతుకు చాలిస్తున్నారు. అయితే వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతుల జీవితాలు ఇలా దారుణంగా మారటానికి మరో ముఖ్య కారణం ఉంది. అదే.. సాగు భూమి సారం తగ్గిపోతుండటం. దీన్ని గతంలో ఎవరూ అంతగా గుర్తించలేదు. బీజేపీ ఎంపీ ఫిరోజ్ వరుణ్ గాంధీ చేసిన స్టడీతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కాన్పూర్(యూపీ)లోని దక్షిణ ప్రాంతంలో పెద్ద ఎత్తున నేలలు నిస్సారంగా మారుతున్నా ఆఫీసర్లు, పాలకులు పట్టించుకోలేదు. సమస్య పరిష్కారం కావాలంటే ఆ భూముల్లో వరి పంటకు బదులు గోధుమలు, నూనె గింజలు; పప్పు, కాయ ధాన్యాలు; ఔషధ మొక్కలు సాగు చేయాలి. ఫలితంగా కరువును, వర్షాభావాన్ని తట్టుకోవటమే కాకుండా పంట ఉత్పత్తి వ్యయాన్నీ సగానికి తగ్గించొచ్చు.


వరుణ్ గాంధీ ఈ అధ్యయనం ఫలితాలను దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల్లోని 62 జిల్లాల్లో ఏడాది పాటు ఫాలోఅప్ చేశారు. ఇండియా భవిష్యత్తు ఇండస్ట్రియలైజేషన్ (పారిశ్రామికీకరణ), అర్బనైజేషన్ (పట్టణీకరణ)లో లేదని, వ్యవసాయంలోని అపార శక్తిని వాడుకోవటంలో ఉందనే అవగాహనకు వచ్చారు. సాగును బాగుచేయటానికి ప్రభుత్వం ఇచ్చే విలువైన డబ్బులు వేస్ట్ అవుతున్న పాలసీలకు ఎన్నో ఉదాహరణలను సేకరించారు. వరి, గోధుమ ప్లేస్‌లో పండ్లు, కూరగాయల మొక్కలు పెంచిన సేద్యకారులు ఆ ఉత్పత్తులను నిల్వచేసే సౌకర్యాల్లేక ఎంతగా నష్టపోయారో తెలుసుకున్నారు. ఈ అనుభవాలన్నింటికీ అక్షర రూపమిచ్చారు. ఇటీవల మార్కెట్‌లోకి వచ్చిన ఆ బుక్ పేరు 'ఏ రూరల్ మ్యానిఫెస్టో'. 'రియలైజింగ్ ఇండియాస్ ఫ్యూచర్ త్రూ హర్ విలేజెస్' అనేది ట్యాగ్ లైన్. రూప పబ్లికేషన్స్ వేసిన ఈ పుస్తకం దేశంలోని వ్యవసాయం స్థితిగతులను కళ్లకు కడుతోంది. మెజారిటీ ప్రజలకు తినటానికి మెతుకులను అందిస్తున్న ఈ రంగం ఇప్పుడు ఎంత దీనంగా ఉందో చదివిన ప్రతి ఒక్కరికీ అర్థమవుతుంది. పాలకులకు కనువిప్పు కలిగిస్తుంది. విద్యార్థులకు విలువైన సమాచారాన్ని అందిస్తుంది.

రోజువారీ పనులతో, బాధ్యతలతో క్షణం తీరికలేకుండా గడుపుతున్నవాళ్లకు ఇంత పెద్ద పుస్తకం చదవటం కుదరకపోవచ్చు. కానీ, వ్యవసాయ రంగంలో, గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిస్థితులపై పూర్తి పట్టు సాధించాలనుకునేవారికి ఈ బుక్ తిరుగులేని గ్రంథమని చెప్పొచ్చు. ఉత్తరప్రదేశ్‌లోని 22 జిల్లాల్లో రైతులను కలిసి, వారి అభిప్రాయాలను, అనుభవాలను తెలుసుకొని ఇందులో పొందుపరిచారు. ఈ మేరకు వరుణ్ గాంధీ ఒక ఆర్థికవేత్త సాయం కూడా తీసుకున్నారు. ఈ స్టడీ కోసం ఆయన స్వయంగా కోటి రూపాయలు వెచ్చించారు. దాతల నుంచి సేకరించిన మరో 27 కోట్లు ఖర్చుపెట్టారు. వరుణ్ గాంధీ తొలిసారి ఎంపీ అయిన రోజుల్లో (2009లో) రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా జరిగేవి. ఏటా 8-15 వేల మంది సుసైడ్ చేసుకునేవారు. ఆ సంఘటనలు ఆయన్ని కదిలించాయి. ఎంపీగా తనకు వచ్చే ప్రతి నెల వేతనాన్నీ బాధిత కుటుంబాలకు ఇచ్చేవారు. సాగుదారుల చావులకు ప్రధాన కారణం వాళ్ల కుటుంబాల్లోని బాధలు కాదని, వ్యవస్థలోని లోపాలేనని నిర్ధారణకు వచ్చారు. లోపాల మూలాలను గుర్తించటాన్ని బాధ్యతగా భావించారు.

– ప్రేమ్ శంకర్ ఝా, ఇండియన్ ఎకనామిస్ట్,
('ది వైర్' సౌజన్యంతో)

మైక్రో ఎకనామిక్స్‌పైనే ఫోకస్

795 పేజీలున్న ఈ బుక్‌లో ప్రతి పేజీ రైతుల కష్టాలకు, కన్నీళ్లకు అద్దం పడుతుంది. కంటెంట్‌ను 11 చాప్టర్లుగా డివైడ్ చేశారు. తొలి అధ్యాయం దాటక ముందే రీడర్లను కంటి తడి పెట్టిస్తుంది. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న 11 సంక్షోభాలకు 11 చాప్టర్లను కేటాయించారు. ఒక్కో చాప్టర్‌లో 60-80 పేజీలు



ఉన్నాయి. ఇండెక్సే 28 పేజీల్లో ఉంది. వరుణ్ గాంధీ తన దృష్టిని అగ్రికల్చర్‌లో మ్యాక్రోఎకనామిక్స్ మీద కాకుండా మైక్రో ఎకనామిక్స్‌పైన పెట్టారు. మిక్స్‌డ్ డేటా, అనాలసిస్‌లు, సమాంతర వివరణలు సంపూర్ణంగా ఉన్నాయి. అన్నదాతలకు అడుగడుగునా తలెత్తున్న సవాళ్లను తెలిపేందుకు ఒక్కో చాప్టర్‌లో రెండు డజన్ల వరకు వర్ణనలు ఉన్నాయి.

గత ఐదేళ్లుగా ఢిల్లీ కాంగ్రెస్ పార్టీలో తెరవెనకే ఉండిపోయిన మాజీ సీఎం షీలాదీక్షిత్ ఇప్పుడు తెరపైకి రావటంతో రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కేజ్రీవాల్ పార్టీతో ఎన్నికల పొత్తుకు ఆమె ఒప్పుకుంటారా? లేదా? అనేది సస్పెన్స్‌గా మారింది. అధిష్ఠానం ఒత్తిడి చేస్తే 'సై' అనాల్సిందే. షీలా దీక్షిత్‌తో రెండు విధాలుగా గట్టెక్కాలని హస్తం పార్టీ అనుకుంటోంది. ఆ విధంగా కాంగ్రెస్‌కి డబుల్ ధమాకా అవుతుందా? ఆమె మరోసారి చక్రం తిప్పుతారా?



'ఆప్'దే మొదలెట్టేశారు!!

హస్తంతో టై-అప్ అనేది ఢిల్లీతోపాటు హర్యానా, పంజాబ్‌ల్లోనూ ఉండాలని కేజ్రీవాల్ కోరుకుంటున్నారు. తమతో చేతులు కలిపేందుకు ఆయన చూపిన ఈ అత్యుత్సాహాన్ని ఢిల్లీ కాంగ్రెస్ తాజా మాజీ ప్రెసిడెంట్ అజయ్ మాకెన్ మొదట్లోనే అడ్డుకున్నారు. షీలా దీక్షిత్ కూడా కొన్ని సందర్భాల్లో ఇదే తరహాలో ప్రవర్తించారు. కర్ర విరగకుండా-పాము చావకుండా వ్యవహరించారు. రీఎంట్రీలో తన మార్క్ రాజకీయాన్ని వచ్చీరావటంతోనే మొదలెట్టేశారు. 'ఆప్‌తో పొత్తు'ను హైకమాండే నిర్ణయిస్తుందంటూ తెలివిగా తప్పుకున్నారు. ఆ పార్టీతో జోడీ కట్టడం ఆమెకు పర్సనల్‌గా ఇష్టం లేదని దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. షీలా దీక్షిత్ ఇలా అనటంపై ఆప్ అసహనం ప్రదర్శించింది.

డబుల్ ధమాకా!

ఢిల్లీ సీఎంగా 15 ఏళ్ల పాటు చక్రం తిప్పిన షీలా దీక్షిత్ రీ-ఎంట్రీ ఇచ్చారు. కాంగ్రెస్‌కి ఢిల్లీలో మిగిలిన పెద్ద దిక్కు ఆమె మాత్రమే. దాంతో దీక్షిత్‌ను పార్టీ హైకమాండ్ ఢిల్లీ యూనిట్ ప్రెసిడెంట్‌గా మళ్లీ ఛాన్సిచ్చింది. ఈ పదవిని చేపట్టడం ఇది రెండోసారి. 20 ఏళ్ల కిందట మొదటిసారి ఆమె పగ్గాలు చేపట్టినప్పుడు పరిస్థితి ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న టైంలోనే బాబ్రీ మసీదు కూల్చివేత జరిగిన నేపథ్యంలో 1996, 1998 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి పూర్తి మెజారిటీ రాక పవర్‌కి దూరమైంది. 1993 ఢిల్లీ అసెంబ్లీ ఎలక్షన్లలో, 1997 ఢిల్లీ మునిసిపల్ పోరులోనూ ఇదే ఫలితం ఎదురైంది. మైనారిటీలు ఈ గ్రాండ్ ఓల్డ్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. లోక్‌సభలో బీజేపీ సింగిల్ డిజిట్ స్థాయి నుంచి ప్రాంతీయ పార్టీలతో కూటమి కట్టి సర్కార్‌ను ఏర్పాటు చేసే లెవెల్‌కి ఎదిగింది.

ఇప్పుడు ఢిల్లీలో కాంగ్రెస్ పరిస్థితి రెండు దశాబ్దాల క్రితం మాదిరిగానే తయారైంది. హెచ్.కె.ఎల్.భగత్, జగదీశ్ టైట్లర్, సజ్జన్ కుమార్ వంటి పార్టీ నేతలేమో కోర్టుల కేసులతో సతమతమవుతున్నారు. సిక్కుల ఊచకోత కేసులో సజ్జన్ కుమార్‌కి ఏకంగా జీవిత ఖైదు పడింది. 2013 శాసనసభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చేతిలో ఓడిపోయిన హస్తం పార్టీ ప్రస్తుతం ఆ ఓటు బ్యాంకును తిరిగి రాబట్టుకోవటానికి పోరాడుతోంది. అప్పట్లో అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం పుణ్యమా అని ఆప్ అధికారంలోకి రాగలిగింది.

మరోవైపు ఢిల్లీ సిటీలో బీజేపీ పరిస్థితి 1990ల్లో ఉన్నంత రేంజ్‌లో ఇప్పుడు లేదు. అప్పట్లో 'అటల్-అద్వానీ'కి నగరంతో అనుబంధం ఉండేది. మదన్‌లాల్ ఖురానా, సాహిబ్ సింగ్ వర్మ వంటి స్ట్రాంగ్ లీడర్లు లోకల్ యూనిట్‌లో డామినేటెడ్‌గా ఉండేవారు. ఢిల్లీ గల్లీల్లోకి పార్టీని తీసుకెళ్లారు.


ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న మూడ్‌ని బట్టి చూస్తే ఢిల్లీలో కాంగ్రెస్‌కి విజయావకాశాలు ఉన్నాయనే చెప్పొచ్చు. ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీలు, ముస్లింలు ఆప్ నుంచి హస్తం వైపునకు మొగ్గు చూపుతున్నారు. కాంగ్రెస్ ఢిల్లీ శాఖలో ముగ్గురు వర్కింగ్ ప్రెసిడెంట్లు దేవేందర్ యాదవ్, రాజేష్ లిలోథియా, హరూన్



యూసుఫ్ ఈ మూడు కమ్యూనిటీలకు చెందినవారు. షీలా దీక్షిత్‌కి కూడా అర్బన్ మిడిల్ క్లాస్‌లో, పూర్వాంచల్ జనంలో, సిక్కుల్లో మంచి పేరే ఉంది. ఆమె స్వయంగా ఒక సిక్కు ఆర్మీ ఆఫీసర్ కూతురు. షీలా దీక్షిత్ తండ్రి ఉత్తరప్రదేశ్‌లోని పేరొందిన ఒక బ్రాహ్మణ కుటుంబానికి అల్లుడు. వీటన్నింటికీతోడు ఆమె వరుసగా 15 ఏళ్ల పాటు ఢిల్లీ సీఎంగా ఉన్నప్పుడు గుడ్ గవర్నెన్స్‌ని అందించారు. ఇవన్నీ షీలా దీక్షిత్‌కి బాగా కలిసొచ్చే అంశాలు. అయితే, నేషనల్ క్యాపిటల్‌లో హస్తం పార్టీ తిరిగి అధికారంలోకి రావటం అనుకున్నంత ఈజీయేనా అంటే 'ఎస్' అని ఠక్కున ఆన్సర్ ఇవ్వలేని పరిస్థితికూడా ఉంది. ఆమె రీఎంట్రీని పార్టీలో కొందరు వ్యతిరేకిస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో రీజనల్ పార్టీలతో జట్టు కట్టడం ద్వారా సెంటర్‌లో మళ్లీ పవర్‌లోకి రావాలనుకుంటున్న ప్రయత్నాలకు షీలా దీక్షిత్ ఆటంకంగా మారతారేమో అనే డౌట్లూ నెలకొన్నాయి. ఈ ప్లాన్లలో భాగంగా ఢిల్లీలో ఆప్‌తో అలయెన్స్ తప్పనిసరి కానుంది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ టీంతో కలిసి నడవటం ఆమెకు వ్యక్తిగతంగా ఇష్టమున్నా లేకున్నా పార్టీ పరంగా అంగీకరించక తప్పదు. నేరమైనా, భారమైనా ఆమె పనిచేయాల్సి ఉంటుంది. పంజాబ్‌లో ఆప్‌తో కొయిలేషన్‌కి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ ఇప్పటికే ససేమిరా అనేశారు.

2015లో కేజ్రీవాల్ పార్టీ గెలవటానికి ముస్లింల, సిక్కుల, ఎస్సీ, ఎస్టీల వ్యూహాత్మక ఓటింగే కారణమని చెప్పొచ్చు. ఆ ఎలక్షన్లలో కాంగ్రెస్, ఆప్‌ల మధ్య ఓట్ల వాటాలో తేడా 40 శాతం పైనే ఉంది. 2017 మునిసిపల్ ఎన్నికలకు వచ్చేటప్పటికి ఐదు శాతానికి తగ్గింది. అసెంబ్లీ ఉప ఎన్నికల్లో హస్తందే పైచేయి అయ్యింది. 2019 లోక్‌సభ ఎలక్షన్లలో ముస్లింల ఓట్లు తమకు పడకపోయినా తమతో పొత్తు పెట్టుకుంటే కాంగ్రెస్‌కి పడొచ్చని ఆప్ అంచనా వేస్తోంది. తద్వారా బీజేపీ లాభపడకుండా చూడొచ్చని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పాలిటిక్స్‌లోకి షీలాదీక్షిత్ ఎంటర్ కావటం కాంగ్రెస్‌కు రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కీలకం. అదే సమయంలో 2020లో రాష్ట్ర శాసనసభ ఎలక్షన్లలో కేజ్రీవాల్ కోల్పోయే ఓట్లను తాను పొందొచ్చనే ముందుచూపునూ హస్తం పార్టీ ప్రదర్శిస్తోంది.

ఏమన్నారంటే



పొలిటికల్ క్లీనింగ్

తమిళనాడులో రాజకీయాల్ని తక్షణం ప్రక్షాళన జరపాలి. ప్రధానిని తమిళ యువత గోబ్యాక్ అంది. దీనిపై మోడీయే సమీక్షించుకోవాలి.

– కమల్ హాసన్, తమిళ నటుడు



బీజేపీకోసం చూడం

వచ్చే లోక్‌సభ ఎలక్షన్‌లో సీట్ల పంపకాలపై బీజేపీ ఎలాంటి ప్రతిపాదన చేయలేదు. మేము వాళ్ల ప్రపోజల్స్‌కోసం ఎదురు చూసేది లేదు.

– సంజయ్ రౌత్, శివసేన ఎంపీ



కొందరేనా భారత రత్నలు!

'భారత రత్న' కొందరికే దక్కుతోంది. ఈ అవార్డు అందుకున్నవాళ్లలో దళితులు, ఆదివాసీలు, ముస్లింలు, పేదలు ఎంతమంది ఉన్నారో కేంద్రం చెప్పాలి.

– అసదుద్దీన్ ఒవైసీ, హైదరాబాద్ ఎంపీ

వెనెజులా.. ఒకప్పుడు గొప్పగా బతికిన దేశం. ప్రపంచంలోనే భారీగా ఆయిల్ నిక్షేపాలున్నది కూడా అక్కడే. ఆయిల్, బంగారం ఎగుమతుల వల్ల వచ్చిన ఆదాయంతో ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేసేవి. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి, ఆహార నిల్వలు తగ్గిపోయాయి. జనం కూటికోసం పడిగాపులు పడుతున్నారు. అసలీ పరిస్థితికి కారణం ఎవరు?



అసలు విలన్ ఎవరు?

అంతర్జాతీయంగా చమురు ధరలు బాగున్న కాలంలో వెనెజులా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌పై దృష్టిపెట్టింది. అందుకోసం చైనా, రష్యాలాంటి మిత్రదేశాల నుంచి పెద్ద ఎత్తున అప్పులు తీసుకుంది. 2013 తర్వాత తలెత్తిన చమురు సంక్షోభంతో ఆయిల్ ధరలు అమాంతం పడిపోయాయి. ఇది వెనెజులా ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేసింది. ఆ దేశంలో పేరుకు విస్తారంగా ఆయిల్ నిక్షేపాలున్నా, వెలికితీత ఖర్చులు చాలా ఎక్కువ. ఇంటర్నేషనల్ మార్కెట్‌లో బ్యారెల్ చమురు ధర 100 డాలర్లకు దగ్గరగా ఉంటేగానీ వెనెజులాకు వర్క్‌అవుట్ కాదు. ప్రస్తుతం ఆ ధర 52 డాలర్లకు పడిపోయింది. ఖజానాలో డబ్బులు లేక ప్రభుత్వం సంక్షేమ పథకాలపై కోతలు విధించింది. విదేశాల నుంచి తీసుకున్న అప్పులకు కనీసం వడ్డీలు కూడా చెల్లించలేని స్థితికి దిగజారిపోయింది. దీపం ఉన్నప్పుడే దేశాన్ని చక్కబెట్టాల్సింది పోయి, సంక్షేమ పథకాలపైన మాత్రమే ఫోకస్ పెట్టడం అక్కడి పాలకుల వైఫల్యమనే చెప్పాలి. 2013లో హ్యూగో చావేజ్ చనిపోయేనాటికే వెనెజులా పతనం అంచుకు చేరింది. చావేజ్ వారసుడిగా పగ్గాలు చేపట్టిన నికోలస్ మదురో పాత విధానాలను కొనసాగించాలని చూశారే తప్ప వ్యవస్థను మార్చడానికి ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు.

2015 నాటికి వెనెజులా ప్రధాన ఆదాయ వనరైన ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు కంపెనీ పెట్రోలియం ఆఫ్ వెనెజులాకి రాబడులు ఇంకా తగ్గిపోయాయి. జీతాల చెల్లింపుల కోసం నిధులు వెతుక్కోవాల్సిన పరిస్థితిలో ఎగవేతదారుగా మారి కుప్పకూలింది. తిండి దొరక్క జనం ఇప్పటికీ విలవిలలాడుతున్నారు. ఉపాధి లేక లక్షల మంది ఇతర దేశాలకు వలస వెళ్లిపోతున్నారు. ఎగుమతులు పూర్తిగా తగ్గిపోవడంతో ఆహారం, మందుల కొరత ఏర్పడింది. ద్రవ్యోల్బణం భారీగా పెరిగిపోయింది. కరెన్సీకి విలువ లేకుండా పోయింది. ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవాలనుకున్న ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధపడ్డాయి. ప్రెసిడెంట్ మదురో గద్దె దిగితేగానీ దేశం బాగుపడదంటూ అక్కడి ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలకు దిగాయి. నిరసనలను అణిచేసే క్రమంలో మదురో నియంతలా వ్యవహరించారు. నిరసనకారులపై పోలీసు కాల్పులు రోజువారీగా మారాయి.

గుయిడోకి గుర్తింపు

గతవారం అత్యవసరంగా సమావేశమైన నేషనల్ అసెంబ్లీ.. గుయిడోను లీడర్‌గా ఎన్నుకుంది. తనను తాత్కాలిక అధ్యక్షుడిగా గుర్తించామంటూ ప్రజల్ని, సైన్యాన్ని, అంతర్జాతీయ సమాజాన్ని కోరాడు. పక్షపాతరహితంగా ఎన్నికలు జరిపిస్తాననీ మాటిచ్చాడు. అమెరికా ఏ మాత్రం ఆలస్యం చేయకుండా గుయిడోను అధ్యక్షుడిగా గుర్తించింది. కెనడా, యూరప్ దేశాలు, లాటిన్ అమెరికాలోని క్యూబా, మెక్సికో, బొలివియా తప్ప మిగతా దేశాలన్నీ గుయిడోకే మద్దతు ప్రకటించాయి. చైనా, రష్యాలు మాత్రం వెనెజులా రాజకీయ సంక్షోభాన్ని అమెరికా ఆడిస్తున్న నాటకంగా అభివర్ణిస్తూ, మదురో వైపే ఉంటామన్నాయి.

గతేడాది జరిగిన ఎన్నికల్లో పాల్గొనకుండా ప్రతిపక్ష పార్టీలపై నిషేధం విధించారు మదురో. ఎన్నికలు జరిపే తీరులో పారదర్శకత లేనందున వాటిని బహిష్కరిస్తున్నట్లు ప్రతిపక్ష పార్టీలు చెప్పాయి. మొత్తానికి ఏకపక్షంగా సాగిన ఎన్నికల్లో మదురో రెండోసారి దేశాధ్యక్షుడయ్యారు. ఎన్నికల తర్వాత కూడా నిర్బంధం కొనసాగింది. ప్రతిపక్ష నాయకులు చాలా మందిని అరెస్టు చేసి జైల్లో పడేశారు. ప్రాణభయంతో ఇంకొంత మంది ప్రతిపక్ష నేతలు దేశం విడిచి పారిపోయారు. దేశంలోనే ఉండి పోరాడుతున్నవారిలో ఒకడు, పాపులర్ విల్ పార్టీ నాయకుడైన జువాన్ గుయిడో.. తనను తాను వెనెజులా అధ్యక్షుడిగా ప్రకటించుకుని సంచలనానికి తెర లేపాడు.

అమెరికా చర్యను తీవ్రంగా పరిగణించిన మదురో.. వెనెజులాలోని అమెరికా రాయబారులు తక్షణమే దేశం విడిచి వెళ్లిపోవాలని హుకుం జారీచేశారు. ఒక దశలో వెనెజులాపై అమెరికా సైనిక చర్యకు దిగుతుందేమోననే భావన వ్యక్తమైనా, చివరికి మదురోనే వెనక్కి తగ్గి అమెరికన్ రాయబారులు వెనెజులాలో ఉండొచ్చని చెప్పారు. మదురో ప్రకటన వెలువడిన కొద్ది గంటలకే ఇంకో ట్విస్ట్ చోటుచేసుకుంది. గుయిడో సూచించిన కార్లోస్ అల్‌ఫ్రెడోనో(ఇతను కూడా ప్రతిపక్ష పార్టీ నాయకుడే) వెనెజులా రాయబారిగా అమెరికా నియమించింది. ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు మదురో చేయబోయే ప్రయత్నాలను అడ్డుకోడానికే ఈ నియామకం జరిగిందన్నది కాదనలేని నిజం. మదురో ప్రభుత్వ వైఫల్యం పట్ల జనం సంతృప్తిగా లేనట్లే గుయిడో చేస్తోన్న పోరాటానికి కూడా పెద్దగా సానుభూతి లేదు. ఇక వెనెజులా భవితవ్యం కాలమే నిర్ణయిస్తుంది.

శాటిలైట్ చూపించేదంతా
అడవి కాదు!

అడవుల ధ్వంసం, సామాజిక వనాల పెంపకంలో చాలా అశ్రద్ధ ఉంది. దీని ఫలితంగా అపారమైన నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. అడవుల వినాశనంతో ప్రకృతి వ్యవస్థలు దెబ్బ తిని, అకాల వర్షాలు, వరదలు వంటివి సంభవిస్తున్నాయి. అడవుల పెంపు లక్ష్యంగా 1950 నుంచి వనమహోత్సవం జరుగుతోంది. అప్పటి కేంద్ర వ్యవసాయ, ఆహార శాఖ మంత్రి డాక్టర్ కె.ఎన్.మున్షీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ఏటా ఫారెస్ట్ డిపార్టుమెంట్ నిర్వహిస్తోంది. మొక్కలు నాటడంపై చూపుతున్న ఆసక్తిని, వాటిని పెంచడంలో, పరిరక్షించడంలో కనబరచడం లేదు. ఈ నిర్లక్ష్యంవల్ల పచ్చని అడవులకు కోత తప్పడం లేదు.

ఎన్విరాన్‌మెంటల్ మినిస్ట్రీ పరిధిలోని జాతీయ అటవీ సర్వే సంస్థ 1987 నుంచి రెండేళ్లకొకసారి శాటిలైట్ ఫొటోల ద్వారా గుర్తింపు సాగిస్తోంది. ఇటీవల ఈ సంస్థ విడుదల చేసిన ఫారెస్ట్రీ రిపోర్టు-2017 ప్రకారం దేశవ్యాప్తంగా 21 శాతం భూభాగంలో 7 లక్షలకు పైగా చదరపు కి.మీ. విస్తీర్ణంలో అడవులు ఉన్నాయి. ఈ లెక్కలపై పర్యావరణవాదుల్లో సందేహాలున్నాయి. భూమిపైన పచ్చగా కనిపించేదంతా అడవిగానే శాటిలైట్ పరిగణిస్తోంది. ఈ పొరబాటువల్ల వాస్తవ పరిస్థితి తెలియడం లేదు. భూ వినియోగం, యాజమాన్య హక్కు, అలాగే ఆ భూమి ఎవరికి చెందినది అనే విషయాలేమీ పట్టించుకోవడం లేదు. హెక్టారు భూమిలో 10 శాతం మించి పచ్చదనం ఉన్నట్టయితే దానిని అడవిగా నేషనల్ ఫారెస్టు సర్వే సంస్థ లెక్కలోకి తీసుకుంటోంది.

అటవీ చట్టం ప్రకారం ఫారెస్టు డిపార్టుమెంట్ ప్రకటించిన రిజర్వు ఫారెస్టుని, నోటిఫైడ్ ఫారెస్టుని మాత్రమే అడవులుగా పరిగణిస్తున్నారు. ఈ లెక్కన సర్వే సంస్థ చూపించే 21 శాతం ప్రాంతాన్ని పూర్తిగా ఫారెస్టుగా పరిగణించలేం. వాన నీటిని ఒడిసి పట్టడానికి ప్రకృతి ప్రసాదించిన గొప్ప సాధనాలు అడవులు. వీటి ప్రభావం ఒండ్రు మట్టితో కలగలిసిన ప్రాంతాల్లో భూమి పైభాగం కంటే లోలోపలనే అధికంగా ఉంటుంది. పెద్ద వృక్షాలతోపాటు, ఒక మాదిరి పెద్ద చెట్ల వేర్లు చొచ్చుకుపోతాయి. వర్షపు నీటిని నేలపై మట్టిపొరల ద్వారా తీసుకొని భూగర్భ జలాల అభివృద్ధికి దోహదపడతాయి.

అయితే, ఏళ్ళ తరబడి అడవుల పరిరక్షణలో కొనసాగిన నిర్లక్ష్యం మూలంగా దేశంలోని ఫారెస్టు వ్యవస్థలు బండబారిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కొరవడటం మరో ప్రధానలోపం. అడవుల పెంపకానికి కేంద్రం సహా పలు రాష్ట్రాలు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాయి. హరితహారం పేరుతో తెలంగాణ ప్రభుత్వం 'హరిత సైన్యం' ఏర్పాటు చేసింది. సమగ్ర అటవీ విధానంతో పాటుగా దాన్ని అమలు చేయడానికి చిత్తశుద్ధి, తగినన్ని నిధుల కేటాయింపు అవసరం. ఫారెస్టు యాక్ట్‌ని పకడ్బందీగా అమలు చేయాలి. అడవుల పెంపకంలో అనాదిగా లోకల్ భాగస్వామ్యం కీలక పాత్ర వహిస్తోంది. కాబట్టి స్థానిక ప్రజల భాగస్వామ్యం పెంచితే సత్ఫలితాలు సమకూరుతాయి.



శ్రీనివాస్ చిరిపోతుల
తెలంగాణ సామాజిక రచయితల సంఘం

మీరూ రాయొచ్చు!
సమాజాన్ని ప్రభావితం చేసే వేర్వేరు అంశాలమీద మీ అభిప్రాయాలను ఆర్టికల్ రూపంలో పంపవచ్చు. openpage@v6velugu.com



రాశి... చాలా బిజీ

నటిగా మొదట బాలీవుడ్ లో అడుగుపెట్టినా... ఎక్కువగా తెలుగు సినిమాలే చేసింది రాశీఖన్నా. విలన్' చిత్రంతో మలయాళంలోకి కూడా అడుగు పెట్టింది. మోహన్ లాల్ హీరోగా నటించిన ఈ చిత్రంతో సక్సెస్ ను ఖాతాలో వేసుకుంది. అయితే 'శ్రీనివాస కళ్యాణం' పెద్దగా విజయం సాధించకపోవడంతో తెలుగులో సినిమాలు తగ్గించింది. తమిళంలో మాత్రం చాలా బిజీగా ఉంది. విశాల్ హీరోగా తెరకెక్కుతోన్న 'టెంపర్' రీమేక్ 'అయోగ్య'లో రాశీయే హీరోయిన్. సిద్ధార్థ్ హీరోగా కార్తీక్ జి.క్రిష్ దర్శకత్వం వహిస్తోన్న యాక్షన్ కామెడీ చిత్రం 'సైతాన్ కె బచ్చా'లోనూ నటిస్తోంది. తాజాగా విజయ్ సేతుపతి సినిమాకి కూడా ఎంపికైంది. నివేద పేతురాజ్ కూడా నటించే ఆ లవ్‌స్టోరీలో రాశి పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుందట. ఇలా వరుస తమిళ సినిమాలతో బిజీగా ఉన్న రాశి... తెలుగులో క్రాంతిమాధవ్ డైరెక్షన్లో విజయ్ దేవరకొండ సరసన నటిస్తోంది. మొత్తంగా ఈ నార్త్ బ్యూటీ సౌత్ మొత్తం తిరుగుతూ తన టాలెంట్ ప్రూవ్ చేసుకుంటోంది.



త్రీ ఖాన్స్ న్యూ ప్లాన్స్

బాలీవుడ్‌కి మూల స్తంభాలు ముగ్గురు ఖాన్స్. మాస్ ఫాలోయింగ్‌తో సల్మాన్... యూత్ అండ్ ఫ్యామిలీ ఫాలోయింగ్‌తో షారుఖ్... ఎక్స్‌పెరిమెంటల్ మూవీస్‌తో ఆమిర్... ముగ్గురూ బాలీవుడ్ సినిమాని సగర్వంగా తలెత్తుకునేలా చేశారు. అయితే పోయినేడు ఈ ముగ్గురికీ చాలా పెద్ద షాక్ తగిలింది. ముగ్గురూ డిజాస్టర్స్ చవిచూశారు. దాంతో ఈ యేడు వీళ్లేం చేస్తారా అనే డిస్కషన్ నడుస్తోంది. సల్మాన్ మార్కెట్‌కి ఢోకా లేదు. భారత్, దబాంగ్ 3 చేస్తున్నాడు. ఆ తర్వాత బ్లాక్ బస్టర్లకు కేరాఫ్ అడ్రస్ అయిన రోహిత్ శెట్టితో ఒక సినిమా లైన్లో ఉంది. అందులో సల్లూభాయ్ పోలీసాఫీసరుగా కనిపిస్తాడట. ఇక ఆమిర్ సంగతి. ఒక ప్రయోగం బెడిసికొట్టినా మరొకదానితో ప్రూవ్ చేస్తానని కాన్ఫిడెంట్‌గా ఉన్నాడు. ఆ ప్రయోగం అతడి బయోపిక్ కావొచ్చని అంచనా. రీసెంట్‌గా ఓ ఈవెంట్‌లో తన బయోపిక్ టాపిక్ తెచ్చాడు. తీస్తున్నారా అంటే ఎస్ అనలేదు కానీ... 'నా బయోపిక్‌కి బెస్ట్ చాయిస్ నా కొడుకే అనుకుంటున్నాను, వాడైతేనే దానికి న్యాయం చేయగలడు' అన్నాడు. ఆమిర్ కొడుకు జునైద్ యాక్టింగ్ కోర్స్ చేశాడు. చాలా నాటకాల్లో నటించాడు. త్వరలో సినిమాల్లోకి రాబోతున్నాడు. ఇప్పుడు ఆమిర్ మాటల్ని బట్టి తన కొడుకుతో బయోపిక్ ప్లాన్ చేస్తున్నాడంటున్నారు బాలీవుడ్ జనాలు. ఇక పోతే షారుఖ్ పరిస్థితి మాత్రం కాస్త ఇబ్బందికరంగానే ఉంది. వరుస పరాజయాలతో కింగ్ ఖాన్ మార్కెట్ పూర్తిగా డల్ అయ్యింది. దాంతో అతడు నటనకు కాస్త గ్యాప్ ఇచ్చి, పూర్తిగా ఐపీఎల్ మీదే దృష్టి పెట్టాలనుకుంటున్నాడట. కానీ ఎప్పటి నుంచో అనుకుంటోన్న 'డాన్ 3'ని మాత్రం ఈ యేడు చేసెయ్యాలనుకుంటున్నాడట. ఆల్రెడీ ఫర్హాన్ అక్తర్ ఆ ఏర్పాట్లలోనే ఉన్నాడు. ఆ సినిమా ఒక్కటీ ఈ సంవత్సరం చేసి, దాని రిజల్టుని బట్టి తర్వాతేం చేయాలా అని ఆలోచిస్తాడట షారుఖ్. ఇవీ ముగ్గురు ఖాన్ల ప్లాన్లు. మరి వీటిలో ఏవి ఆచరణలోకి వెళ్తాయో, ఏవి ఆలోచనల దగ్గరే ఆగిపోతాయో చూడాలి.



తన సాహిత్యంతో తెలుగు సినిమా పాటకు గౌరవాన్ని తీసుకొచ్చారు సిరివెన్నెల సీతారామశాస్త్రి. అందుకుగాను ఆయనను పద్మశ్రీ పురస్కారం వరించింది. ఆ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి స్వయంగా సిరివెన్నెలని కలిసి అభినందించారు.

డబ్బు కోసం కాదు



మమ్ముట్టి హీరోగా తమిళ దర్శకుడు రామ్ తెరకెక్కించిన చిత్రం 'పెరంబు'. అంజలి కథానాయికగా నటిస్తోన్న ఈ చిత్రంలో ట్రాన్స్‌జెండర్ అంజలి అమీర్ కీలక పాత్రను పోషించింది. సముతిర ఖని మరో పాత్రలో నటించారు. ఇప్పటికే పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమైన ఈ చిత్రం ఫిబ్రవరి 1న తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. యువన్ శంకర్ రాజా సంగీత దర్శకుడు. మమ్ముట్టిని దృష్టిలో ఉంచుకుని ఈ కథ రాసుకున్న దర్శకుడు.. డేట్స్ కోసం చాలా కాలం ఎదురుచూసి మరీ ఆయనతోనే ఈ సినిమా చేశాడు. ఎవరూ టచ్ చేయని వైవిధ్యమైన అంశంతో ఈ సినిమా ఉండనుందని చెపుతున్నారు. మమ్ముట్టి వంటి సూపర్‌స్టార్ ఈ సినిమాకి ఒక్క రూపాయి కూడా పారితోషికం తీసుకోకుండా నటించడం విశేషం. ఇటీవల ఈ విషయాన్ని నిర్మాత పి.ఎల్.తేనప్పన్ వెల్లడించారు. ఇంతకూ రెమ్యునరేషన్ ఎందుకు వద్దన్నారని మమ్ముట్టిని అడిగితే.. 'ప్రతి సినిమానీ డబ్బు కోసమే చేయలేం, అన్నిటినీ డబ్బుతో ముడి పెట్టలేం' అని సమాధానమిచ్చారట. తనకు నటుడిగా సంతృప్తినిచ్చే చిత్రం కావడం వల్లే ఆయన పారితోషికం వద్దన్నారని అర్థమవుతోంది. కథతోనే మమ్ముట్టి మనసు గెలుచుకున్న ఈ చిత్రం ప్రేక్షకుల ప్రశంసలు కూడా అందుకుంటుందేమో చూడాలి.

ఇస్మార్ట్ గాళ్


ఎనర్జిటిక్ హీరో రామ్‌తో పూరి జగన్నాథ్ 'ఇస్మార్ట్ శంకర్' మూవీ మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను పూరితో కలిసి చార్మి నిర్మిస్తోంది. ఈ సినిమా కోసం నిధి అగర్వాల్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. ఇప్పటికే సవ్యసాచి, మిస్టర్ మజ్ను చిత్రాలతో తెలుగువారికి చేరువయ్యింది నిధి. గత కొంత కాలంగా పూరి జగన్నాథ్ ఖాతాలో ఒక్క హిట్ కూడా పడలేదు. రామ్ కెరీర్ కూడా ప్రస్తుతం కాస్త డల్‌గానే ఉంది. గత రెండు చిత్రాల పరాజయంతో నిధి కూడా నిరాశ చెందింది. సో... ఈ చిత్రం ఇప్పుడు ముగ్గురికీ కీలకమేనన్నమాట.





ఆన్‌లైన్ క్వీన్

తెలుగులో సక్సెస్ అయిన హీరోయిన్లు బాలీవుడ్ వైపు అడుగులేస్తుంటారు. కొందరికి కాస్తో కూస్తో కలిసొచ్చినా, కొందరు మాత్రం నిలదొక్కుకోలేక వెనక్కి వచ్చేస్తుంటారు. తాప్సీ మాత్రం నక్క తోక తొక్కి బాలీవుడ్ వెళ్లింది. ఇక్కడ అంతంతమాత్రంగా ఉన్న కెరీర్... అక్కడ జెట్ వేగంతో దూసుకుపోతోంది. పింక్, ముల్క్, మన్‌మర్జియా అంటూ సక్సెస్‌ఫుల్‌గా సాగిపోతోంది. అందుకే ఆమెను బాలీవుడ్ బెస్ట్ యాక్ట్రెస్‌గా సెలెక్ట్ చేశారు నెటిజన్స్. యేటా సినీ రంగంలోని వారికి ఎఫ్‌వోఐ ఆన్‌లైన్ అవార్డుల్ని ప్రకటిస్తారు. నామినేట్ అయిన వారిలో బెస్ట్ ఎవరో ఎంపిక చేసే బాధ్యత నెటిజన్స్‌దే. ఈసారి వాళ్లు 'మన్‌మర్జియా'కిగాను తాప్సీకి అవార్డు ఇవ్వాలని డిసైడ్ చేశారు. దాంతో ఆనందంతో పొంగిపోతోంది తాప్సీ.



మార్చిలో కోలీవుడ్‌కి...

అమితాబ్ నటిస్తున్నారంటే ఆ సినిమాకో ప్రత్యేకత ఉంటుంది. ఆయన చేస్తే ఆ పాత్రపై అంచనాలూ పెరుగుతాయి. 'సైరా నరసింహారెడ్డి'కి గురువుగా ఆయన అద్భుతమైన పర్‌ఫార్మెన్సును చూడాలని ఇప్పటికే తెలుగు ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. అంతలోనే తమిళ ప్రేక్షకులకీ తన నటనా పటిమను చూపడానికి సిద్ధపడుతున్నారు అమితాబ్. ఎస్.జె.సూర్య హీరోగా నటించనున్న 'ఉయరాంధ మనిధన్' సినిమాలో బిగ్ బీ ఓ ముఖ్య పాత్ర పోషించనున్నారు. దీని కోసం ఆయన నలభై రోజుల కాల్షీటు ఇచ్చారని... తమిళం, తెలుగు, హిందీ భాషల్లో రిలీజయ్యే ఈ సినిమా షూటింగ్ మార్చి 20న ప్రారంభం కానుందని తాజాగా ప్రకటించాడు సూర్య.

వల్లభుడి కళలెన్నో

'సుబ్రహ్మణ్యపురం' నిర్మాత బీరం సుధాకర్ రెడ్డి సమర్పణలో సింహ ఫిలింస్, దీపాల ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'సకల కళా వల్లభుడు'. తనిష్క్ రెడ్డి,మేఘ్లా ముక్తా హీరో హీరోయిన్లు. శివగణేష్ దర్శకత్వం వహించారు.ఈ చిత్రం ఫిబ్రవరి 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "ఇది అవుట్ అండ్ అవుట్ యాక్షన్, కామెడీ ఎంటర్ టైనర్. హీరో పెర్ఫార్మెన్స్, కథ, కథనాలు హైలైట్‌గా నిలుస్తాయి. ఇంటర్వెల్ సన్నివేశం ఉత్కంఠ రేపుతుంది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రధాన ఆకర్షణ" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఒక హిట్ చిత్రానికి కావలసిన ఎలిమెంట్స్ అన్నీ కుదిరాయి. పృథ్వీ, జీవాల కామెడీ సన్నివేశాలు అలరిస్తాయి. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌లో పృథ్వీ మేనరిజానికి మంచి రెస్పాన్స్ వచ్చింది" అన్నారు.




ట్విటర్ టాక్



"ఓపక్క మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన వీర జవానుల త్యాగం గురించి మాట్లాడుకుంటున్నాం. మరోపక్క ఒక పాఠశాలలో నలభై రెండేళ్ల టీచర్ ఒక స్టూడెంట్‌ని రేప్ చేసిన వార్త వింటున్నాం. ఇలా ఎందుకు జరుగుతోందన్న ప్రశ్న నన్ను చంపేస్తోంది. బడిలో కేవలం టెక్స్ట్ బుక్స్ మాత్రమే ఉంటే చాలదు. ఒక సురక్షితమైన వాతావరణం కూడా ఉండాలి."

– పూనమ్ కౌర్


ఈవెంట్



భారత ప్రధాని నరేంద్ర మోడీ బయోపిక్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. వివేక్ ఒబెరాయ్ మోడీ పాత్ర పోషిస్తున్నాడు. ఒమంగ్ కుమార్ దర్శకుడు. ఈ చిత్ర షూటింగ్ ముంబైలో ప్రారంభమైంది. ఆ సందర్భంగా తీసిన ఫొటో.

గప్‌చుప్

'ఎఫ్ 2' విజయం వెంకటేష్ డిమాండ్‌ని మరింత పెంచేసింది. ఆయన కోసం చాలామంది దర్శకులు కథలు అల్లే పనిలో ఉన్నారట. వెంకీ మాత్రం తన తర్వాతి సినిమా త్రివిక్రమ్‌తో చేయబోతున్నారని టాలీవుడ్ టాక్. గతంలోనే అతనితో చేయాల్సి ఉందని, కథ కోసం వెయిట్ చేస్తున్నానని ఓ సందర్భంలో వెంకీ చెప్పారు. ఇప్పుడు త్రివిక్రమ్ కథ రెడీ చేశాడని, బన్నీ సినిమా అయ్యాక మొదలు పెడతాడని అంటున్నారు. అయితే ఆల్రెడీ చిరంజీవి, త్రివిక్రమ్‌ల సినిమా ప్రకటించారు. ఏది ముందు మొదలవుతుందో.



ఫొటో ఫీస్ట్

మనసును అర్థం చేసుకున్న మనిషితో కాపురం మల్లెలపై నడిచినట్టు ఉంటుంది అంటున్నారు అనిల్ కపూర్. తాను ప్రేమించి పెళ్లాడిన సునీత అంటే ఆయనకు ప్రాణం. జీవితంలో తాను కలిసిన మహిళలందరిలోకీ ఆమె ప్రత్యేకం అంటూ తన భార్యతో రీసెంట్‌గా తీసుకున్న ఈ ఫొటోని పోస్ట్ చేశారు అనిల్.



నెక్ గుడ్ల ధరలు (100కు)

	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.395	రూ.4.55
వరంగల్	రూ.397	రూ.4.55

సెన్సెక్స్ ↓ 368 — 35,657

నిఫ్టీ ↓ 119 — 10,661

ఇంజనీరింగ్ విద్యార్థులకు విప్రో గుడ్ న్యూస్

క్యాంపస్ నియామకాలు రెట్టింపు



క్లయింట్స్ నుంచి వస్తోన్న కొత్త ఆర్డర్లే కారణం

17 శాతానికి పైగా అట్రిషన్

బెంగళూరు : ఇంజనీరింగ్ విద్యార్థులకు గుడ్ న్యూస్. దేశంలో నాలుగో అతిపెద్ద ఐటీ కంపెనీ అయిన విప్రో ఈ ఏడాది క్యాంపస్ నియామకాలను పెంచుతోంది. గత కొన్నేళ్లుగా నియామకాల విషయంలో కాస్త ఆచితూచి వ్యవహరిస్తోన్న విప్రో, ఈ ఏడాది క్యాంపస్ నియామకాలను రెండింతలు చేపట్టాలని నిర్ణయించింది. క్లయింట్స్ నుంచి వస్తున్న కొత్త ఆర్డర్లు, హై అట్రిషన్ వల్ల ఉద్యోగుల కొరత కారణాలతో విప్రో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం గత మూడు క్వార్టర్లలో విప్రో అత్యధికంగా 17 శాతానికి పైగా అట్రిషన్(ఉద్యోగుల వలసలు)రేటును నమోదు చేసింది. గత కొన్నేళ్ల నుంచి కూడా విప్రో పెద్దగా ఎలాంటి క్యాంపస్ నియామకాలు చేపట్టలేదు. ఆటోమేషన్, స్తబ్ధుగా ఉన్న వ్యాపారాల వృద్ధి విప్రో క్యాంపస్ నియామకాలపై ప్రభావం చూపాయి. దీంతో తన సాఫ్ట్‌వేర్ సర్వీస్‌ల ప్రాజెక్ట్‌లలో కొత్త వారిని ఎక్కువగా తీసుకోలేదు.

క్యాంపస్‌ల నుంచి ఇప్పటికే విప్రో 10వేల మంది దాకానే నియమించుకుందని, అయితే ఈ ఏడాది మాత్రం క్యాంపస్ నియామకాలను రెండింతలు చేస్తుందని తెలిసింది. అమెరికా, ఇతర మార్కెట్లలో స్థానికతను పెంచేందుకు ఆన్‌సైట్ హైరింగ్ కూడా చేపడుతుంది. 'మా నియామకాల్లో ఇన్ని రోజులు తగ్గుదలను చూశారు. కానీ గడిచిన ఏళ్ల కంటే ప్రస్తుతం నియామకాలను రెండింతలు చేయబోతున్నాం' అని విప్రో చీఫ్‌హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ సౌరభ్ గోవిల్ తెలిపారు. క్యాంపస్‌ల నుంచి వేలమంది ఇంజనీర్లను హైర్ చేసుకోవడం ఇండస్ట్రీ ప్రారంభించిందని పేర్కొన్నారు. విప్రోతో పాటు, ఇతర ఇండియన్ ఐటీ కంపెనీలు కూడా క్యాంపస్‌ల నుంచి సుమారు 20వేల మందిని నియమించుకోవాలనుకుంటున్నాయి. వచ్చే రెండు లేదా మూడు క్వార్టర్లలో అట్రిషన్ రేటును 14 శాతం నుంచి 15 శాతం ఉంచాలని విప్రో లక్ష్యంగా పెట్టుకుంది.

రూ.6 లక్షలకు పైనే ప్యాకేజీ....

విప్రో తన ఎంట్రీ లెవల్ జాబ్ ఆఫర్లలో కూడా మార్పులు చేసింది. డిజిటల్ టెక్నాలజీల్లో వారికున్న నైపుణ్యాలను ఆధారంగా చేసుకుని వారికి అత్యధికంగా రూ.6 లక్షల నుంచి అంతకంటే ఎక్కువ ప్యాకేజీలనే విప్రో ఆఫర్ చేస్తోంది. ఫ్రెషర్ల కోసం ప్రత్యేకంగా హైరింగ్ మోడల్‌ను కూడా రూపొందించింది . ఈ మోడల్‌లో ప్యాకేజీల పరంగా ఫ్రెషర్లను మూడు రకాల కేటగిరీల కింద విభజించింది. రూ.3.5 లక్షల ప్యాకేజీ, మిడ్ టైర్ వారికి రూ.6 లక్షల నుంచి రూ.6.5 లక్షల ప్యాకేజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి టెక్నాలజీ యూనివర్సిటీలకు రూ.20 లక్షల వరకు ప్యాకేజీని విప్రో ఆఫర్ చేస్తోంది.

ఫలితాల్లో అదుర్స్...

డిసెంబర్ క్వార్టర్‌లో విప్రో అంచనాలకు మించిన ఫలితాలను విడుదల చేసింది. నికర లాభాలను స్టాండలోన్‌బేసిస్‌లో 39.5 శాతం పెంచుకుని, రూ.2,518.4 కోట్లను నమోదు చేసింది. ఆపరేషన్స్ నుంచి వచ్చిన రెవెన్యూలు కూడా రూ.12,138.7 కోట్లకు పెరిగాయి. గత ఆర్థిక ఏడాదిలో ఈ రెవెన్యూలు రూ.11,072.7 కోట్లుగా మాత్రమే ఉన్నాయి.

అట్రిషన్‌రేటును తగ్గించడానికి విప్రో ఐదేళ్ల కంటే తక్కువ అనుభవమున్న ఉన్న జూనియర్ ఉద్యోగులకూ వన్‌టైమ్ బోనస్‌ను ఇచ్చింది. అయితే వీరు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ల ద్వారా కంపెనీలో ఉద్యోగం కొట్టి, గతేడాది డిసెంబర్ నాటికి ఇంకా కంపెనీలో ఉద్యోగం పనిచేస్తున్న వారై ఉండాలి. గత మూడేళ్ల నుంచి ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్, విప్రో, కాగ్నిజెంట్‌లు తమ వర్క్‌ఫోర్స్‌కు కొత్త టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చేందుకు లక్షల డాలర్లను ఇన్వెస్ట్ చేశాయి. ఇలా శిక్షణ ఇచ్చిన వారిని కొత్త ప్రాజెక్ట్‌లలో నియమిస్తున్నాయి.



మార్కెట్లోకి సుజుకి వి స్ట్రోమ్ 650 ఎక్స్‌టి

న్యూఢిల్లీ : సుజుకి మోటార్ సైకిల్ ప్రీమియం మోడల్ వి స్ట్రోమ్ 650 ఎక్స్‌టి ఎడిషన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. హజార్డ్ లైట్స్, సైడ్ రిఫ్లెక్టర్స్ తో పాటు సరికొత్త గ్రాఫిక్స్ తో డిజైన్ చేసిన ఈ బైక్ ఢిల్లీ ఎక్స్ షోరూం ధర రూ.7.46 లక్షలు

యుఎస్‌లో రెడ్డీస్ మైగ్రేన్ డ్రగ్

- **మిర్యాలగూడ ప్లాంట్‌లో తనిఖీలు పూర్తి : రెడ్డీస్**

హైదరాబాద్ : మైగ్రేన్ చికిత్స కోసం వాడే 'టోసిమ్రా' నాజల్ స్ప్రేకు యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అనుమతి ఇచ్చినట్టు డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్‌సోమవారం తెలిపింది. మైగ్రేన్ చికిత్స కోసం వాడే డాక్టర్ రెడ్డీస్ పోర్ట్‌ఫోలియోలో 'టోసిమ్రా' లేటెస్ట్‌ప్రొడక్ట్ అని రెడ్డీస్ పేర్కొంది. ఈ ప్రొడక్ట్‌ను కమర్షియలైజ్ చేసేందుకు కంపెనీ ప్రయత్నిస్తోంది. 'టోసిమ్రాకు అనుమతి లభించడం చాలా ఆనందదాయకంగా ఉంది. మైగ్రేన్‌తో బాధపడే రోగులకు చికిత్స అందించేందుకు పలు ప్రొడక్ట్‌లను అభివృద్ధి చేయడానికి ఇది దోహదం చేస్తుంది' అని డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ కో చైర్మన్, సీఈవో జీవి ప్రసాద్ తెలిపారు.

ఏపీఐ ప్లాంట్‌లో తనిఖీలు పూర్తి....

నల్గొండ జిల్లా మిర్యాలగూడ వద్దనున్న ఏపీఐ ప్లాంట్‌లో యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలు సోమవారం పూర్తిచేసినట్టు డాక్టర్ రెడ్డీస్, బీఎస్ఈ ఫైలింగ్‌లో తెలిపింది. యూఎస్ఎఫ్‌డీఏ ఒక అభ్యంతరంగా ఫామ్ 483ను జారీ చేసినట్టు పేర్కొంది. ఈ ఒక్క అభ్యంతరంపై చర్యలు తీసుకోనున్నట్టు కంపెనీ వివరించింది.

ఉక్కులో ఇండియా రెండో ప్లేస్‌కు



- 2018లో 4.9 శాతం పెరిగిన ఉత్పత్తి
- మొత్తం ఉత్పత్తి 106.5 మిలియన్ టన్నులు
- జపాన్ మూడో ప్లేస్‌లో

న్యూఢిల్లీ : ప్రపంచంలోనే రెండో పెద్ద ఉక్కు ఉత్పత్తిదారుగా ఇండియా అవతరించింది. చైనా మొత్తం ఉత్పత్తిలో 51 శాతం వాటాతో మొదటి స్థానంలో కొనసాగుతుండగా, ఇప్పటిదాకా రెండో స్థానంలో ని జపాన్‌ను ఇండియా వెనక్కు నెట్టిందని వరల్డ్ స్టీల్ అసోసియేషన్ డేటా చెబుతోంది . 2018 లో ఇండియా 106.5 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 4.9 శాతం ఎక్కువ. 2018 లో చైనా ఉక్కు ఉత్పత్తి 6.6 శాతం పెరిగి 928.3 మిలియన్ టన్నులకు చేరింది. దీంతో, మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో చైనా వాటా 51.3 శాతానికి పెరిగింది. ఇక జపాన్ ఉక్కు ఉత్పత్తి 2018 లో 0.3 శాతం తగ్గి 104.3 మిలియన్ టన్నులకు పరిమితమైంది. ఫలితంగా ఇండియా రెండో ప్లేస్‌కు ఎగబాకింది. ప్రపంచపు మొత్తం ఉక్కు ఉత్పత్తి 2018 లో 4.6 శాతం పెరిగి 1808.6 మిలియన్ టన్నులకు చేరినట్లు తాజా గణాంకాలు వివరిస్తున్నాయి. ఉక్కు ఉత్పత్తి అధికంగా చేసే టాప్ 10 దేశాలలో అమెరికా (నాలుగో స్థానం), దక్షిణ కొరియా (అయిదో స్థానం), రష్యా (ఆరో స్థానం), జర్మనీ (ఏడో స్థానం), టర్కీ (ఎనిమిదో స్థానం), బ్రెజిల్ (తొమ్మిదో స్థానం), ఇరాన్ (పదో స్థానం)లో ఉన్నాయని వరల్డ్ స్టీల్ అసోసియేషన్ (వరల్డ్ స్టీల్) వెల్లడించింది. ఉక్కు ఉత్పత్తి చేసే వారిలో 85 శాతం వరల్డ్ స్టీల్ మెంబర్లు. మొత్తం 160 మంది మెంబర్లుండగా, ప్రపంచంలోని అతి పెద్ద 10 ఉక్కు ఉత్పత్తి కంపెనీలలో 9 కంపెనీలకు వరల్డ్ స్టీల్‌లో సభ్యత్వం ఉంది.

బడ్జెట్ భయంతో మార్కెట్ ఢమాల్




ముంబై : కేంద్రం మరో మూడు రోజుల్లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో స్టాక్ మార్కెట్ కుప్పకూలింది. రాబోయే బడ్జెట్‌లో ప్రజాకర్షక విధానాలకు పెద్ద పీట వేస్తారని అంచనాలున్నాయి. దీనిని మార్కెట్ ప్రతికూలంగా పరిగణిస్తోంది. సంస్కరణల ప్రక్రియ కూడా కొంత నెమ్మదిస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీకి అమ్మకాల సెగ తగిలింది. దీంతో సెన్సెక్స్ భారీగా 368 పాయింట్లకు పైగా పడిపోయింది. నిఫ్టీ కూడా 100 పాయింట్ల పైన దిగజారింది. ఫైనాన్సియల్ స్టాక్స్, ఆటో, కన్జ్యూమర్ డ్యూరెబుల్‌స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా ఉన్నట్టు విశ్లేషకులు చెప్పారు. మరోవైపు బలహీనమైన గ్లోబల్ సంకేతాలు, ఈ గురువారం జనవరి నెల డెరివేటివ్స్ సిరీస్ ముగియనుండటం కూడా స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 36,124.26 వద్ద గరిష్ట స్థాయిని, 35,565.15 వద్ద కనిష్ట స్థాయిని తాకింది. చివరికి 368.84 పాయింట్ల నష్టంతో 35,657 వద్ద క్లోజైంది. నిఫ్టీ కూడా 10,804.45 వద్ద గరిష్ట స్థాయిని, 10,630.95 కనిష్ట స్థాయిలను తాకి, చివరికి 119 పాయింట్ల నష్టంతో 10,661.55 వద్ద స్థిరపడింది. బెంచ్‌మార్క్ సూచీలు గత 25 రోజుల్లో ఈ రోజే అత్యంత కనిష్ట స్థాయిలను నమోదు చేశాయి.

నిఫ్టీలో అదానీ పోర్ట్స్ షేర్లు ఎక్కువగా 12.53 శాతం నష్టపోయాయి. అదానీతో పాటు ఇండియాబుల్స్ హౌజింగ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, యస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు నష్టాలు పాలయ్యాయి. మారుతీ సుజుకీ వరుసగా రెండో క్వార్టర్ తన నికర లాభాలను తగ్గించుకోవడం, ఆటో స్టాక్స్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. దేశీయ అతిపెద్ద మోర్టగేజ్ లెండర్ హెచ్‌డీఎఫ్‌సీ, ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్, ఆస్తుల పరంగా అతిపెద్ద బ్యాంక్ ఎస్‌బీఐల షేర్లు సెన్సెక్స్‌ను 100 పాయింట్లకు పైగా కిందకి దించాయి. హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు 1.50 శాతం, ఇన్ఫోసిస్ షేర్లు 1.34 శాతం పడిపోయాయి. ఎస్‌బీఐ షేర్లు 2.37 శాతం నష్టంలో ట్రేడయ్యాయి. అమెరికా, చైనాల మధ్య జరుగుతున్న ట్రేడ్ చర్చలు కూడా అనిశ్చితంగా ఉండటం, ఫెడ్ మీటింగ్ ట్రేడింగ్‌పై ప్రతికూల ప్రభావం పడేలా చేసింది. డాలర్ మారకంలో రూపాయి విలువ కూడా బలహీనంగా 71.11 వద్ద ట్రేడైంది. అయితే టీసీఎస్ స్టాక్ సోమవారం ట్రేడింగ్‌లో బిగ్గెస్ట్ గెయినర్‌గా 1.71 శాతం లాభపడింది. టీసీఎస్‌తో పాటు, కోల్ ఇండియా, లార్సెన్ అండ్ టుబ్రో, పవర్ గ్రిడ్, ఏసియన్ పేయింట్, హెచ్‌సీఎల్ టెక్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాలతో కొనసాగాయి. జీ ఎంటర్‌టైన్‌మెంట్ స్టాక్స్ కూడా సోమవారం కోలుకున్నాయి.

మాకివి కావాలి

- **పీఎస్‌యూ బ్యాంక్ అధిపతులతో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్**



న్యూఢిల్లీ : బడ్జెట్, మానిటరీ పాలసీ సమీక్షకు ముందు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త గవర్నర్ శక్తికాంత్ దాస్, ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల సీఈవో, ఎండీలతో భేటీ అయ్యారు. బ్యాంకింగ్ రంగం నుంచి రెగ్యులేటర్ అంచనాలను ఆయన వారికి తెలిపారు. ఆర్‌బీఐ ఆరో ద్వైపాక్షిక మానిటరీ పాలసీ ఫిబ్రవరి 7న జరగనుంది. దీనికి ఆరు రోజుల ముందు కేంద్రం తన బడ్జెట్‌ను ప్రజల ముందుకు తీసుకొస్తోంది. ఈ రెండు పరిణామాల కంటె ముందు శక్తికాంత్ దాస్, ప్రభుత్వ రంగ బ్యాంక్ సీఈవోలతో భేటీ అయ్యారు. ఆర్‌బీఐ కొత్త గవర్నర్ దాస్ నిర్వహించబోతున్న తొలి మానిటరీ పాలసీ ఇదే. 'బ్యాంకింగ్ రంగం నుంచి ఆర్‌బీఐ ఏం ఆశిస్తోందో, బ్యాంక్ సీఈవోలు, ఎండీలకు ఈ మీటింగ్‌లో తెలిపాం. అదేవిధంగా ప్రస్తుత బ్యాంకింగ్ రంగ పరిస్థితి, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ స్థితిగతులు, భవిష్యత్తులో బ్యాంకింగ్ రంగం పీఎస్‌యూ బ్యాంకులు వంటి విషయాల గురించి చర్చించాం' అని బ్యాంక్ సీఈవోలతో సమావేశ అనంతరం దాస్ చెప్పారు. అయితే దాస్ నిర్వహించబోయే తొలి పాలసీ సమీక్షలో ఆర్‌బీఐ వడ్డీరేట్ల కోత చేపట్టే అవకాశముందని మెజార్టీ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. రిటైల్, హోల్‌సేల్ ద్రవ్యోల్బణం తగ్గడంతో, ఆర్‌బీఐ తన ఫిబ్రవరిలో వడ్డీ రేట్లు తగ్గిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం డిసెంబర్ నెలలో 18 నెలల కనిష్టానికి చేరి, 2.19 శాతంగా నమోదైంది. టోకుధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం కూడా ఎనిమిది నెలల కనిష్ట స్థాయిని అందుకుని డిసెంబర్‌లో 3.80 శాతంగా ఉంది.


గుండె జబ్బుకి నాట్కో మాత్రలు

హైదరాబాద్, వెలుగు : నాట్కో ఫార్మా లిమిటెడ్ వల్సర్టన్ సకుబిట్రిల్ మాత్రలను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. హార్ట్ ఫెయిల్యూర్, శరీరానికి గుండె ద్వారా రక్త సరఫరాను సులభతరం చేయడం వంటి వాటికోసం ఈ మాత్రలను ఉపయోగించవచ్చని నాట్కో ఫార్మా తెలిపింది. వీటిని వల్సక్ బ్రాండ్ పేరిట ప్రవేశపెట్టింది. వీటిని 50 ఎమ్‌జి, 100 ఎమ్‌జి పరిమాణంలో అందుబాటులో ఉండే వీటి ధర పరిమాణాన్ని బట్టి ఒక మాత్రకు రూ.45, రూ.55 గా ఉంది.

గ్లోబల్ ర్యాంకింగ్స్ లో ఐఎస్‌బి ఒక్కటే

హైదరాబాద్, వెలుగు: ఈ యేడాది ఫైనాన్షియల్ టైమ్స్ గ్లోబల్ ఎమ్‌బిఎ ర్యాంకింగ్స్ లో హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) ఒక్కటే ఇండియా నుంచి స్థానం సాధించుకుంది. ఐఎస్‌బి ఈ జాబితాలో మొదటి 25 స్థానాల్లో చోటు దక్కించుకుంది. ఐఎస్‌బి మేనేజ్‌మెంట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (పిజిపి) అంతర్జాతీయంగా 24 వ స్థానాన్ని దక్కించుకోవడంతో పాటు ఇండియాలో మొదటి స్థానంలో కొనసాగుతోంది. యేటా 900 విద్యార్థులతో ఐఎస్‌బి పిజిపి ఇండియాలోనే అతిపెద్ద ప్రోగ్రామ్ గా నిలవడంతో పాటు అంతర్జాతీయంగా మొదటి 10 స్థానాల్లో నిలిచింది. 34 శాతం మంది మహిళలతో బి స్కూల్స్ లో అత్యధికంగా మహిళలు ఉన్న బి స్కూల్ గా కూడా ఐఎస్‌బి పేరొందింది.

జీ రేసులో జియో!



ముంబై : మూడు నెలల కాలం ఓపిక పట్టేందుకు రుణదాతలు ఒప్పుకున్నారనే జీ గ్రూప్ ప్రమోటర్ల (ఎస్సెల్ గ్రూప్) ప్రకటనతో గ్రూప్ కంపెనీలలో ఒక కంపెనీ, జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్ ధర పెరిగింది. కానీ, మిగిలిన కంపెనీల షేర్ల ధరలు మాత్రం మరింత పతనాన్ని చవిచూశాయి. జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లు సోమవారం 16.64 శాతం పెరగ్గా, జీ లెర్న్ 9 శాతం, జీ మీడియా కార్పొరేషన్ 18 శాతం చొప్పున నష్టపోయాయి. ఎడ్యుకేషన్ రంగంలో జీ లెర్న్ కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, జీ న్యూస్ పేరిట బ్రాడ్‌కాస్ట్ ఛానెల్స్‌ను, డిఎన్ఏ న్యూస్ పేపర్‌ను జీ మీడియా నిర్వహిస్తోంది. ఇక మరో కంపెనీ డిష్ టీవీ కేవలం 2 శాతం పెరిగింది.

ప్రమోటర్ల వాటా కొనేందుకు జియో ఆసక్తి !

ఎస్సెల్ గ్రూప్‌కు అప్పులిచ్చిన రుణదాతలు (బ్యాంకులు, ఇన్‌స్టిట్యూషన్స్, ఎన్‌బీఎఫ్‌సీలు) తో జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయని, తనఖా పెట్టిన షేర్లను అమ్మబోమని, ఎన్‌పీఏగా వర్గీకరించమని తమకు హామీ ఇచ్చినట్లు సుభాష్ చంద్ర మీటింగ్ అనంతరం ఆదివారం వెల్లడించారు. ప్రమోటర్ల వాటా విక్రయం త్వరగా ముగించాలని రుణదాతలు కండిషన్ పెట్టినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదిలావుంటే, జీ ఎంటర్టైన్‌మెంట్‌లో తన వాటాలో సగం అమ్మేందుకు జరుపుతున్న చర్చలూ ముందుకు సాగుతున్నట్లు చంద్ర చెబుతున్నారు. జీ ఎంటర్టైన్‌మెంట్‌లో ఆయన వాటా చేజిక్కించుకునేందుకు సోనీ, అమెజాన్, అలీబాబా, యాపిల్, టెన్సెంట్ వంటి విదేశీ దిగ్గజాలతోపాటు రిలయన్స్ జియో కూడా రేసులో ఉంది. జీ ఎంటర్టైన్‌మెంట్‌లో ప్రమోటర్లకు సుమారు 42 శాతం వాటా ఉంది. ఎంటర్టైన్‌మెంట్ రంగంలో ఓవర్ ది టాప్ సేవల విభాగం పెరుగుతుండటంతో సుభాష్ చంద్ర భవిష్యత్‌లో అందులో దృష్టి పెట్టాలనుకుంటున్నారు. వర్చువల్, ఆగ్మెంటెడ్ రియాల్టీ, ఐఒటీ, 3 డీ ప్రింటింగ్ వంటి రంగాలలోకి అడుగుపెట్టడానికి వ్యూహాత్మక భాగస్వామి కోసం వెతుకుతున్నట్లు జీ ఎంటర్టైన్‌మెంట్ ఎండి, సీఈఓ పునీత్ గోయెంకా తెలిపారు. రేసులో రిలయన్స్ జియోతో దేశీయ సంస్థల పట్లా జీ ప్రమోటర్లు ఆసక్తి కనబరుస్తున్నారనే విషయం అర్థమవుతోంది.

అమ్మకాల ఊపుకు ఆటోమొబైల్ పరిశ్రమ తిప్పలు

జనవరిలోనూ జోరుగా కార్లపై ఆఫర్లు



పరుగు పెంచే ప్రయత్నాలు

హైదరాబాద్, వెలుగు: అమ్మకాలు ఊపందుకోకపోవడంతో కార్ల తయారీదారులు జనవరి నెలలోనూ ఆఫర్లను కురిపిస్తున్నారు. ఐనా, కస్టమర్ల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉందని చెబుతున్నారు. గత కొన్ని నెలలుగా విక్రయాలు తగ్గుతుండటంతో ఆటోమొబైల్ రంగం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. ఆరు నెలలుగా ఆశించిన అమ్మకాలు లేక కార్ల తయారీ రంగం ఆఫర్లనే నమ్ముకుంటోంది. అయినా సేల్స్ మాత్రం పెద్దగా పెరగడం లేదు. ఎప్పుడూ డిసెంబర్ వరకే ఉండే ఆఫర్లు ఈసారి జనవరి లోనూ కొనసాగుతున్నాయి. పెరిగిపోయిన ఇన్వెంటరీని తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా పలు ఆటో మొబైల్ కంపెనీలు భారీగా ఆఫర్ల వర్షం కురిపిస్తున్నాయి. 2018 మోడల్స్ తో పాటు ఈ యేడాది మోడల్స్ పై కూడా కొన్ని కంపెనీలు డిస్కౌంట్లను ప్రకటించాయి. అమ్మకాల్లో కాస్త పెరుగుదల కనిపించినప్పటికీ ఆశించిన స్థాయిలో డిమాండ్ మాత్రం కనబడడం లేదు. మకర సంక్రాంతి పండగ సందర్భంగా డిస్కౌంట్లను మరింత పొడిగించి పండగ సేల్స్ ను క్యాష్ చేసుకున్నాయి కొన్ని కంపెనీలు.

నిరాశ మిగిల్చిన జనవరి అమ్మకాలు

గతేడాది జనవరి తో పోలిస్తే ఈ యేడాది జనవరి లో కార్ల అమ్మకాలు నెమ్మదించాయి. మారుతి సుజుకి పోయినేడాది జనవరి సేల్స్ తో పోలిస్తే దాదాపు 10 శాతం నష్టపోయింది. గతేడాది జనవరిలో హైదరాబాద్ లోని మారుతి సుజుకి వరుణ్ మోటార్స్ ద్వారా దాదాపు 850 కార్లు అమ్ముడవగా, ఈసారి 600-700 కార్లు అమ్ముడైనట్లు వరుణ్ మోటార్స్ రూరల్ సేల్స్ మేనేజర్ జి.వి.వి సత్యనారాయణ తెలిపారు. 2018 మోడల్ ఇన్వెంటరీని క్లియర్ చేయడానికి రూ.50 వేల దాకా డిస్కౌంట్లను ఇస్తున్నట్లు చెప్పారు. 2019 మోడల్స్ పై సాధారణ ఆఫర్లను ఇస్తుండగా, 2018 మోడల్స్ పై కన్జ్యూమర్ ఆఫర్ రూ.20 వేలకు అదనంగా మరో రూ.30 వేల డిస్కౌంట్ ను అందిస్తున్నట్లు తెలిపారు. 2018 మోడల్స్ లో ఆల్టో కే10, స్విఫ్ట్, డిజైర్ వంటి 6 రకాల మోడల్స్ పై ఆఫర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ డిస్కౌంట్ ను క్యాష్ రూపంలో గానీ, ఆక్సెసరీస్ రూపంలో కానీ పొందవచ్చని చెప్పారు.

టూవీలర్ అమ్మకాలు పర్లేదు

కార్ల అమ్మకాలతో పోలిస్తే టూవీలర్ అమ్మకాలు కాస్త ఆశాజనకంగానే ఉన్నాయి. టూ వీలర్ విభాగంలో హీరో మోటో కార్ప్ 7.25 శాతం నష్టపోగా, టీవీఎస్ మోటార్ 3.02 శాతం లాభపడింది. బజాజ్ ఆటో 3.36 శాతం లాభపడగా, ఐషర్ (ఆర్‌ఈ) 7.55 శాతం నష్టపోయింది. కార్లలో విభాగంలో మహీంద్రా అండ్ మహీంద్రా 10.66 శాతం నష్టపోగా, టాటా మోటార్స్ 10.25 శాతం నష్టపోయింది. టాటా మోటార్స్ 2018 మోడల్స్ పై ఉచిత ఇన్స్యూరెన్స్ తో పాటు ఎక్స్చేంజ్ పై రూ.20 వేల వరకు అదనపు డిస్కౌంట్ ఇస్తోంది. 2019 మోడల్స్ పై ఎక్స్చేంజ్ బోనస్ ను ప్రకటించింది. వెంకటరమణ షోరూమ్స్ లో దాదాపు 130 కార్ల వరకు ఇన్వెంటరీ మిగిలి ఉందని షోరూం తెలిపింది.

ఆఫర్లే ఆఫర్లు.....

మహీంద్రా అండ్ మహీంద్రా బొలేరో వాహనంపై రూ.50 వేల వరకు డిస్కౌంట్ ఇస్తుండగా, స్కార్పియో పై రూ.85 వేల దాకా తగ్గింపును ప్రకటించింది. హీరో మోటో కార్ప్ పేటీఎమ్ ద్వారా రూ.3 వేల డిస్కౌంట్ ను ఇస్తోంది. స్కోడా కూడా తమ కార్లపై ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. 2018 మోడల్ స్కోడా రాపిడ్ వెహికిల్ పై ఎక్స్చేంజ్ బోనస్ రూ.50 వేల దాకా ఇస్తుండడంతో పాటు ఉచిత ఇన్స్యూరెన్స్, లాయల్టీ బోనస్ రూ.25 వేల దాకా అందిస్తోంది. 2019 రాపిడ్ పై ఎక్స్చేంజ్ బోనస్ ను రూ.25 వేల దాకా ఇస్తుండడంతో పాటు లాయల్టీ బోనస్ రూ.25 వేలు కూడా అందిస్తోంది. స్కోడా ఆక్టావియా, స్కోడా సూపర్బ్ లపై కూడా ఆఫర్లను ప్రకటించింది.

ఇక మార్చి పైనే ఆశలు

దసరా, డిసెంబర్ తరువాత మార్చి నెల ఆటోమొబైల్ పరిశ్రమకు బిగ్ మంత్. ఈసారి పండగ, ఇయర్ ఎండింగ్ సేల్స్ కలిసిరాకున్నా మార్చిలో అమ్మకాలు బాగుంటాయని ఆశిస్తున్నాం. గతేడాది జనవరిలో 850 కార్లు అమ్మగలిగితే ఈ యేడాది జనవరి లో 600–700 కార్లు అమ్ముడయ్యాయి. 2018 స్టాక్ ఉన్నంత వరకు ఆఫర్లను కొనసాగిస్తాం. ఫిబ్రవరి నుండి అమ్మకాలు బాగుంటాయని భావిస్తున్నాం.

- జి.వి.వి సత్యనారాయణ, సేల్స్ మేనేజర్, వరుణ్

రంజీ ఫైనల్లో సౌరాష్ట్ర

విదర్భతో తుది పోరుకు రెడీ

బెంగళూరు: దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నీ రంజీ ట్రోఫీలో సౌరాష్ట్ర ఫైనల్‌కు దూసుకెళ్లింది. కర్నాటకతో జరిగిన సెమీఫైనల్లో 5 వికెట్ల తేడాతో గెలిచిన సౌరాష్ట్ర మూడోసారి రంజీ ఫైనల్‌కు అర్హత సాధించింది. 279 పరుగుల టార్గెట్ ఛేజింగ్‌లో ఓవర్‌నైట్ స్కోరు 224/3తో ఐదో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర 5 వికెట్లకు 282 రన్స్ చేసి గెలిచింది. టీమిండియా బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారా (266 బంతుల్లో 17 ఫోర్లతో 131 నాటౌట్), షెల్డన్ జాక్సన్ (217 బంతుల్లో 15 ఫోర్లతో 100) సెంచరీలతో జట్టుకు విజయాన్నందించారు. విజయానికి 55 పరుగులు అవసరమైన దశలో సోమవారం ఆట ఆరంభించిన సౌరాష్ట్ర మరో 17.5 ఓవర్లు బ్యాటింగ్ చేసి టార్గెట్ ఛేదించింది. జాక్సన్‌తో కలిసి పుజారా నాలుగో వికెట్‌కు 214 పరుగులు జోడించడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లో కర్ణాటక 275 రన్స్ చేయగా.. సౌరాష్ట్ర 236 పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో కర్ణాటక 236 పరుగులు చేసి 279 టార్గెట్ విధించిన విషయం తెలిసిందే. వచ్చే నెల 3 నుంచి ప్రారంభం కానున్న ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ విదర్భతో సౌరాష్ట్ర తలపడనుంది.



నిరూపించుకో..

అప్పటివరకు రాయుడు బౌలింగ్ బ్యాన్

దుబాయ్: టీమిండియా ప్లేయర్ అంబటి రాయుడు బౌలింగ్‌పై ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సస్పెన్షన్ విధించింది. బౌలింగ్ యాక్షన్ సరైందేనని నిరూపించుకోవాలంటూ రాయుడుకు ఐసీసీ 14 రోజుల గడువిచ్చింది. అయితే డెడ్‌లైన్‌లోగా రాయుడు బౌలింగ్ యాక్షన్ సరైందేనని నిరూపించుకోలేకపోవడంతో నిషేధం విధిస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. రాయుడుపై సస్పెన్షన్ తక్షణం అమల్లోకి వస్తుందని, తన బౌలింగ్ యాక్షన్ సరిగానే ఉందని రాయుడు నిరూపించుకునేదాకా నిషేధం కొనసాగుతుందని ఐసీసీ స్పష్టం చేసింది. సందేహాస్పదంగా బౌలింగ్ చేస్తున్నాడంటూ ఈ నెల 13న ఆస్ట్రేలియాతో జరిగిన ఫస్ట్ వన్డే తర్వాత రాయుడుపై ఐసీసికి ఫిర్యాదు అందింది. సిడ్నీలో జరిగిన ఆ మ్యాచ్‌లో రాయుడు రెండు ఓవర్లు బౌలింగ్ చేశాడు. మ్యాచ్ తర్వాత ఫీల్డ్ అంపైర్లు రాయుడు బౌలింగ్ సందేహంగా ఉందంటూ ఫిర్యాదు చేశారు. ఐసీసి నియమావళి క్లాజ్ 4.2 ప్రకారం రాయుడుపై చర్యలు తీసుకున్నారు. అయితే ఐసీసీ నియమావళిలోని ఆర్టికల్ 11.2 ప్రకారం బీసీసీఐ అనుమతితో దేశవాళీ క్రికెట్‌లో బౌలింగ్ చేసే అవకాశముంటుంది.

టీమిండియా ఇంట్లోనే పులి అనేవాళ్లు ఇకపై ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిందే..! మనోళ్లు విదేశాల్లో సరిగ్గా ఆడరు అంటే అభిమానులు ఊరుకోరిక..! ఆస్ట్రేలియాని రెండు ఫార్మాట్లలో జయించిన కోహ్లీసేన.. న్యూజిలాండ్ పని పట్టేసింది..! గత వరల్డ్‌కప్ తర్వాత స్వదేశంలో వన్డేల్లో అత్యధిక విజయాలు సాధించిన టీమ్‌గా నిలిచిన కివీస్‌పై అన్ని విభాగాల్లో ఆధిపత్యం చెలాయిస్తూ.. పదేళ్ల తర్వాత వారిగడ్డపై సిరీస్ హస్తగతం చేసుకుంది..! క్రమశిక్షణతో కూడిన బౌలింగ్.. పవర్‌ఫుల్ బ్యాటింగ్.. పదునైన ఫీల్డింగ్‌తో వరుసగా మూడో వన్డేలోనూ బ్లాక్‌క్యాప్స్ టీమ్ మైండ్‌బ్లాంక్ చేసింది..!

కివీస్ కోట బద్దలు

పదేళ్ల తర్వాత కివీస్‌లో తొలి సిరీస్ సొంతం

మూడో వన్డేలో న్యూజిలాండ్ చిత్తు ■ టీమిండియా హ్యాట్రిక్ విక్టరీ



షమీ (3/41)

మౌంట్ మాంగనీ

రికార్డులను తిరిగిరాయడమే పనిగా పెట్టుకున్న కోహ్లీసేన ఖాతాలో మరో ఘనత చేరింది. న్యూజిలాండ్ గడ్డపై దశాబ్దకాలంగా ఊరిస్తున్న వన్డే సిరీస్ విజయాన్ని టీమిండియా కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన మూడో వన్డేలో ఏడు వికెట్లతో ఘన విజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు వన్డేలు మిగిలుండగానే 3-0తో కైవసం చేసుకుంది. టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 49 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. రాస్ టేలర్ (106 బంతుల్లో 9 ఫోర్లతో 93), టామ్ లాథమ్ (64 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్సర్‌తో 51) హాఫ్ సెంచరీలతో రాణించారు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' షమీ 3, హార్దిక్ పాండ్యా, భువనేశ్వర్, చహల్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం రోహిత్ శర్మ (77 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 62), కెప్టెన్ విరాట్ కోహ్లీ (74 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్సర్లతో 60) సత్తా చాటడంతో 244 పరుగుల టార్గెట్‌ను 43 ఓవర్లలో మూడే వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేజ్ చేసింది. తెలుగు క్రికెటర్ అంబటి రాయుడు (42 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 40 నాటౌట్), దినేశ్ కార్తీక్ (38 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 38 నాటౌట్) కూడా మెరుపులు మెరిపించారు. ఇరు జట్ల మధ్య నాలుగో వన్డే ఈనెల 31న(గురువారం) హామిల్టన్‌లో జరగనుంది.

అలవోకగా

సిరీస్ ఆశలు సజీవంగా నిలుపుకోవాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో కూడా న్యూజిలాండ్ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయింది. బ్యాటింగ్‌లో కాస్తో కూస్తో పోరాడి మోస్తరు స్కోరు చేసినా బౌలింగ్‌లో పూర్తిగా విఫలమైంది. జోరుమీదున్న ఓపెనర్లు రోహిత్, ధవన్ తొలి వికెట్‌కు 39 రన్స్ జోడించి ఛేజింగ్‌లో మంచి ఆరంభమే ఇచ్చారు. క్రీజులో ఉన్నంతసేపు ధవన్ భారీ షాట్లతో విజృంభించాడు. బ్రేస్‌వెల్ వేసిన రెండో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు, ఐదో ఓవర్లో రెండు ఫోర్లతో రెచ్చిపోయాడు. అదే ఊపులో కట్‌షాట్ కొట్టే ప్రయత్నంలో బౌల్ట్ బౌలింగ్‌లో టేలర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ధవన్ అవుటైనా రోహిత్, వన్‌డౌన్‌లో వచ్చిన కోహ్లీ హోమ్‌టీమ్‌కు ఎలాంటి చాన్స్ ఇవ్వలేదు. అప్పటిదాకా నెమ్మదిగా ఆడిన రోహిత్... శాంట్నర్ బౌలింగ్‌లో స్ట్రెయిట్ సిక్సర్‌తో గేరు మార్చారు. మరోవైపు ఫెర్గూసన్ బౌలింగ్‌లో పాయింట్ దిశగా బౌండ్రీ కొట్టిన విరాట్..స్పిన్నర్ ఇష్ సోధి ఓవర్లో రెండు ఫోర్లు బాదాడు. ఆ తర్వాత ఇద్దరూ ఫెర్గూసన్‌ను టార్గెట్ చేశారు. అతని బౌలింగ్‌లో చెరో సిక్సర్ బాదారు. ఈ క్రమంలో ముందు రోహిత్, తర్వాత కోహ్లీ హాఫ్ సెంచరీ మార్కు దాటారు. వీరి జోరు చూస్తుంటే ఇండియా మరో వికెట్ పడకుండానే గెలిచేలా కనిపించింది. కానీ, శాంట్నర్ బౌలింగ్‌లో క్రీజు ముందుకొచ్చిన రోహిత్ స్టంపౌటవగా.. కాసేపటికే బౌల్ట్ బౌలింగ్‌లో నికోల్స్ పట్టిన చురుకైన క్యాచ్‌కు కోహ్లీ వెనుదిరిగాడు. ఈ ఇద్దరు రెండో వికెట్‌కు 113 రన్స్ జోడించారు. వెంటవెంటనే కెప్టెన్, వైస్ కెప్టెన్ నిష్క్రమించినా.. అంబటి రాయుడు, దినేశ్ కార్తీక్ ఎలాంటి తడబాటుకు తావివ్వకుండా ఛేదన కొనసాగించారు. మిడిలార్డర్‌తో దక్కిన చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్న ఈ ఇద్దరు నాణ్యమైన షాట్లతో బౌండ్రీలు రాబట్టారు. ముఖ్యంగా రాయుడు.. బ్రేస్‌వెల్ బౌలింగ్‌లో ఎక్స్‌ట్రా కవర్ మీదుగా కొట్టిన సిక్సర్.. ఫెర్గూసన్ షార్ట్‌బాల్‌ను అప్పర్‌కట్‌తో కొట్టిన బౌండ్రీ అతని ఇన్నింగ్స్‌కే హైలైట్. ఇష్ సోధి వేసిన 43వ ఓవర్లో కార్తీక్ 6, 4 బాదాడు. విజయానికి నాలుగు రన్స్ అవసరమైన దశలో బ్రేస్‌వెల్ వైడ్ బాల్ బౌండ్రీ చేరడంతో ఇండియా గెలిచింది.



టేలర్ (93)

ఆ ఇద్దరు మినహా

ఇంగ్లండ్‌లో వరల్డ్‌కప్ సమీపిస్తుండగా ఇండియా బౌలింగ్ రోజు రోజుకూ పదునెక్కుతోంది. బౌలింగ్‌కు పెద్దగా అనుకూలించని స్లో వికెట్‌పై పేస్ ద్వయం షమీ, భువనేశ్వర్‌తో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, స్పిన్నర్ చహల్ గొప్పగా రాణించారు. రాస్ టేలర్, టామ్ నికోల్స్ నాలుగో వికెట్‌కు 119 పరుగుల భాగస్వామ్యం మినహాయిస్తే ఇండియా బౌలింగ్ అటాక్‌కు హోమ్‌టీమ్ వద్ద పెద్దగా సమాధానమే లేకపోయింది. టీమ్‌లో సీనియర్ పేసర్ షమీ మరోసారి తనదైన శైలిలో విజృంభించాడు. రెండో ఓవర్లోనే రోహిత్ క్యాచ్‌తో ఓపెనర్ మన్రో (7)ను అవుట్ చేశాడు. ఏడో ఓవర్లో అద్భుత డెలివరీతో గప్టిల్ (13)ను భువీ వెనక్కుపంపి కివీస్‌కు షాకిచ్చాడు. ఈ దశలో టేలర్‌తో కలిసి కెప్టెన్ విలియమ్సన్ (28) పోరాడే ప్రయత్నం చేశాడు. అయితే, చహల్ వేసిన 17వ ఓవర్లో హార్దిక్ పట్టిన కళ్లు చెదిరే క్యాచ్‌కు అతను పెవిలియన్ చేరడంతో కివీస్ 59/3తో కష్టాల్లో పడింది. అయితే, టేలర్‌కు జతకలిసిన లాథమ్ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. పాండ్యా, స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో తొలుత జాగ్రత్తగా ఆడినా.. ఆ తర్వాత ఇద్దరూ బౌండ్రీలు కొడుతూ స్కోరు వేగం పెంచారు. ఈ క్రమంలో హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకోవడంతో పాటు టీమ్ స్కోరు 150 దాటించారు. ఈ జోడీ క్రీజులో పాతుకుపోవడంతో కివీస్ మంచి స్కోరు చేసేలా కనిపించింది. కానీ, 38వ ఓవర్లో లాథమ్‌ను అవుట్ చేసిన చహల్ ఈ జోడీని విడదీశాడు. ఆ వెంటనే హార్దిక్ వరుస ఓవర్లలో హెన్రీ నికోల్స్ (6), మిచెల్ శాంట్నర్ (3)ను పెవిలియన్ చేర్చాడు. స్లాగ్ ఓవర్లలో షమీ, భువీ జోరు చూపారు. సెంచరీ దిశగా సాగుతున్న టేలర్‌తో పాటు ఇష్ సోధి (12)ని అవుట్ చేసిన షమీ కివీస్‌కు బ్రేకులు వేశాడు. బ్రేస్‌వెల్ (15) రనౌటవగా.. భువీ బౌలింగ్‌లో బౌల్ట్ (2).. షమీకి చిక్కడంతో కివీస్ ఇన్నింగ్స్ ముగిసింది.

పాండ్యా సూపర్

సస్పెన్షన్ వేటు తర్వాత తొలిసారి బరిలోకి దిగిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌లో అందరినీ ఆకట్టుకున్నాడు. బ్యాన్ తర్వాత తొలి మ్యాచ్ ఆడిన పాండ్యా టీవీ షో వివాదం తన ఆటపై ఎలాంటి ప్రభావం చూపలేదని నిరూపించాడు. మిడిల్ ఓవర్లలో ప్రత్యర్థిని సమర్థవంతంగా కట్టడి చేశాడు. పాండ్యా తొలి స్పెల్ (5-0-9-0)లో 23 డాట్ బాల్స్ ఉన్నాయంటే అతనెంత గొప్పగా బౌలింగ్ చేశాడో చెప్పొచ్చు. రెండో స్పెల్‌లో పరుగులు ఇచ్చినా రెండు వికెట్లు తీశాడు. బంతితో మాత్రమే కాదు ఫీల్డింగ్‌లో కూడా అదుర్స్ అనిపించాడు. ఇన్నింగ్స్ 17వ ఓవర్లో కివీస్ కెప్టెన్ కేన్ ఇచ్చిన క్యాచ్‌ను షార్ట్-మిడ్ వికెట్‌లో లెఫ్ట్‌సైడ్ అమాంతం డైవ్ చేస్తూ అందుకున్న తీరు అద్భుతం.





కోహ్లీ (60)

సిరీస్ గెలిచి విశ్రాంతి తీసుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. ఎవరు ఉన్నా లేకున్న ఆటలో తీవ్రత మాత్రం తగ్గదు. న్యూజిలాండ్ లాంటి జట్టును వారి సొంత గడ్డపై మూడు మ్యాచ్‌ల్లో ఓడించడం మామూలు విషయం కాదు. జట్టు నుంచి ఇంతకు మించి ఏం ఆశిస్తాం. ఓ క్రికెటర్‌కు ఆటకంటే ఏది ఎక్కువ కాదు. పరిస్థితులను మరిపించాలంటే ఆటతో మురిపించాల్సిందే. పాండ్యా అదే చేశాడు. అతడుంటే జట్టులో బ్యాలెన్స్ పెరుగుతుంది. నాలుగో స్థానంలో రాయుడు బ్యాటింగ్ మిడిలార్డర్‌కు బలాన్నిస్తుంది. శుబ్‌మన్ గిల్ నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్న తీరు చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. నేను ఆ వయసులో అతనిలో 10 శాతం కూడా లేను.

- కోహ్లీ, టీమిండియా కెప్టెన్

టీమిండియా మాకు పాఠాలు నేర్పింది. ప్రస్తుతం ఆ జట్టు పటిష్టంగా ఉంది. ఈ మ్యాచ్‌లో టేలర్, లాథమ్ భాగస్వామ్యం మమ్మల్ని రేసులో నిలిపినా ఆ తర్వాత మళ్లీ పట్టు జారింది. మా బౌలర్లు ఆరంభంలోనే వికెట్లు తీస్తే ఇండియాపై ఒత్తిడి పెరిగేది

- విలియమ్సన్, కివీస్ కెప్టెన్

215

వన్డేల్లో రోహిత్ శర్మ కొట్టిన సిక్సర్లు. ఇండియా తరఫున అత్యధిక సిక్సర్లు కొట్టిన ప్లేయర్‌గా మహేంద్ర సింగ్ ధోనీ రికార్డును సమం చేశాడు.

ధోనీ మూడోసారి

వెటరన్ ప్లేయర్ ధోనీ తొడ కండరాల గాయంతో ఈ మ్యాచ్ నుంచి వైదొలిగాడు. అతని స్థానంలో దినేశ్ కార్తీక్ బరిలోకి దిగాడు. 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో గాయం, ఫిట్‌నెస్ సమస్యలతో అతను మ్యాచ్‌కు దూరం కావడం ఇది మూడోసారి మాత్రమే. చివరగా 2013లో వెస్టిండీస్‌లో జరిగిన ట్రై సిరీస్‌లో మ్యాచ్ ఆడలేకపోయాడు.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్: గప్టిల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 13, మన్రో (సి) రోహిత్ (బి) షమీ 7, విలియమ్సన్ (సి) పాండ్యా (బి) చహల్ 28, రాస్ టేలర్ (సి) కార్తీక్ (బి) షమీ 93, లాథమ్ (సి) రాయుడు (బి) చహల్ 51, నికోల్స్ (సి) కార్తీక్ (బి) పాండ్యా 6, శాంట్నర్ (సి) కార్తీక్ (బి) పాండ్యా 3, బ్రేస్‌వెల్ (రనౌట్/కోహ్లీ) 15, ఇష్‌సోధి (సి) కోహ్లీ (బి) షమీ 12, ట్రెంట్ బౌల్ట్ (సి) షమీ (బి) భువనేశ్వర్ 2, ఫెర్గూసన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు: 11; **మొత్తం: 49 ఓవర్లలో 243 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-10, 2-26, 3-59, 4-178, 5-191, 6-198, 7-222, 8-239, 9-239; 10-243; **బౌలింగ్:** భువనేశ్వర్ 10-1-46-2, షమీ 9-0-41-3, చహల్ 9-0-51-2, పాండ్యా 10-0-45-2, కుల్దీప్ 8-0-39-0, కేదార్ 3-0-17-0.

ఇండియా: రోహిత్ (స్టంప్డ్) లాథమ్ (బి) శాంట్నర్ 62, ధవన్ (సి) టేలర్ (బి) బౌల్ట్ 28, కోహ్లీ (సి) నికోల్స్ (బి) బౌల్ట్ 60, రాయుడు (నాటౌట్) 40, కార్తీక్ (నాటౌట్) 38; ఎక్స్‌ట్రాలు: 17; **మొత్తం: 43 ఓవర్లలో 245/3; వికెట్ల పతనం:** 1-39, 2-152, 3-168; **బౌలింగ్:** ట్రెంట్ బౌల్ట్ 10-1-40-2, బ్రేస్‌వెల్ 6-0-49-0, ఫెర్గూసన్ 10-1-57-0, శాంట్నర్ 10-0-45-1, ఇష్ సోధి 7-0-53-0.



అమ్మాయిలూ కొడతారా!

- సిరీస్‌పై మిథాలీ బృందం గురి
- నేడు న్యూజిలాండ్‌తో రెండో వన్డే
- ఉ. 6.30 నుంచి స్టార్ స్పోర్ట్స్ లో

మౌంట్‌మాంగనీ: పదేళ్ల తర్వాత కివీస్ గడ్డపై వన్డే సిరీస్ గెలిచి టీమిండియా జోరుమీదుంటే... న్యూజిలాండ్‌లోనే పర్యటిస్తున్న ఇండియా మహిళల జట్టు ఆ ప్రోత్సాహంతో వరుసగా రెండో వన్డేలోనూ విక్టరీ సాధించి సిరీస్ సొంతం చేసుకునేందుకు రెడీ అవుతోంది. మంగళవారం న్యూజిలాండ్ మహిళల జట్టుతో మిథాలీ గ్యాంగ్ తలపడనుంది. తొలి మ్యాచ్‌లో అండర్‌డాగ్స్‌గా బరిలో దిగి సూపర్ గేమ్‌తో బోణీ చేసిన టీమిండియా అదే ఊపులో రెండో వన్డే గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇక్కడే చేజిక్కించుకోవాలని భావిస్తోంది. తొలి వన్డేలో 9 వికెట్ల తేడాతో ఓడిన హోమ్‌టీమ్ తిరిగి పుంజుకొని సిరీస్ సమం చేయాలని చూస్తోంది. కొంతకాలంగా ఆట కంటే ఇతర విషయాలతోనే ఎక్కువ వార్తల్లో నిలిచిన టీమిండియా తొలి వన్డే విజయంతో వాటన్నింటిని పక్కకు నెట్టేసింది. నేపియర్‌లో ఓపెనర్లు స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ చెలరేగిన తీరు అభిమానులు ఇప్పట్లో మరచిపోలేరు. ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిన ఈ జంట అదే జోరు కొనసాగించాలని ఆశిస్తోంది. ఇక తొలి వన్డేలో బ్యాటింగ్ అవకాశం దక్కని హర్మన్‌ప్రీత్ కౌర్, కెప్టెన్ మిథాలీ రాజ్, దీప్తి శర్మ, తానియా భాటియా కూడా మెరిస్తే టీమిండియాకు ఎదురుండదు. బౌలింగ్‌లో సీనియర్ జులన్ గోస్వామి పేస్ బాధ్యతలు మోస్తుండగా... స్పిన్ త్రయం ఏక్తా బిస్త్, పూనమ్ యాదవ్, దీప్తి శర్మ అదరగొడుతున్నారు. అదే ఊపు ఇక్కడా చూపిస్తే కివీస్‌కు కష్టాలు తప్పకపోవచ్చు. మరోవైపు తొలి వన్డే తప్పులు సరిదిద్దుకొని గెలవాలని న్యూజిలాండ్ భావిస్తోంది.

నీషమ్, ఆస్టిల్ పిలుపు

మౌంట్ మాంగనీ: ఇండియాతో చివరి రెండు వన్డేల కోసం ఆల్‌రౌండర్ జిమ్మీ నిషామ్, లెగ్‌స్పిన్నర్ టాడ్ ఆస్టిల్ న్యూజిలాండ్ జట్టులోకి వచ్చారు. వీరిద్దరి కోసం ఇష్ సోధి, బ్రేస్‌వెల్‌ను జట్టు నుంచి తప్పించారు. ఇప్పటికే 3-0 తేడాతో సిరీస్ కోల్పోయిన న్యూజిలాండ్ చివరి రెండు వన్డేల్లో అయినా గెలిచి పరువు నిలుపుకోవాలని ఆశిస్తోంది.

స్పెయిన్‌తో పోరు డ్రా

ముర్షియా (స్పెయిన్): స్పెయిన్‌తో జరిగిన రెండో ఇంటర్నేషనల్ హాకీ మ్యాచ్‌ను ఇండియా విమెన్స్ టీమ్ డ్రా చేసుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా సోమవారం హోరాహోరీగా సాగిన రెండో మ్యాచ్‌ను ఇండియా 1-1తో డ్రా చేసుకుంది. ఆదివారం నాటి పరాజయ భారాన్ని మరచిపోయి ఈ మ్యాచ్‌లో ఇండియా దూకుడుగా ఆడింది. ఫస్టాఫ్‌లో రెండు జట్లూ గోల్స్ చేయలేకపోయాయి, 43 వ నిమిషంలో డ్రాగ్‌ఫ్లిక్కర్ గుర్జీత్ కౌర్ చేసిన గోల్‌తో ఇండియా 1-0 ఆధిక్యంలో దూసుకెళ్లింది. అయితే ఆ తర్వాత 49వ నిమిషంలో స్పెయిన్ ప్లేయర్ మారియా టోస్ట్ గోల్ చేసి స్కోరు సమం చేసింది. నిర్ణీత సమయంలోగా రెండు జట్లూ మరో గోల్ చేయలేకపోవడంతో మ్యాచ్ ఫలితం తేలకుండానే ముగిసింది.



భూపాలపల్లి, నిజామాబాద్‌లో జట్ల ఎంపిక

భారీగా తరలివస్తున్న క్రికెటర్లు

సెలెక్షన్స్‌కు అనూహ్య స్పందన


జయశంకర్ భూపాలపల్లి/ నిజామాబాద్, వెలుగు: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'వీ6 వెలుగు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ సెలెక్షన్స్‌కు భారీ స్పందన వస్తోంది. సోమవారం భూపాలపల్లిలోని సింగరేణికి చెందిన అంబేద్కర్ గ్రౌండ్‌లో నియోజకవర్గాల వారీగా ఆటగాళ్లను ఎంపిక చేశారు. భూపాలపల్లి, ములుగు, పరకాల నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల నుంచి ప్లేయర్లు భారీగా హాజరయ్యారు. వరంగల్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సెలెక్షన్లలో ఒక్కో నియోజకవర్గానికి 18 మందితో జట్లను ఎంపిక చేశారు. ఈ జట్లు ఫిబ్రవరి 5, 6 తేదీల్లో భూపాలపల్లిలోని అంబేద్కర్ గ్రౌండ్‌లో తలపడతాయి. గెలిచిన జట్టు సెమీఫైనల్‌కు వెళ్తుంది.



భూపాలపల్లిలో సెలెక్షన్స్‌కు హాజరైన క్రీడాకారులు

నిజామాబాద్‌లో 80 మంది ప్లేయర్లు...

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంఎస్‌ఆర్ స్కూల్ గ్రౌండ్స్‌లో జరిగిన సెలెక్షన్లకు అనూహ్య స్పందన వచ్చింది. దాదాపు 80 మంది ఈ సెలెక్షన్లకు హాజరయ్యారు. నిజామాబాద్ అర్బన్, బోధన్ నియోజకవర్గాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి సెలెక్టర్లు కె.శ్రీనివాస్ రావు, శైలవర్ధన్, పారస్ కుమార్, చంద్రసేన్ రెడ్డి జట్టును ఎంపిక చేశారు. జుక్కల్ నుంచి రావాల్సిన క్రికెటర్లు సకాలంలో హాజరు కాలేదు. ప్లేయర్ల కోరిక మేరకు జుక్కల్ టీమ్‌కు మంగళవారం నిజామాబాద్‌లోనే సెలెక్షన్స్ నిర్వహించనున్నారు.



అది 2016 మే 29.. సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్ నుంచి 120 కిలోమీటర్ల దూరంలోని సోర్డుంగ్ గ్రామం.. సుక్రిని లింబు అనే మహిళ ఎప్పటిలానే పొద్దున్నే పనికెళ్లింది.. సాయంత్రం ఇంటికొచ్చేసరికి తన పెద్ద కొడుకు ఐతే సింగ్ లింబు (30) ఇంట్లో వెంటిలేటర్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకును అలా చూసి ఆ తల్లి తట్టుకోలేకపోయింది. బోరున ఏడ్చింది. ఆ బాధతోనే కాలం వెల్లదీయడం మొదలెట్టింది. కానీ 2018 మే 29న తన మూడో కొడుకు ఐతే హంగ్ లింబు (27) అచ్చం అలానే వెంటిలేటర్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 'ఇద్దరి దగ్గర ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదు. ఇద్దరికీ ఎలాంటి జబ్బులూ లేవు. వాళ్లెందుకలా సూసైడ్ చేసుకున్నారో అర్థం కావడం లేదు' అని ఆ తల్లి ఆవేదన చెందింది.

బంగారు రాష్ట్రం

బతుకే భారం

ఇలా ఈ ప్రశ్నకు సమాధానం కోసం వెతుకుతున్నది ఆ ఒక్క తల్లి మాత్రమే కాదు. సిక్కింలోని అనేకమంది తల్లులది ఇదే పరిస్థితి. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం 2015లో సిక్కింలో 241 మంది (సూసైడ్ రేట్‌ను లక్ష మందికి లెక్కిస్తారు) ఆత్మహత్య చేసుకున్నారు. దేశంలో సూసైడ్ చేసుకున్న వారిలో అది 2.1 శాతం. కానీ రాష్ట్రాల వారీగా చూస్తే గత పదేళ్లలో సిక్కింలో ఆత్మహత్యల రేటు భారీగా పెరిగింది. 43.2 శాతంతో పాండిచ్చేరి దేశంలో తొలిస్థానంలో, 37.5 శాతంతో సిక్కిం దేశంలో రెండో స్థానంలో, రాష్ట్రాల్లో తొలిస్థానంలోనూ ఉంది. సిక్కింలోని పశ్చిమ జిల్లాలో సూసైడ్‌ల సంఖ్య మరీ ఎక్కువగా ఉంది. 2008 నుంచి 2018 మధ్య అక్కడ 278 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

దేశంలో మూడో ధనిక రాష్ట్రం


సిక్కిం 1975లో ఇండియాలో చేరింది. అప్పటి నుంచి క్రమక్రమంగా అభివృద్ధి చెందుతోంది. 2004-05 నుంచి 2011-12 మధ్య ఆ రాష్ట్రంలో వృద్ధి రేటు భారీగా నమోదైంది. స్టేట్ నెట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ రేటులో ఇండియాలోనే టాప్‌లో నిలిచింది. 2015-16 ఆర్థిక సర్వే ప్రకారం దేశంలో మూడో ధనిక రాష్ట్రం సిక్కిం. 100 శాతం ఆర్గానిక్ రాష్ట్రంగా 2018లో అక్టోబర్‌లో ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందింది. అక్షరాస్యత, పరిశుభ్రతలోనూ ముందుంది. ఓరకంగా సిక్కింను 'బంగారు రాష్ట్రం' అంటారు. కానీ వరుస ఆత్మహత్యలు అక్కడి ప్రజలను కలవర పరుస్తున్నాయి. వయసు, ఆడ, మగ, గ్రామం, పట్టణం, ధనిక, పేద అనే తేడా లేకుండా ఆత్మహత్యలు చేసుకుంటుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. మరి ఇంతలా సూసైడ్స్ పెరగడానికి కారణమేంటి?

వైవాహిక సమస్యలే టాప్

వైవాహిక సమస్యలు, మద్యం, మత్తు పదార్థాల వాడకం, నిరుద్యోగం, తాహతుకు మించి కోరుకోవడం, మానసిక సమస్యలను పట్టించుకోకపోవడం, కుటుంబ నిర్మాణం మారుతుండటం లాంటి రకరకాల కారణాలు ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాయని కొందరు నిపుణులు చెబుతున్నారు. మరికొందరు వ్యభిచారం, ఒంటతరితనం, సోషలైజేషన్ లేమి కూడా కారణమంటున్నారు. సిక్కింలో ఆత్మహత్య చేసుకున్నవారిలో 70 శాతం మంది ఒంటరివారే. పెళ్లై విడిపోయినవారు, తల్లిదండ్రులు వదిలేసిన పిల్లలు, పిల్లలు వదిలేసిన వృద్ధులు వీరిలో ఎక్కువగా ఉన్నారు. వ్యభిచారం, ఇతర కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్టు ఏ సర్వేలోనూ బయటపడలేదు. వైవాహిక జీవితంలో సమస్యల వల్లే ఎక్కువ మంది సూసైడ్ చేసుకున్నట్లు వెల్లడైంది. 2017 జూన్ 26న ఓ 12 ఏళ్ల బాలిక ఆత్మహత్య చేసుకుంది. కారణం తల్లిదండ్రుల నుంచి దూరమవడం. తన తల్లిదండ్రులు విడిపోయి వాళ్ల వాళ్ల ప్రేమికులతో వెళ్లిపోవడంతో తను ఒంటరైపోయింది.

మత్తు మందు, ఆల్కహాలూ..

డ్రగ్స్‌కు అలవాటు పడటం కూడా ఆత్మహత్యలకు మరో కారణం. నైట్రోసన్, స్పాస్మో ప్రాక్సివాన్, దగ్గు మందులను యువత డ్రగ్స్‌గా వాడుతోంది. పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి నుంచి అవి అక్రమంగా రాష్ట్రంలోకి వస్తున్నాయి. డ్రగ్స్ దొరకని సమయంలోనే తట్టుకోలేని యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటారని నిపుణులు అంటున్నారు. డ్రగ్స్ దొరకకపోవడంతో రాబిన్‌రాయ్ అనే యువకుడు కూడా ఇలానే ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించాడు. కానీ బతికి బయటపడ్డాడు. ప్రస్తుతం సూసైడ్ హెల్ప్‌లైన్ సెంటర్‌లో కౌన్సిలర్‌గా పని చేస్తున్నాడు. ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తోందంటూ రోజూ అనేక మంది నుంచి తనకు ఫోన్లు వస్తుంటాయని ఆయన చెప్పారు.


ఆత్మహత్యలతో తల్లడిల్లుతున్న సిక్కిం

ప్రభుత్వం ఏం చేస్తోంది?

2011లో సిక్కిం మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. 2015లో 24 గంటల సూసైడ్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించింది. అయితే ఇప్పటివరకు 182 ఫోన్‌కాల్స్ మాత్రమే అసలైనవి వచ్చాయని, ఈ హెల్ప్‌లైన్ గురించి ఎవరికీ తెలియదని ఓ అధికారి చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు పట్టణ ప్రాంతాలకే పరిమితమవుతున్నాయని నిపుణులు అంటున్నారు. కౌన్సిలర్లు, మానసిక సలహాదారులతో బృందాలు ఏర్పాటు చేసి మూరుమూల ప్రాంతాలకు పంపితే మంచి ఫలితాలుంటాయని సూచిస్తున్నారు. స్కూళ్లు, కాలేజీల్లో ఎప్పటికప్పుడు వర్క్‌షాప్‌లు నిర్వహించాలంటున్నారు.

నిరుద్యోగంలో రెండో స్థానం

లేబర్ బ్యూరో లెక్కల ప్రకారం నిరుద్యోగంలో సిక్కిం దేశంలోనే రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం రాష్ట్ర యువత కేవలం ప్రభుత్వోద్యోగాలపైనే దృష్టిపెడుతున్నారని, కానీ అందరికీ తగినన్ని ఉండవు కదా అని గిటారిస్ట్ ప్రవేశ్ లమ అంటున్నారు. ఈ క్రమంలో ఉద్యోగం రాని యువతీయువకులు కోపం, అసహనంతో మత్తుకు అలవాటు పడుతున్నారని, కొందరు నేరాల ఊబిలో చిక్కుకుంటున్నారని, చివరకు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. సిక్కిం గత పాలకులు ఆత్మహత్య చేసుకున్నట్టు చరిత్రలో లేదు. కానీ గత జన్మలో వ్యభిచారం చేసిన వారే ఇలా అకస్మాత్తుగా ఆత్మహత్యలు చేసుకుంటారని స్థానిక గిరిజనులు నమ్ముతుంటారని లింబు కల్చరల్ స్టడీస్‌లోని ప్రొఫెసర్ ఖండక్ చెప్పారు. పశ్చిమ సిక్కింకు చెందిన మరో వ్యక్తి తమంగ్ మాట్లాడుతూ.. 'ప్రతి ఒక్కరు తనకు ఆయుష్షు ఉన్నంత కాలం జీవించాలి. మధ్యలో ఆత్మహత్య చేసుకుంటే వారి ఆత్మ తనకు తెలిసిన వాళ్లను అచ్చం తను చనిపోయినట్టే చంపుతుంది. తన ఆయుష్షు పూర్తయ్యే వరకు ఇది జరుగుతూనే ఉంటుంది' అన్నారు. మానసిక సమస్యలున్న వారు డాక్టర్ల దగ్గరకు వెళ్లకుండా గురువులను ఆశ్రయిస్తుంటారని, ఇది కూడా ఆత్మహత్యలకు మరో కారణమని కొందరంటున్నారు.





మక్కలు కాల్చేందుకు సోలార్ ఫ్యాన్

- బెంగళూరు బామ్మను ఆదుకున్న సెల్కో ఫౌండేషన్

అది కర్నాటక రాజధాని బెంగళూరులోని విధానసౌధ ప్రాంతం. ఓ బామ్మ బండిపై కాల్చిన మొక్కజొన్న కంకులు అమ్ముతోంది. చాలా మంది వచ్చి కాల్చిన కంకులు తింటూ ఆమె బండివైపే ఆసక్తిగా చూస్తున్నారు. ఎందుకో తెలుసా? ఆమె కంకులు కాల్చేందుకు వినూత్న పద్ధతిని ఫాలో అవుతోంది. విసినకర్రకు బదులు సోలార్ ఫ్యాన్‌తో నిప్పులు రగులుస్తోంది. 75 ఏళ్ల సెల్వమ్మ 20 ఏళ్లుగా విధానసౌధ దగ్గర మొక్కజొన్నలు అమ్ముతోంది. మొదట్లో మొక్కజొన్న కంకులు కాల్చేందుకు విసనకర్ర, బొగ్గులు వాడేది. ఇందుకు చాలా కష్టపడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆమెకు ఆ బాధ తప్పింది. గాలి కోసం సోలార్ ఫ్యాన్ వాడుతోంది. 'మొక్కజొన్న కంకులు కాల్చేందుకు విసనకర్ర ఊపి ఊపి చేతులు నొప్పి పుట్టేవి. సెల్కో ఫౌండేషన్ వాళ్లు సోలార్ ఫ్యాన్ ఇచ్చిన తర్వాత నా కష్టం తీరింది. అప్పట్లో మొక్కజొన్న కాల్చేందుకు 10 నిమిషాలు పట్టేది. ఇప్పుడు ఐదు నిమిషాల్లోనే రెడీ అవుతున్నాయి' అని సెల్వమ్మ ఆనందం వ్యక్తం చేసింది. పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థ సెల్కో ఫౌండేషన్. కష్టజీవుల సమస్యలకు టెక్నాలజీతో పరిష్కారం చూపుతోంది. అవసరమైన పరికరాలను ఉచితంగా అందజేస్తోంది.

6టీ బ్యాటరీ డౌన్

వన్ ప్లస్ ఫ్లాగ్‌షిప్ ఫోన్ 6టీ బ్యాటరీ వేగంగా దిగిపోతోందట. కొందరు యూజర్లు ఈ సమస్యను కంపెనీ దృష్టికి తీసుకెళ్లారు. అధికారిక ఫోరంలోనూ, గూగుల్ ప్లే స్టోర్‌లోనూ, రెడ్డిట్‌లోనూ ఈ సమస్య గురించి చర్చిస్తున్నారు. బ్యాటరీ 80 శాతం లెవల్ నుంచి స్పీడ్‌గా డ్రెయిన్ అయిపోతున్నట్లు కొందరు యూజర్లు చెబుతున్నారు. ఇంతకుముందు ఆరు నుంచి ఏడు గంటల పాటు వచ్చే బ్యాటరీ, నాలుగు గంటలకే అయిపోతోందని వాపోతున్నారు. అప్‌డేట్స్‌లో సమస్య వల్లే ఇలా జరిగివుంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకసారి డేటాను బ్యాకప్ చేసుకుని, ఫోన్‌ను 'ఫ్యాక్టరీ రీసెట్' చేసి చూడాలని సూచిస్తున్నారు. ఇటీవల వన్‌ప్లస్ 3 తర్వాతి మోడళ్లన్నింటికి కంపెనీ అప్‌డేట్స్ ఇచ్చింది. ఆ తర్వాత ఈ బ్యాటరీ డ్రెయినింగ్ సమస్య వచ్చినట్లు సమాచారం. అయితే వన్‌ప్లస్ దీనిపై ఇంతవరకూ స్పందించలేదు. కొత్త అప్‌డేట్ వచ్చే వరకూ ఇదే పరిస్థితి కొనసాగొచ్చు. 'ఆండ్రాయిడ్ పై'తో రిలీజయిన తొలి స్మార్ట్‌ఫోన్ వన్‌ప్లస్ 6టీనే. దేశంలో యాపిల్ ఫోన్ల మార్కెట్‌ను వన్ ప్లస్ సగానికి సగం పడగొట్టేసిన సంగతి తెలిసిందే.

ఏటా 5 కోట్ల టన్నుల ఈ-చెత్త

- విలువ రూ.4 లక్షల కోట్లు: యూఎన్
- అందులో 20 శాతమే రీ సైక్లింగ్
- చెత్త తగ్గింపుపై కంపెనీలతో సంప్రదింపులు

సాంకేతికత పెరగడం.. అందరికీ అందుబాటులోకి రావడంతో ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం విపరీతంగా పెరిగింది. ఎక్కడ చూసినా స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలే. అయితే ఉత్పత్తిపై దృష్టి పెట్టిన కంపెనీలు వాటి పనైపోయాక తీసుకునే జాగ్రత్తలను మాత్రం గాలికొదిలేశాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఏటా 5 కోట్ల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని, దాని విలువ అక్షరాల రూ. 4 లక్షల 40 వేల కోట్లని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ఈ మేరకు 'ఎ న్యూ సర్క్యులర్ విజన్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టైమ్ ఫర్ గ్లోబల్ రీబూట్' పేరుతో నివేదిక విడుదల చేసింది. ఈ ఎలక్ట్రానిక్ చెత్తలో 20 శాతమే రీ సైక్లింగ్ అవుతోందని, దీంతో వేల మెట్రిక్ టన్నుల ఈ వ్యర్థాలు సాధారణ చెత్తలో కలిసి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయంది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా లక్షల్లో కార్మికులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే ఈ వేస్ట్ తరలిస్తున్నారని, నాశనం చేస్తున్నారని.. ఒక్క చైనాలోనే ఈ-చెత్త కోసం 6 లక్షల మంది పని చేస్తున్నారని చెప్పింది. వీళ్లు చెత్త నుంచి వచ్చే క్యాడ్మియం, పాదరసం, సీసం లాంటి రసాయనాలు పీల్చి రోగాల బారిన పడుతున్నారంది. 'పెద్ద బ్రాండ్లు, చిన్న సంస్థలు, ట్రేడ్ యూనియన్లు, సివిల్ సొసైటీలతో మాట్లాడి ఈ వేస్ట్ తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. సరికొత్త బిజినెస్ మోడల్ తయారీకి కృషి చేస్తున్నాం. వస్తువుల ట్రాకింగ్, జీవితకాలం ముగిశాక వాటిని రీ సైక్లింగ్ చేయడంపై ప్రణాళికలు రచిస్తున్నాం' అని చెప్పింది.





పంటల్ని తింటున్నయని వాటినే తింటున్నరు

- అసోంలోని మజూలీల పురుగుల పై
- త్వరలో 'పెస్టారెంట్' తెరవబోతున్న సైంటిస్టులు

అరిటాకు విస్తరిలో ముద్ద పప్పు, ఆవకాయ, పప్పుచారు ఇలా షడ్రుచులను లాగించేసే వాళ్లను చూసేవుంటారు. కానీ పురుగులను పంచభక్ష పరమాన్నంలా ఫీల్ అవుతూ, వాటి వేపుడును అరిటాకులో వడ్డించుకు తినే వాళ్లను చూశారా? కనీసం వాళ్ల గురించి విన్నారా? అసోంలోని మజూలీ ద్వీప ప్రజలు పురుగుల వేపుడు లాగించేస్తూ ''ఆహా ఏమి రుచి.. తినరా మై మరచి'' అంటున్నారు. వీళ్లకు గ్రబ్ పురుగుల్ని(స్థానికంగా 'హాటిపక్' అని పిలుస్తారు) తినొచ్చని చెప్పిందెవరో తెలుసా? మన దేశ వ్యవసాయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్). మజూలీలో పంటల్ని నాశనం చేస్తున్న గ్రబ్ పురుగుల్ని సైంటిస్టులు పరిశీలించారు. వాటిలో పోషక విలువలు ఉన్నాయని, మనుషులు వాటిని కాల్చుకుని తినొచ్చని గ్రహించారు. జనానికి దీనిపై అవగాహన కల్పించేందుకు చాలా చోట్ల మీటింగ్‌లు నిర్వహించారు. ఆ తర్వాత రైతులు ఒక్కొక్కరిగా తమ పంట పొలాల్లో కనిపించిన పురుగుల్ని పట్టుకుని వేపుడు చేసుకుని తినడం మొదలుపెట్టారు. రుచి బాగా ఉండటంతో కొన్ని రోజులకు గ్రబ్ పురుగుల పైకు బాగా డిమాండ్ ఏర్పడింది. దీంతో పొలాల పక్కన 'పెస్టారెంట్లు' తెరవాలని ప్రాజెక్టు సైంటిస్టు బాదల్ భట్టాచార్య భావిస్తున్నారు. వచ్చే ఏప్రిల్ నెలలో తొలి పెస్టారెంట్‌ను మొదలుపెడతామని తెలిపారు. మజూలీలో 300 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పంట పొలాలు ఉన్నాయి. బంగాళదుంప, చేమ దుంప, పెసర తదితర పంటలు బాగా పండుతాయి. వీటిలో 35 నుంచి 40 శాతం పంటను గ్రబ్ పురుగుల లార్వాలు ధ్వంసం చేసి పారేసేవి. పెద్దైన తర్వాత మొక్కల మధ్య తిరుగుతూ సంతానోత్పత్తి చేస్తాయి. 2005 నుంచి హాటీపక్ వల్ల మజూలీ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పురుగులను ఆహారంగా తీసుకోవచ్చని గుర్తించిన బాదల్‌కు హెచ్‌కే జైన్ సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అవార్డు లభించింది.

తప్పుగా అలెగ్జాండర్ మరణ నిర్ధారణ
ఇప్పటి వరకు చెబుతున్న తేదీ కరెక్ట్ కాదు
న్యూరోలాజికల్ డిజార్డర్ వల్ల ఆరు రోజులు జీవచ్ఛవంలా బతికాడు
అందుకే అప్పటిదాకా శరీరం కుళ్లిపోలేదు
యూనివర్సిటీ ఆఫ్ ఒటాగోకి చెందిన కేథరిన్ హాల్ కొత్త థియరీ

గ్రీకు వీరుడి మరణం లేటు మార్చేయండి డేటు

అలెగ్జాండర్ ది గ్రేట్. విశ్వ విజేత. యుద్ధానికే కొత్త నిర్వచనం ఇచ్చిన గ్రీకు వీరుడు. ఆయన విజయాలు ప్రపంచానికి తెలుసు. మరణం మాత్రం ఓ మిస్టరీ. ఆయన మృతిపై వచ్చిన థియరీలు కోకొల్లలు. కానీ స్పష్టత కరువు. ఆయన టైఫాయిడ్ వల్ల చనిపోయారా? మలేరియా కారణంగానా? మద్యం ప్రభావం వల్లనా? లేక జైలులో హత్యకు గురయ్యారా? ఇంతకీ ఆయన చనిపోయిన తేదీ కరెక్టేనా?

కొత్త థియరీ

323 బి.సి.లో అలెగ్జాండర్ తన 32 ఏళ్ల వయసులో బాబిలోన్‌లో చనిపోయారు. ఆయన ఎలా మరణించారనే దాన్ని కచ్చితంగా నిరూపించే ఆధారాలు దాదాపుగా లేవు. అయితే న్యూజిల్యాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఒటాగోకి చెందిన డునెడిన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో పని చేసే సీనియర్ లెక్చరర్ కేథరిన్ హాల్ ఓ కొత్త థియరీ ప్రతిపాదించారు. గులియన్ బార్రే సిండ్రోమ్(జీబీఎస్) అనే న్యూరోలాజికల్ డిజార్డర్ వల్లే అలెగ్జాండర్ చనిపోయారని చెప్పుకొచ్చారు. చనిపోయారని ప్రకటించిన ఆరు రోజుల తర్వాతే అలెగ్జాండర్ నిజంగా చనిపోయారని వెల్లడించారు.

ఆ రోజు చనిపోలేదు

అలెగ్జాండర్ చనిపోయిన తర్వాత 6 రోజుల వరకు ఆయన శరీరం కుళ్లిపోలేదు. దీంతో ఆయన్ను దేవుడని ప్రాచీన గ్రీకులు నమ్మారు. దీనిపై కేథరిన్ హాల్‌కు ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. గతంలో అలెగ్జాండర్ మృతిపై వచ్చిన థియరీలు ఆమె ప్రశ్నలకు సమాధానాలివ్వలేదు. 'ఆరు రోజుల పురాణం' నిజమైతే.. ఆ ప్రకారం గతంలో పేర్కొన్న రోజున అలెగ్జాండర్ చనిపోలేదని హాల్ చెప్పారు. తన థీసిస్‌ను బలపరిచేందుకు ఆమె జీబీఎస్‌పై రీసెర్చ్ చేశారు.

అందుకే కుళ్లిపోలేదు..

''జీబీఎస్ అనే న్యూరోలాజికల్ డిజార్డర్ వచ్చిన వారిలో శ్వాస తీసుకునే వేగం బాగా తగ్గిపోతుంది. మామూలుగా చూస్తే వారు శ్వాస తీసుకుంటున్నారో లేదో కనుక్కోలేం. పరీక్షించి చూస్తేనే తెలుస్తుంది. దీంతో నాడు అలెగ్జాండర్ ఊపిరి పీల్చుకుంటున్నా, దాన్ని గుర్తించలేక ఆయన చనిపోయారని నిర్ధారించారు. ఆయన అప్పటికి చనిపోలేదు కాబట్టే, శరీరం కుళ్లిపోలేదు. అంతేగానీ ఆయన దేవుడు కాదు'' అని యూనివర్సిటీ ఆఫ్ ఒటాగో వెల్లడించింది.

మరి ఆ ఆరు రోజులు?

'చనిపోయిన' ఆరు రోజుల తర్వాతే అలెగ్జాండర్ నిజంగా చనిపోయారు. మరి కండరాలు కదల్చలేని స్థితిలో ఉన్న అలెగ్జాండర్ ఈ ఆరు రోజులు ఎలా గడిపారు? వారందరూ ఎందుకు గుర్తించలేదు? అనే దానిపై కేథరిన్ హాల్ తన రీసెర్చ్‌ను కొనసాగించారు. ''ఆయన చూపు అస్పష్టంగా మారి ఉంటుంది. రక్తపోటు కూడా పూర్తిగా తగ్గిపోయి ఉంటుంది. దీంతో కోమాలోకి వెళ్లిపోయి ఉంటారు. అయితే తన చుట్టుపక్కల ఏం జరుగుతున్నదో ఆయనకు తెలుస్తూనే ఉండి ఉంటుంది. కనీసం మాటలు వినే పరిస్థితిలో అయినా ఉండి ఉంటారు. తన తర్వాత వారసత్వం కోసం జనరల్స్ వాదులాట, ఈజిప్షియన్ ఎంబామర్ల (మమ్మీలను చేసే వాళ్లు) రాక, అంతిమ యాత్రకు ఏర్పాట్లకు జరిగిన చర్చలను ఆయన విని ఉండొచ్చు. ఆ ఆరు రోజులు ఆయన మనసు కలవరపడుతూ ఉండి ఉంటుంది'' అని హాల్ పేర్కొన్నారు. 'ది ఏన్షియంట్ హిస్టరీ' బులెటిన్‌లో ఆమె థియరీ ఇటీవల పబ్లిష్ అయింది.



జీబీఎస్ అంటే..

ఇదో అరుదైన న్యూరోలాజికల్ డిజార్డర్. శరీరంలోని రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపుతుంది. దీంతో కండరాలు బలహీనమైపోతాయి. తర్వాత ఇది పక్షవాతానికి దారి తీస్తుంది. మాట్లాడటానికి, నమలడానికి తీవ్ర ఇబ్బందిపడతారు. గుండె వేగం పెరుగుతుంది. శ్వాస తీసుకోవడంతో సమస్యతో ఆయాసం వస్తుంది. రాత్రిళ్లు పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుంది. ఈ సిండ్రోమ్ వచ్చిన రెండు వారాల నుంచి నాలుగు వారాల తర్వాత పూర్తిగా బలహీనమైపోతారు. అలెగ్జాండర్ విషయంలో మాత్రం శ్వాస తీసుకునే వేగం పూర్తిగా తగ్గిపోయింది. శ్వాస ఆడటం లేదని భావించి, ఆయన మరణించారని ప్రకటించారు.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.